www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 సంచిక : 265 | శనివారం 17-03-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

అవిశ్వాసానికి మద్దతు

టీడీపీ నిర్ణయం హర్షణీయం : సురవరం



న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పిస్తామన్న హామీని నెరవేర్చడంలో విఫలమైన ఆర్‌ఎస్‌ఎస్- బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానానికి మద్దతు ప్రకటించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నిర్ణయిం చింది. పార్టీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి ఈ మేరకు ఒక ప్రకటనను శుక్రవారం ఢిల్లీలో విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని బీజేపీ నెరవేర్చలేదని అంటూ సుబ్రమణ్యస్వామి ఉద్దేశపూర్వకంగా సమస్యను పక్కదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అరుణ్‌జైట్లీ, వెంకయ్యనాయుడుతో సహా ఎంపీలందరి ఒత్తిడి కారణంగా అప్పటి ప్రధానమంత్రి డా॥ మన్మోహన్ సింగ్ రాజ్యసభ సాక్షిగా ఇచ్చిన

- మిగతా 2 లో

బీజేపీ పతనం ప్రారంభం

- 2019లో 110 మించి సీట్లురావు
- మోడీ అధికారం చేపట్టాక తగ్గిన బీజేపీ బలం
- అసత్యాలతో మిత్రులను దూరం చేసుకుంటోంది : శివసేన విమర్శ

9లో

బ్లాక్‌మెయిల్‌కు భయపడం..

- బీజేపీ, టీడీపీ మాట తప్పాయి..
- జనసేన అధినేత పవన్ కళ్యాణ్
- సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో లెఫ్ట్ నేతలతో భేటీ

వామపక్షాలతో కలిసి పోరాటం



పవన్ కల్యాణ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న రామకృష్ణ. చిత్రంలో ఈడ్పుగంటి, ముప్పాళ్ల, మధు, రవీంద్రనాథ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం కమ్యూనిస్టులతో కలిసి ఉద్యమిస్తామని జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రకటించారు. విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం దాసరి నాగభూషణరావు భవన్‌కు శుక్రవారం ఆయన వచ్చి సీపీఐ, సీపీఎం రాష్ట్ర ముఖ్యనేతలతో దాదాపు అర్ధ గంటపాటు చర్చించారు. అనంతరం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ప్రత్యేక హోదా, విభజన హామీల్ని నెరవేర్చాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉందని పవన్ స్పష్టం చేశారు. నాడు రాష్ట్రానికి ఎంతోకొంత మేలు చేకూరుతుందనే ఆశతోనే టీడీపీ, బీజేపీలకు మద్దతిచ్చానని గుర్తుచేశారు. తాను ఎలాంటి పదవుల్ని ఆశించలేదని, కనీసం కప్పు కాఫీ కూడా తాగలేదని అన్నారు. ఈ రెండు పార్టీలూ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, రాష్ట్రాభివృద్ధిపై నిర్లక్ష్యం చూపాయని దుయ్యబట్టారు. ఈ పరిస్థితులకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలని అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్రంలో పెద్దఎత్తున అవినీతి పెరిగిపోతోందని, పదేపదే ప్రభుత్వం దృష్టికి తాను తీసుకెళ్లానని గుర్తుచేశారు. చేసిన తప్పులు సరిదిద్దుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. రాష్ట్రాభివృద్ధితోపాటు ప్రజల సంక్షేమం కోసం తాను ఎంతవరకైనా వెళ్తానని స్పష్టం చేశారు. సీపీఐ, సీపీఎం, ప్రజాసంఘాల నేతలతో కలిసి కూర్చుని చర్చించాక, ఒక ఉద్యమ దిశాదశను నిర్ణయిస్తామని వెల్లడించారు. పదో తరగతి విద్యార్థుల పరీక్షలు పూర్తయ్యాక ఉమ్మడి కార్యాచరణని ప్రకటిస్తామని, రాష్ట్రం నుంచి గ్రామ స్థాయి వరకూ ఉద్యమాన్ని నిర్మిస్తామని చెప్పారు.

నాడు రాష్ట్ర విభజన సమయంలో పార్లమెంటు సమావేశాలలో కొందరు పెద్ద మనుషులు రాష్ట్రానికి ప్రత్యేక హోదా పదేళ్ల నుంచి 15 ఏళ్లపాటు ఇస్తామంటూ వేలంపాటలా సభలో ప్రకటించారని పవన్ కళ్యాణ్ గుర్తుచేశారు. ఇప్పుడు రాష్ట్రానికి ఎలాంటి హోదా రాలేదనీ, వారికి మాత్రం పదవుల హోదాలు దక్కాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 25 మంది ఎంపీలను బ్లాక్‌మెయిల్ విధానాలకు పాల్పడుతోందని, ప్రజాస్వామ్యంలో ఇది మంచి పద్ధతి కాదని సూచించారు. అటు ఎంపీలను కేంద్రం భయపెట్టవచ్చునేమోగానీ, రాష్ట్రంలోని 5కోట్ల ఆంధ్రుల్ని భయపెట్టలేరని స్పష్టం చేశారు. మా నాన్న చిన్నతనం నుంచి కమ్యూనిస్టు

- మిగతా 2 లో

చర్చకురాని అవిశ్వాసం



సోమవారం మళ్లీ నోటీసులు

- తీర్మానానికి వామపక్షాల మద్దతు
- కాంగ్రెస్, ఎంఐఎం, టీఎంసీ రెడీ
- ఇతర పార్టీల మద్దతు కూడగట్టిన తెలుగు ఎంపీలు

విశాలాంధ్ర - న్యూఢిల్లీ : పార్లమెంట్ సాక్షిగా ఏపీకి ప్రత్యేక హోదా ఆందోళన కీలక మలు పులు తిరుగుతున్న నేపథ్యంలో... టీడీపీ ఆత్మరక్షణలో పడిపోయింది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేమని ఎన్డీయే సర్కారు తేల్చి చెప్పటంతో...ఏపీలో మనుగడపై టీడీపీకి ఆందోళన నెలకొంది. మరోవైపు వైసీపీ కేంద్రంపై గురువారమే అవిశ్వాస తీర్మాన నోటీసు ఇవ్వటంతో..టీడీపీకి దిక్కుతోచని స్థితి ఏర్పడింది. అయితే, వైసీపీ అవిశ్వాస తీర్మానానికి తొలుత మద్దతు తెలిపిన టీడీపీ అకస్మాత్తుగా నిర్ణయం మార్చుకుంది. తామే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు తమ ఎంపీలను ఆదేశించారు. దీంతో పార్లమెంటు వేదికగా ఏపీ రాజకీయాలు అనేక మలుపులతో రచ్చకెక్కాయి. ప్రత్యేక హోదా నినాదంతో వైసీపీ, టీడీపీ పోటాపోటీగా నోటీసులు ఇచ్చాయి. ఇక కాంగ్రెస్, ఏఐఎంఐఎం, సీపీఎం, సీపీఐ, తృణమూల్ కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానానికి మద్దతు ప్రకటించాయి. తమ నోటీసుకే మద్దతు లభించిందంటూ వైసీపీ, టీడీపీ ప్రచారం చెసుకుంటున్నాయి. ఈ స్థితిలొ అవిశ్వాస తిర్మానం విషయంలొ వైసీపీ, టీడీపీకి చిత్త శుద్ధిలేదని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విమర్శించారు. టీడీపీ చకచకా నిర్ణయాలు తీసుకుని ఢిల్లీలో శుక్రవారం ఉదయం రాజకీయ కలకలం సృష్టించింది. ఎన్డీయేతో తెగతెంపులు చేసుకున్నామని, ఇక కేంద్రంపై అవిశ్వాస తీర్మానం నోటీసు ఇవ్వాలని చంద్రబాబు తమ ఎంపీలను ఆదేశించారు. దీంతో పార్లమెంట్‌లో టీడీపీ పక్ష నేత తోట నరసింహం కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చారు. అంతకుముందు టీడీపీ ఎంపీలు పార్లమెంటు బయట

- మిగతా 2 లో

ఇక పీఎఫ్ పెన్షన్

రెట్టింపు...!

న్యూఢిల్లీ : పీఎఫ్ పెన్షనర్లకు శుభవార్త. ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్ కింద నెలవారీ పెన్షన్ చెల్లింపులను రెట్టింపు చేయబోతున్నట్టు తెలుస్తోంది. రాబోతున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సీనియర్ సిటిజన్‌లను ఆకట్టుకునేందుకు సర్కారు ఈ నిర్ణయం తీసుకోబోతుంది. దీంతో సుమారు 40 లక్షల మంది పెన్షనర్లు లబ్ధి పొందనున్నారు. ఐతే, ప్రభుత్వంపై ఏటా రూ.3000 కోట్ల భారం పడనుంది. ఈపీఎస్ కింద కనీస నెలవారీ పెన్షన్ వెయ్యి రూపాయలు ఇవ్వాలని 2014లో కేబినెట్ నిర్ణయించింది. ప్రస్తుతం దీని రెండింతలు చేస్తుండటంతో, ఇక నుంచి కనీసం రెండు వేల రూపాయలను పెన్షనర్లు అందుకోబోతున్నారు. ఈపీఎస్ పెన్షన్ రెండింతలు చేస్తున్న నేపథ్యంలో దీని ఖర్చును, లబ్దిదారుల సంఖ్యను లెక్కించాలని ఈపీఎఫ్‌ఓను కార్మిక మంత్రిత్వశాఖ ఆదేశించినట్టు సీనియర్ అధికారి చెప్పారు. ఈపీఎఫ్‌ఓ త్వరలోనే ఈ పెన్షన్‌ను రెండింతలు చేస్తూ తుది నిర్ణయం ప్రకటించనుందని తెలిపారు. ఈపీఎస్-95 కింద 60 లక్షల మంది పెన్షనర్లున్నారు. వారిలో నెలవారీ రూ.1500 కంటే తక్కువ పెన్షన్ తీసుకుంటున్న వారు

- మిగతా 2 లో

ఎన్డీఏతో కటీఫ్

కూటమి నుంచి వైదొలగిన టీడీపీ



- మోడీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మాన నోటీసులు
- తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సమావేశం కీలక నిర్ణయాలు

2లో

ప్రయోగశాలల నుంచి

భూమికి పరిశోధనలు

శాస్త్రవేత్తలకు ప్రధాని మోడీ పిలుపు

9లో

రాష్ట్ర ప్రయోజనాల కోసం

ముందడుగు

సీఎం చంద్రబాబు

3లో

ఇదీ లోకం!



ఏపీలో 'రాజకీయ సుడులు'

- టీడీపీపై పవన్ నిప్పులు కక్కడంతో మారిన స్వరూపం
- మూడు శిబిరాలుగా మారిన వైనం
- జాతీయ రాజకీయాలపై ప్రభావం

విశాలాంధ్ర-అమరావతి : ఏపీ రాజకీయాలు సుడులు తిరుగుతున్నాయి. వీటి ప్రభావం జాతీయ రాజకీయాలపై కూడా పడింది. ఇప్పటి వరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిల మధ్యనే ప్రధానపోరు సాగుతుందని భావించిన రాష్ట్ర రాజకీయ విశ్లేషకులు రెండురోజుల క్రితం జనసేన ఆవిర్భావ దినోత్సవంలో అధినేత పవన్ కల్యాణ్ ఒక్కసారిగా తెలుగుదేశంపై నిప్పులు కక్కటంతో రాష్ట్ర రాజకీయ స్వరూపం పూర్తిగా మారిపోయింది. గత నాలుగేళ్ళుగా మిత్రపక్షాలుగా కొనసాగిన టీడీపీ, బీజేపీల మధ్య కేంద్ర బడ్జెట్ చిచ్చుతో విబేధాలు ఏర్పడి కేంద్ర మంత్రివర్గం నుంచి టీడీపీ మంత్రులు రాజీనామాలు చేసే స్థితికి చేరాయి. రాష్ట్రంలోని బీజేపీ మంత్రులు కూడా రాజీనామా చేశారు. టీడీపీ, బీజేపీల మధ్య దూరం పెరగటం, వైఎస్ జగన్ ప్రత్యేక హోదా పేరుతో కేంద్రంపై అవిశ్వాస తీర్మానం పెడతానంటూ ప్రకటించారు. ఒక విధంగా ఈ ఆయుధాన్ని జగన్‌కు పవన్ కల్యాణ్ అందించారు. చంద్రబాబునాయుడు కేంద్రంపై వెనక్కు తగ్గకుండా ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని, విభజన హామీలు అమలు చేయాలని తన ఎంపీల ద్వారా పార్లమెంట్‌లో పోరును ఉధృతం చేశారు. జగన్ బీజేపీతో లాలూచీ పడుతున్నారన్న విమర్శలు కూడా వచ్చాయి. అదే సమయంలో జగన్ పవన్ కల్యాణ్‌ను టీడీపీ పార్ట్‌నర్‌గా నిందించారు. రాజకీయాలు ఇలా

- మిగతా 11 లో

కడుపుకోత !

శ్రీకాకుళాన్ని కుదిపేస్తున్న మాతాశిశు మరణాలు



- రక్తం అందుబాటులో లేకపోవడమే కారణం
- ఏజెన్సీ ప్రాంతంలో 41 శాతం నవజాత శిశు మరణాలు
- విచారణ చేపట్టిన విజిలెన్స్

విశాలాంధ్ర బ్యూరో-శ్రీకాకుళం : వెనుకబడిన శ్రీకాకుళం జిల్లా అనారోగ్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది.ఉద్దానం కిడ్నీ వ్యాధులతో వేలాదిమంది మృత్యువాత పడుతున్న దశలో, జిల్లా వ్యాప్తంగా శిశుమరణాలు బెంబేలెత్తిస్తున్నాయి. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా ఇదే విషయమై ఇటీవల మాట్లాడగా, విజిలెన్స్ యంత్రాంగం దర్యాప్తు ముమ్మరం చేస్తోంది. నవజాత శిశువుల సంరక్షణలో, పొరుగునే వున్న తెలంగాణ, తమిళనాడు రెండోస్థానంలో నిలిచాయి. ఇందుకోసం అక్కడి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. ఇటీవల ఢిల్లీలో జరిగిన జాతీయ శిశు ఆరోగ్య సమీక్షా సమావేశంలో 'సిక్‌నెస్ న్యూ బోర్న్ కేర్ యూనిట్ (ఎస్ ఎన్‌సీయూ) క్వాలిటీ ఆఫ్ కేర్ ఇండెక్స్'ను కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ విడుదల చేసింది. ఆ రాష్ట్రంలో శిశుమరణాల రేటు 39 నుంచి 31కి తగ్గిందని నివేదిక వెల్లడిస్తే మన రాష్ట్రంలో ఇప్పటికీ ఆ రేటు 39 గానే వుంది. పోషకాహార లోపం, రక్తహీనత (ఎనీమియా)తో జిల్లాలో మాతా, శిశుమరణాలు ఎక్కువగా ఉన్నట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా ఉద్దానం ప్రాంతంలోనూ, ఏజెన్సీ పరిసరాల్లోనూ ఈ మరణాల శాతం అధికంగా వుంది. నవజాత శిశు మరణాలను అరికట్టేందుకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పథకం నడుస్తున్నా ఎలాంటి ఉపయోగం లేకుండా పోతోంది. పోషకాహారం సరిగ్గా అందకపోవడమే

- మిగతా 2 లో

మియామిలో కూలిన కొత్త వంతెన



మియామి (ఫ్లోరిడా) : అమెరికా మియామిలో ఫ్లోరిడా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ వద్ద పాదచరుల కోసం కొత్తగా నిర్మించిన వంతెన కూలిపోయింది. ఈ ఘటనలో అనేక మరణాలు సంభవించినట్లు సమాచారం. వెంతన కూలిపోయిన ఘటనకు సంబంధించి ఏరియల్ ఫుటేజిలో శిథిలాల్లో అనేక కార్లు చిక్కుకొని, నుజ్జునుజ్జు అయినట్టు కనిపిస్తోంది. ఫైర్‌ట్రక్కులు, పోలీసులు, ఎమెర్జెన్సీ వాహనాలు ఘటనస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. శిథిలాల కింద చిక్కుకొన్న వారిని రక్షించేందుకు సహాయక సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనలో ఎంతమంది చనిపోయారన్నది తెలియాల్సి ఉందని పోలీసు అధికారులు వెల్లడించారు.

వెనిజులా ఎన్నికల్లో డిజిటల్ కార్డులు

కారకస్: మే20వ తేదీన జరిగే వెనిజులా అధ్యక్ష ఎన్నికల్లో డిజిటల్ కార్డులతో ఓటు వేయనున్నట్లు నేషనల్ ఎలక్టరల్ కౌన్సిల్ ప్రతినిధి టానియా వెల్లడించారు. సరికొత్త సాంకేతిక విధానంతో జరిగే ఈ ఎన్నికల్లో ఇది సరికొత్త ప్రయోగంగా అభివర్ణించారు. 2019-2025 కాలానికి గాను జరిగే అధ్యక్ష ఎన్నికలతోపాటు మునిసిపల్ లెజిస్లేటర్లకు కూడా ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల్లో తగిన అభ్యర్థులకోసం కసరత్తు జరుగుతోందని నేషనల్ ఎలక్టరల్ అఫీసు సెక్రటరీ వెల్లడించారు. 24 రీజియనల్ బోర్డులు, 335 మునిసిపల్ బోర్డులు, 71 పరోచియల్‌బోర్డులకు జరిగే ఎన్నికల్లో 33,783 పోలింగ్‌సెంటర్లు ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు.

విశాలాంధ్ర ప్రపంచం

యెమన్‌లో మానవతా చర్యలకు ఐరాస పిలుపు

ఐరాస : యెమన్‌లో పరిస్థితులు అత్యంత దయనీయంగా ఉన్నాయని, అక్కడ ప్రజలు ఆహారం, మందులు తదితర అత్యవసరాలు అందక ఇబ్బందులు పడుతున్నారని, అంతర్జాతీయ మానవతా చట్టం ప్రకారం వారిని ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి గురువారం అన్ని పార్టీలకు పిలుపునిచ్చింది. యెమన్‌కు మానవతా సహాయాన్ని చేరనివ్వాలని, వెంటనే ఆ దేశంలోని అన్ని పోర్టులను తెరవాలని, దిగుమతులను అనుమతించాలని సూచించింది. ప్రాణాలను కాపాడేందుకు శరవేగంగా సరకు సరఫరా జరిగేలా సనా ఎయిర్‌పోర్టు సేవలను విస్తృతపర్చాలని, నిత్యావసరాలతో పాటు ఔషధాలు తదితరాలను వేగవంతంగా సహాయార్థుల వద్దకు చేరేలా చూడాలని సూచించింది. మానవతా చర్యలను అడ్డుకోవడం అంతర్జాతీయ మానవతా చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుందని స్పష్టంచేసింది. 22.2 మిలియన్ మంది సహాయం కోసం వేచివున్నారని, సహాయార్థుల సంఖ్య గతేడాదిలో కంటే 3.4మిలియన్ల మేర పెరిగిందంటూ భద్రతా మండలి తీవ్ర ఆవేదనను వ్యక్తంచేసింది. యెమనీల పరిస్థితి దుర్భరంగా ఉందని, పోషకాహారం లేక అక్కడి ప్రజలు కలరా, అంటు వాధుల బారిన పడుతున్నారని, యెమన్‌లో కరవు ఛాయలు కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేసింది. అక్కడి సంస్థలు ప్రజలను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నాయని పేర్కొంది. అంతర్జాతీయ చట్టం నియమనిబంధనల ప్రకారం నడుచుకోవాలని, ప్రాణహానిని తలపెట్టరాదని, యుద్ధ నియామకాలను నిలిపివేయాలని సూచించింది. యెమన్‌లో బాలిస్టిక్ మిస్సైళ్ల దాడిని భద్రతా మండలి తీవ్రంగా ఖండించింది. సాధ్యమైనంత వరకు మారణాయుధాలను నిషేధించాలంటూ ఐరాస సభ్య దేశాలకు భద్రతా మండలి పిలుపునిచ్చింది.



ట్రంప్ ఆర్థిక సలహాదారుగా లేరీ కడ్లో



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆర్థిక సలహాదారుగా టీవీ వార్తల ప్రయోక్త.. లేరీ కడ్లో (70) నియమితులుకానున్నారు. ఈ విషయాన్ని గురువారం ట్రంప్ స్వయంగా వెల్లడించారు. ఆర్థిక సలహాదారు పదవికి రాజీనామా చేసిన గ్యారీ కొహెన్ స్థానంలో కడ్లో బాధ్యతలు చేపడతారు. అమెరికాకు దిగుమతయ్యే ఉక్కు అల్యూమినియంలపై తాజాగా ట్రంప్ భారీగా సుంకం విధించటాన్ని వ్యతిరేకిస్తూ కొహెన్ ఈ పదవి నుంచి తప్పుకున్నట్లు తెలుస్తోంది. 2016లో అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో డోనాల్డ్ ట్రంప్‌నకు అనధికార ఆర్థిక సలహాదారుగా కడ్లో పనిచేశారు. అమెరికాకు దిగుమతయ్యే ఉక్కు, అల్యూమినియంలపై సుంకం విధింపునకు కడ్లో కూడా వ్యతిరేకి. అయితే, భిన్నాభిప్రాయం కలిగి ఉండటాన్ని తాను స్వాగతిస్తానంటూ కడ్లో ఎంపికను ట్రంప్ సమర్థించుకున్నారు. రీగన్ ప్రభుత్వ హయాంలోనూ ఆర్థిక విధానాల రూపకల్పనలో కడ్లో తన సేవలను అందించారు. ప్రధాన ఆర్థిక సలహాదారులుగా 1987 నుండి 1994 వరకు పనిచేసారు.

క్షీణించిన సంబంధాలు

రష్యాపై నాలుగు దేశాల మండిపాటు

లండన్ : రష్యా ఏజెంటు సెర్గి స్క్రిపాల్, ఆయన కుమార్తెను అత్యంత ప్రమాదకరమైన విషం 'నర్వ్ ఏజెంట్' ఇచ్చి చంపిన ఘటనతో ప్రాచీన దేశాలు కలవరపాటుకు గురయ్యాయి. దీంతో రష్యాకు పాశ్చాత్య దేశాలకు మధ్య ఉన్న ఘర్షణ మరింత రాజుకున్నట్లయింది. ఈ ఘటన అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనగా అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ దేశాలు పేర్కొన్నాయి. దీని వెనుక రష్యా కుట్ర ఉన్నదంటూ మండిపడ్డాయి. మార్చి ఆరంభంలో శాలిబురీలో సెర్గి స్క్రిపాల్, ఆయన కుమార్తెపై విషప్రయోగం జరిగింది. వారికి నర్వ్ ఏజెంట్ ఇచ్చి హతమార్చారు. నర్వ్ ఏజెంట్‌ను దుర్వినియోగించినట్టు నాలుగు దేశాలు ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నాయి. రష్యా తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశాయి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత యూరప్‌లోనే తొలిసారిగా నర్వ్ ఏజెంట్ వినియోగం జరిగినట్టు వెల్లడించాయి. ఈ ఘటన బ్రిటన్ సార్వభౌమత్వంపై దాడిగా అభివర్ణించాయి. అంతేకాకుండా కెమికల్ వెపన్స్ కన్వెన్షన్‌తో పాటు అంతర్జాతీయ చట్టాన్ని అతిక్రమణగా పేర్కొన్నాయి. తమ భద్రతకు ఇది పెనుసవాల్‌గా నిలిచిందంటూ ఆందోళన వ్యక్తంచేశాయి. ఈ ఘటనకు రష్యానే సూత్రధారి అంటూ నిందించాయి. యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రస్క్ కూడా సంఘీభావం తెలిపారు. కాగా, రష్యా ఏజెంటు సెర్గి స్క్రిపాల్, ఆయన కుమార్తెను అత్యంత ప్రమాదకరమైన విషం 'నర్వ్ ఏజెంట్' ఇచ్చి చంపిన శాలిస్‌బురీలోని ప్రాంతాన్ని బ్రిటన్ ప్రధాని థెరిసా మే గురువారం సందర్శించిన విషయం తెలిసిందే.

అమెరికా భద్రతా సలహాదారుపై వేటు?



వాషింగ్టన్ : జాతీయ భద్రతా సలహాదారు ఆర్మీ లెఫ్టినెంట్ జనరల్ హెచ్‌ఆర్ మెక్‌మాస్టర్‌పై వేటు వేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయించినట్టు సమాచారం. త్రీస్టార్ ఆర్మీ జనరల్ అయిన హెచ్‌ఆర్ మెక్‌మాస్టర్ తలబిరుసు మనిషని, ఆయన బ్రీఫింగ్లు చాలా సమయం తీసుకుంటాయని, అలాగే అనవసర ప్రస్తావనలతో కూడి ఉంటాయని ట్రంప్ పేర్కొన్నట్టు తెలిసింది. జనరల్ మెక్‌మాస్టర్ స్థానంలో ఎవరిని నియమించాలన్న దానిపై ట్రంప్ కసరత్తు ప్రారంభించారు. పలువురి పేర్లను పరిశీలిస్తున్నారు. వారిలో బ్రిటక్‌కు అమెరికా మాజీ దౌత్యాధికారి జాన్ బోల్టన్, జాతీయ భద్రతా మండలి చీఫ్‌ఆఫ్ స్టాఫ్ కేత్ కెల్లో పేర్లు ఉన్నట్టు సమాచారం. అయితే, భద్రతా సలహాదారు మెక్‌మాస్టర్‌ను తప్పించడం ఇప్పట్లో సాధ్యంకాకపోవచ్చు. ఆయనను అవమానించకుండా తప్పించాలని భావిస్తున్న ట్రంప్ ఆచితూచి వ్యవహరిస్తున్నారు. అదే సమయంలో సమర్థ అధికారిని ఆయన స్థానంలో నియమించాలని యత్నిస్తున్నారు. కాగా, కార్యదర్శి రెక్స్ టిల్లర్‌సన్‌పై ఇటీవల వేటు పడడం తెలిసిందే.

ఆఫ్రిన్‌పై ఈయూ పార్లమెంటు తీర్మానం

టర్కీ తిరస్కరణ



అంకారా : ఉత్తర సిరియాలోని కుర్దిష్ ప్రాంతమైన అఫ్రీన్‌లో కొనసాగుతున్న టర్కీ మిలిటరీ ఆపరేషన్‌ను వెంటనే నిలిపివేయాలంటూ యూరోపియన్ పార్లమెంటు తీర్మానించడాన్ని టర్కీ అధ్యక్షుడు రిసెప్ తయ్యప్ ఎర్డోగన్ తోసిపుచ్చారు. అంకారాలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడుతూ సిరియాలోని అఫ్రిన్ నుంచి టర్కీ సైన్యాన్ని ఉపసంహరించుకోవాలని యూరోపియన్ పార్లమెంటు సూచిస్తోందని, అది జరగని పని అని తెల్చిచెప్పారు. వారివన్నీ విఫల ప్రయత్నాలేనని చెప్పారు. "పెద్దగా ఆశలు పెట్టుకోవద్దు. మా పని పూర్తి అయ్యేంత వరకు అక్కడ (అఫ్రీన్) నుంచి కదిలేది లేదు" అని ఎర్డోగన్ స్పష్టంచేశారు. ప్రస్తుతం అఫ్రీన్‌లో కొనసాగుతున్న ఆలివ్ బ్రాంచ్ ఆపరేషన్‌పై యూరోపియన్ యూనియన్ టర్కీని ఒక్క మాట కూడా అనలేదని ఎర్డోగన్ వెల్లడించారు. అఫ్రీన్‌లో ఆపరేషన్ ఆలివ్ బ్రాంచ్ మొదలైనప్పటి నుంచి 3,525 మంది ఉగ్రవాదులను ఏకాకులు చేశామని, అఫ్రీన్ సిటీ సెంటర్‌ను తమ అధీనంలో తీసుకోవడానికి పెద్దగా సమయం పట్టదని అన్నారు. కాగా, అఫ్రీన్‌లో దిగజారుతున్న పరిస్థితులు కలవరపాటుకు గురిచేస్తున్నాయంటూ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని యూరోపియన్ పార్లమెంటు ఈనెల 15న ఆమోదించింది.

భయపడం..

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులేనని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. వామపక్ష, సోషలిస్టు భావజాలాలను తాను గౌరవిస్తానని చెప్పారు. రాష్ట్రంలో అవినీతి, దోపిడీ అరికట్టేందుకు వామపక్ష భావజాల ఉద్యమమే ముందు వుంటుందని ప్రశంసించారు. వారి ఉద్యమాలు అందరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. 2014 ఎన్నికల్లో కొన్ని పరిస్థితుల వల్లే కమ్యూనిస్టులతో కాకుండా..బీజేపీ, టీడీపీలకు తాను రాష్ట్ర పరిస్థితుల్ని దృష్టిలో వుంచుకుని మద్దతివ్వాల్సి వచ్చిందని వివరించారు. అటు తెలంగాణా, ఆంధ్రాలో ప్రాంతాలకు అతీతంగా సీపీఐ, సీపీఎంలు వేర్వేరుగా తీసుకున్న రాజకీయ విధాన నిర్ణయాల్నీ నాడు అర్థం చేసుకున్నానని చెప్పారు. నేటి రాజకీయ వ్యవస్థలో కోట్లాది రూపాయల డబ్బు వెదజల్లి ప్రజాప్రతినిధులుగా ఎన్నికవుతున్నారని చెప్పారు. వారంతా ఖర్చు పెట్టిన డబ్బును సంపాదించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని, ప్రజాసంక్షేమాన్ని విస్మరిస్తున్నారని పవన్‌కళ్యాణ్ వాపోయారు.

బీజేపీ నేతలు పదవులకు రాజీనామా చేయాలి : రామకృష్ణ

రాష్ట్రంలోని బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు వారి పదవులకు రాజీనామా చేసి, ఒంటరిగా పోటీ చేసి గెలుపొందాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సవాల్ విసిరారు. పవన్ కళ్యాణ్‌తో ఉభయ కమ్యూనిస్టుల భేటీపై బీజేపీ నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన తిప్పికొట్టారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హక్కుల హామీల అమలు సాధన కోసం మూడున్నరేళ్ల నుంచి ఉభయ కమ్యూనిస్టులు, హోదా సాధన సమితి అధ్వర్యాన ఉద్యమిస్తున్నామని, దాని ఫలితంతోనే నేడు వైసీపీ, టీడీపీలో కదలిక వచ్చిందని రామకృష్ణ స్పష్టం చేశారు.తమ పోరాటాల ఫలితంగా నేడు కేంద్రంపై అవిశ్వాసం పెట్టే స్థాయికి వైసీపీ వెళ్లిందని గుర్తుచేశారు.ఇదే బాటలో ఎన్డీయే నుంచి భయటకు వస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారని అన్నారు. టీడీపీకి చిత్తశుద్ధి వుంటే ఇచ్చిన మాట ప్రకారం ఎన్డీయే నుంచి వైదొలగి తమతో కలిసి ఉద్యమించాలని సూచించారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం పవన్ కళ్యాణ్ తమతో కలిసి ఉద్యమానికి ముందుకు రావడం శుభపరిణామమని కొనియాడారు.ఈ నెల 19వ తేదీన విజయవాడలో ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్వర్యాన నిర్వహించనున్న రౌండు టేబుల్ సమావేశానికి పవన్ కళ్యాణ్ విచ్చేస్తారని చెప్పారు.







ప్రజలను మోసగించిన టీడీపీ, బీజేపీ: మధు

ఎన్నికల హామీలు, విభజన చట్టాలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజల్ని టీడీపీ, బీజేపీలు మోసగించాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలిగేలా భవిష్యత్తులో ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనలో టీడీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

రాష్ట్ర ప్రజల కోసం ఉభయ కమ్యూనిస్టులతో కలిసి ఉద్యమానికి పవన్ ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కృష్ణాజిల్లా, విజయవాడ నగర కార్యదర్శులు అక్కినేని వనజ, దోనేపూడి శంకర్ పాల్గొన్నారు.

పవన్‌తో జరిగిన చర్చల్లో పై నాయకులతో పాటు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు(వైవీ), సీపీఐ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ ఈదృగంటి నాగేశ్వరరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ నెక్కంటి సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, పీజే చంద్రశేఖరరావు, రావుల వెంకయ్య, జి.ఓబులేసు, పి.హరినాథరెడ్డి, కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల కార్యదర్శులు అక్కినేని వనజ, జంగాల అజయ్‌కుమార్, దేగా ప్రభాకర్, విజయవాడ, గుంటూరు నగర కార్యదర్శులు దోనేపూడి శంకర్, కోటా మాల్యాద్రి, ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఆర్.రవీంద్రనాథ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ అఫ్సర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆవుల శేఖర్, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.సుబ్బారావు, ఏపీ ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి చంద్రానాయక్ తదితరులు పాల్గొన్నారు. తొలుత పవన్ కళ్యాణ్‌కు సీపీఐ నేతలు పుష్పగుచ్ఛం అందజేసి సాధరంగా పార్టీ కార్యాలయంలోకి ఆహ్వానించారు.

అవిశ్వాసానికి మద్దతు

(మొదటిపేజీ తరువాయి)

హామీ ఇదని స్పష్టం చేశారు. అందువల్ల ఇది ప్రభుత్వం ఇచ్చిన హామీనేనని, దీనికి తరువాత వచ్చిన ప్రభుత్వం కట్టుబడి ఉండాలని సూచించారు. బీజేపీ తన హామీలను నెరవేర్చదన్న విషయాన్ని తెలుసుకునేందుకు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎన్. చంద్రబాబునాయుడుకు నాలుగేళ్లు పట్టిందని చెప్పారు. ఎన్డీయే నుంచి బయటకు రావాలని టీడీపీ తీసుకున్న నిర్ణయం సానుకూల పరిణామమని సుధాకరరెడ్డి పేర్కొన్నారు.

గోరఖ్‌పూర్, ఫుల్‌పూర్, అరారియా ఓటర్లకు అభినందనలు

ఉత్తరప్రదేశ్, బీహార్ నుంచి లోక్‌సభకు జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ ఓటమిచెందడాన్ని వేరొక ప్రకటనలో సురవరం స్వాగతించారు. అక్కడి ఓటర్లకు అభినందనలు తెలిపారు. రాజస్థాన్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో ఓటమి అనంతరం బీజేపీకి ఎదురైన ఘోరపరాజయం ఇది. ఈ రెండింటి చోట ఫలితాలు చాలా స్పష్టంగా ఉన్నాయి. బీజేపీ ఓట్లు గణనీయంగా తగ్గిపోతున్నాయి. కార్పొరేట్ అనుకూల, ప్రజావ్యతిరేక విధానాల కారణంగా ప్రభుత్వంపై భ్రమలు తొలగిపోతున్నాయనడానికి ఈ ఫలితాలు అద్దంపడుతున్నాయని అన్నారు. నల్లధనం వెనుకకు తీసుకువస్తామని, ఉపాధి కల్పిస్తామని, ధరలను అదుపుచేస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని చెప్పారు. మతపరమైన విభజన అన్ని సమయాలలో పనిచేయదని హితవు పలికారు.

లౌకిక శక్తుల ఐక్యత మతతత్వ బీజేపీని మరింత ఏకాకిని చేయడంతో పాటు ఓడిస్తుందని ఆ ప్రకటనలో సురవరం పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వ ఫాసిస్టు ధోరణులను ఓడించేందుకు, ప్రజానుకూల ఆర్థిక విధానాల కోసం ఐక్య వామపక్షం పతాకం క్రింద పోరాడేందుకు దళితులు, మైనారిటీలు, ఇతర సామాజిక గ్రూపులతో పాటు వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులు ఐక్యం కావాలని సీపీఐ పిలుపునిస్తోందని తెలిపారు. వేగంగా మారుతున్న పరిణామాలు దేశంలోని ప్రజాతంత్ర శక్తుల పటిష్టమైన, విస్తృత ఐక్యతకు మార్గం సుగమం చేయాలని సురవరం ఆ ప్రకటనలో అకాంక్షించారు.

రెట్టింపు...!

(మొదటిపేజీ తరువాయి)

40 లక్షల కంటే తక్కువే. వీరిలో కనీసం వెయ్యి రూపాయల పెన్షన్ తీసుకునేది 18 లక్షలు మంది.

కనీస నెలవారీ చెల్లింపులను రూ.3000-రూ.7500కు పెంచాలని ఎంతో కాలంగా ట్రేడ్ యూనియన్లు, ఆల్ ఇండియా ఈపీఎస్-95 పెన్షనర్లు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. పార్లమెంటరీ ప్యానల్ కూడా ఈపీఎస్-95 అసెసీలకు అందించే నెలవారీ కనీస పెన్షన్ రూ.1000ను పెంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. నిత్యావసరాలు తీర్చేలా సామాజిక భద్రత ప్రయోజనాలుండాలని తెలిపింది.

చర్చకురాని అవిశ్వాసం

(మొదటిపేజీ తరువాయి)

ధర్నా నిర్వహించారు. వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి గురువారమే లోక్‌సభ సెక్రటరీ జనరల్ స్నేహలతా శ్రీవాస్తవకు నోటీసు అందజేశారు. 'లోక్‌సభ కార్యకలాపాల నియమావళిలోని చాప్టర్ 17లో గల 198(బి) నిబంధన కింద నేను ఈ తీర్మానాన్ని 2018 మార్చి 16న ప్రవేశపెట్టేందుకు నోటీసు ఇస్తున్నాను. ఈ తీర్మానాన్ని 2018 మార్చి 16 నాటి సభా కార్యకలాపాల సవరించిన జాబితాలో చేర్చాలని అభ్యర్థిస్తున్నాను. ఈ సభ మంత్రిమండలిపై అవిశ్వాసాన్ని వ్యక్తం చేస్తోంది' అని నోటీసులో పేర్కొన్నారు. శుక్రవారమూ వైసీపీ ఎంపీలు ఆందోళన జరిపారు. ఇదిలా ఉంటే, లోక్‌సభ కార్యకలాపాలు శుక్రవారం స్తంభించిపోయాయి. వరుసగా పదిరోజులుగా సభ సాగటం లేదు. ఏపీకి ప్రత్యేక హోదాపై వైసీపీ, టీడీపీ ఆందోళన చేస్తుండగా, రిజర్వేషన్ కోటాపై టీఆర్‌ఎస్, కావేరీ జలవివాదంపై ఏఐడీఎంకే ఎంపీలు సభలో ఆందోళన చేశారు. ప్రశ్నోత్తరాలను అడ్డుకున్నారు. ఆంధ్రప్రదేశ్ హక్కు ప్రత్యేక హోదా విషయంలో కేంద్రంపై వైసీపీ ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ స్పందించారు. వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి ఇచ్చిన నోటీసులు తనకు అందాయని చెప్పారు. ఈ మేరకు నోటీసులను ఆమె చదివి వినిపించారు. 'లోక్‌సభ నియమావళిలోని 17 అధ్యాయం 198(బీ) నిబంధన మేరకు వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసులు నాకు అందాయి. హౌజ్ అదుపులోకి వస్తే దానిపై చర్చ చేపడతాను..' అని స్పీకర్ చెప్పారు. ఆ సమయంలో కొన్ని పక్షాలు వేర్వేరు డిమాండ్లతో స్పీకర్ పోడియంను చుట్టుముట్టి నినాదాలు చేస్తుండటంతో ఆమె సభను సోమవారానికి వాయిదా వేశారు. ఏపీకి ప్రత్యేక హోదా హామీని నెరవేర్చనందుకు ఏపీ ఎంపీలు ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇస్తున్నట్టు కాంగ్రెస్ సభాపక్ష నేత మల్లిఖార్జున్ ఖర్గే తెలిపారు. సీపీఎం నేత సీతారాం ఏచూరి, ఎంఐఎం నేత అసదుద్దీన్ ఓవైసీ, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ కూడా కేంద్రంపై అవిశ్వాస తీర్మానానికి మద్దతు ప్రకటించారు. లోక్‌సభలో 50 మంది సభ్యులు అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలిపితే, సభలో చర్చకు అనుమతి ఇస్తారు. శుక్రవారమే అవిశ్వాస తీర్మానంపై చర్చ చేపట్టాలని వైసీపీ కోరింది. సోమవారం చేపట్టాలని టీడీపీ కోరింది. సభ స్తంభించటంతో అవిశ్వాస తీర్మానంపై చర్చకు అవకాశం రాలేదు. సోమవారం సభ సజావుగా సాగితే ఏపీ ఎంపీల అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగే అవకాశం ఉంటుంది. మరోవైపు రాజ్యసభలోనూ విపక్షాలు ఆందోళనకు దిగాయి.

కడుపుకోత !

(మొదటిపేజీ తరువాయి)

ఈ మరణాలకు కారణమని వైద్యులు చెబుతున్నారు. రక్తహీనత (హీమోగ్లోబిన్ ఐదు కంటే తక్కువ) ఉన్న వారు గర్భధారణే చేయకూడదు. ఒకవేళ అలాంటి వారున్నట్లయితే రక్తాన్ని ఎక్కించడం ఒక్కటే మార్గం. కానీ ప్రభుత్వ ఆసుపత్రులలో రక్తం తీవ్ర కొరత కావడంతో డాక్టర్లు ఏమీ చేయలేకపోతున్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఇటీవల నిర్వహించిన ఒక సాధారణ సర్వేలో (ఎస్‌ఆర్‌ఎస్) ప్రతీ వేయి మందిలో 39మంది శిశువులు రక్తహీనతతో మృత్యువాత పడుతున్నారని గుర్తించగా, శ్రీకాకుళం జిల్లాలో 41 మందిగా వున్నట్లు తేలింది. తల్లి రక్తహీనత బిడ్డపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

28 రోజుల్లో 15 మరణాలు

మాతా, శిశు సంక్షేమ శాఖ ప్రోటీన్లతో కూడిన ఆహారాన్ని అందించేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుండగా,ఈ జిల్లాలో మాత్రం పోషకాహార లోపం, రక్తహీనత లాంటి కారణాలతో 28 రోజుల్లో 15 మంది మృతిచెందారు. వీటిలో ఎక్కువ శాతం పలాస కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో నమోదైనవే. దీనిపై జిల్లా విజిలెన్స్ ఎస్పీ టీ.హరికృష్ణ దర్యాప్తు నిర్వహించారు. మృతిచెందిన వారిలో బేలిబద్ర గిరిజన గ్రామానికి చెందిన సవర కుమారి, సవర మాలతి అనే ఇద్దరు, మందస మండలంలో మహాదేవిపురానికి చెందిన గేదెల లక్ష్మి అనే ఓ మహిళ వున్నారు. రక్తహీనతతో గర్భం దాల్చడం, డెలివరీ సమయంలో రక్తం కొరత కారణంగా సత్వర వైద్యం అందించలేక పలాస సీహెచ్‌సీ చేతులెత్తేసినట్లు తేలింది. మెరుగైన వైద్యం పేరుతో పురుడు కోసం వచ్చిన వారిని 200 కిలోమీటర్ల దూరం లోని విశాఖకు రిఫర్ చేస్తున్నారు. ఈ ప్రయాణం నిండు గర్భిణీకి నరకప్రాయం. విశాఖ కింగ్‌జార్జి ఆసుపత్రికి (కెజిహెచ్)కు తరలించిన వారిలో ఉద్దానం ప్రాంతం కవిటికి చెందిన కర్రి రాజ్యలక్ష్మి, కొలిగాంకు చెందిన కర్రి సబిత, తేలుకుంచికి చెందిన పొందర రాజులమ్మ మృత్యువాత పడ్డారు. ఈ ప్రాంతం నుంచే గత 28 రోజులలో 15 మంది బాలింతలు, నవజాత శిశు మరణాలు నమోదయ్యాయి. ఉద్దానంలోని ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీలు చేసి, నవజాత శిశువులు, మాతా మరణాలు ఎక్కువ అవడంపై దర్యాప్తు జరుపుతున్నామని విజిలెన్స్ ఎస్పీ టి.హరికృష్ణ వెల్లడించారు. మరణాలకు కారణం రక్తహీనతేనని దానిని అధిగమించడానికి రక్తం అందుబాటులో లేకపోవడాన్ని ప్రాథమికంగా గుర్తించామని, అంగన్‌వాడీల ద్వారా అందుతున్న పోషకాహార వివరాలు, ఆరోగ్యసూచి నివేదికలను చూడనున్నామని ఆయన వివరించారు. ఇదే విషయమై జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సనపల తిరుపతిరావు 'విశాలాంధ్ర'తో మాట్లాడుతూ ఆరోగ్య రక్షణపై మరింత ప్రచారం కల్పించి సత్వర చికిత్సను అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు.

ఎన్డీఏతో కటీఫ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి :

తెలుగుదేశం పార్టీ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ పట్ల కేంద్ర ప్రభుత్వం వహిస్తున్న నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ వారం క్రితం టీడీపీ కేంద్ర మంత్రులిద్దరూ రాజీనామాలు చేయగా, ఇప్పుడు ఏకంగా ఎన్డీఏ కూటమి నుండి వైదొలుగుతున్నట్లు ప్రకటించింది. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వంపై టీడీపీయే అవిశ్వాసం తీర్మానం ప్రతిపాదించాలని కూడా నిర్ణయించింది. శుక్రవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన పొలిట్ బ్యూరో సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లోని అంశాలు, ఆనాటి ప్రధాని ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న జాప్యం, వీటి విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి పట్ల తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో తీవ్ర అభ్యంతరాన్ని, నిరసనను వ్యక్తం చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అశాస్త్రీయంగా జరిగింది. నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసింది. ఆస్తుల అప్పుల విభజనలో, విద్యుత్ పంపిణీలో, పన్నుల వసూళ్ళు, తిరిగి చెల్లింపుల్లో మన రాష్ట్రానికి మిక్కిలి నష్టం జరిగిందని, ఈ నేపథ్యంలో విభజన చట్టం ప్రకారం రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం ఆర్థిక సాయం చేయాల్సి ఉండగా బీజేపీ కూడా అన్యాయం చేసిందని ఈ సమావేశం అభిప్రాయపడింది. ప్రత్యేక హోదా ఇవ్వద్దని ఆర్థిక సంఘం చెప్పనప్పుడు, రాయితీలు, ప్రోత్సాహకాలు ప్రస్తుత హోదా రాష్ట్రాలకు కొనసాగిస్తున్నపుడు మన రాష్ట్రానికి ఎందుకు నిరాకరిస్తున్నారని కేంద్రాన్ని టీడీపీ పొలిట్ బ్యూరో ప్రశ్నించింది. చట్టంలో పేర్కొన్న అంశాలు, రాజ్యసభలో ఇచ్చిన హామీల అమలు అసంపూర్తిగా, ఆలస్యంగా జరగడం పట్ల రాష్ట్ర ప్రజానీకం తీవ్ర ఆగ్రహంతో ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రి 29 సార్లు ఢిల్లీ వెళ్లి ఈ విషయాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి పదేపదే తీసుకువెళ్లినా కేంద్రం ఉదాసీనత ప్రదర్శించింది. రాష్ట్రానికి చట్టపరంగా దక్కాల్సిన అంశాల పట్ల కేంద్ర ప్రభుత్వంలోని బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారు హేళనగా మాట్లాడడాన్ని ఈ సమావేశం తీవ్రంగా పరిగణించింది. రాష్ట్రాన్ని అప్రజాస్వామికంగా, అశాస్త్రీయంగా కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వం విభజించి అన్యాయం చేయగా, రాష్ట్రానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన భారతీయ జనతా పార్టీతో ఎన్నికల ముందు పొత్తు పెట్టుకున్నామని పేర్కొంది. కానీ ఆఖరి బడ్జెట్‌లో కూడా కేంద్రం రిక్తహస్తమే చూపించింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో పొందుపరచిన అంశాలు గానీ, రాజ్యసభలో ఆనాటి ప్రధానమంత్రి ఇచ్చిన హామీలు గానీ కనీసం ప్రస్తావనకు నోచుకోలేదు. దీనిపై నిరసనను తెలియజేస్తూ టీడీపీ మంత్రులు రాజీనామాలు సమర్పించారు. ఈ నిరసనను పరిగణనలోకి తీసుకుని ఏపీకి చట్టపరంగా, న్యాయంగా రావాల్సిన అంశాలను పొందుపరుస్తూ బడ్జెట్ ప్రతిపాదనలను సవరిస్తారని ఆశించాం. కానీ కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా లేదు. చివరకు ఏ చర్యకూ తావివ్వకుండా కేంద్ర బడ్జెట్‌ను లోక్‌సభలో ఆమోదింప చేసుకున్నారు. పైగా రక్షణ నిధులను కూడా రాష్ట్రానికి అడుగుతున్నామనే అర్థం వచ్చేలా వెటకారపు మాటలు మాట్లాడడాన్ని సమావేశం తీవ్రంగా గర్హించింది. కేంద్రానికి రాష్ట్రం పట్ల బాధ్యత ఉంది. కానీ కేంద్రం దానిని విస్మరించడంతో ఎన్‌డీఏ కూటమి నుండి వైదొలగాలని నిర్ణయించడంతోపాటు, అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించి ఈ బాధ్యతను ప్రభుత్వానికి గుర్తు చేయాలని, ఐదు కోట్ల రాష్ట్ర ప్రజల తరఫున మన ఆగ్రహాన్ని, అసంతృప్తిని కేంద్రానికి, దేశానికి తెలియజేయాలని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో నిర్ణయించింది.

మహిళలపై వేధింపులు సహించేది లేదు

విశాలాంధ్ర అమరావతి : మహిళలపై వేధింపులను సహించేది లేదని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. శుక్రవారం సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పని చేసే చోట మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. న్యాయ నిపుణులు, ప్రొఫెసర్, పోలీస్ శాఖ వారు చట్టంలో ఉన్న విధివిధానాలను సభ్యులకు వివరించారు. మంత్రి మాట్లాడుతూ 2013వ సంవత్సరంలోనే భారత ప్రభుత్వం చట్టాన్ని అమలులోకి తెచ్చినా చాలా మందికి దీనిపై అవగాహన లేదన్నారు. పని చేసే స్థలంలో లైంగిక వేధింపులు లేకుండా గౌరవంగా పని చేయడం మహిళలకు హక్కుగా ప్రభుత్వం కల్పించిందన్నారు. పని చేసే ప్రతి మహిళకు అవగాహన కల్పించేందుకే సదస్సు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 33 శాఖల్లో ఇంటర్నల్ ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేశామని, జిల్లా, మండల స్థాయిలో త్వరలో కమిటీలు ఏర్పాటు చెయ్యాలని అధికారులకు ఆదేశాలిచ్చినట్లు మంత్రి వివరించారు మహిళలు పని చేసే చోట వేధింపులకు గురవుతున్నట్లయితే డిప్రెషన్ కు లోనవకుండా కుటుంబ సభ్యులతో లేదా తోటి వారికైనా తెలియజేసి వేధింపులకు గురిచేసిన వారిపై ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావాలన్నారు. ప్రైవేటు కార్యాలయాలలో కూడా ఇంటర్నల్ ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చెయ్యాలన్నారు. మహిళలకు కౌన్సిలింగ్ నిర్వహించి ఆందోళనలకు గురికాకుండా ఈ కమిటీ చూసుకుంటుందని మంత్రి తెలియజేశారు. ఈ సమావేశంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ అరుణ్ కుమార్, కార్యదర్శి కె.సునీత, ప్రొఫెసర్ శాంతి, అడ్వకేట్ అనుపమ, ఇన్స్పెక్టర్ అరుణ, సచివాలయంలోని మహిళా ఉద్యోగుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



హోదా కోసం అలుపెరగని పోరాటం : జగన్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధించడానికి వైసీపీ నాలుగేళ్లుగా అలుపెరగని పోరాటం చేస్తోందని ఆపార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ప్రత్యేక హోదా విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తెలుగుదేశం పార్టీ దిగొచ్చిందని శుక్రవారం ట్విటర్‌లో జగన్ పేర్కొన్నారు. రాజకీయంగా వేరే మార్గం లేని పరిస్థితుల్లో, వైసీపీని మరోసారి టీడీపీ అనుసరిస్తోందని జగన్ వెల్లడించారు. ఇది ముమ్మాటికీ రాష్ట్ర ప్రజలు, ప్రజాస్వామ్యం సాధించిన విజయంగా ఆయన అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా విషయంలో వైసీపీ ఇప్పటికే అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇవ్వగా, టీడీపీ కూడా హోదా కోసం పోరాటం మొదలుపెడుతున్నట్లు ప్రకటిస్తూ, ఎన్డీయే నుంచి వైదొలిగి అవిశ్వాసం పెట్టనున్నామని చెబుతోంది.

బీజేపీ నేతలకు ఢిల్లీ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్ర బీజేపీ ముఖ్య నేతలంతా తక్షణమే ఢిల్లీ రావాలని కేంద్ర పెద్దల నుండి పిలుపువచ్చింది. ఎన్డీఏ నుండి వైదొలుగుతున్నట్లు తెలుగుదేశం పార్టీ శుక్రవారం ప్రకటించడంతోపాటు, కేంద్రంపై అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించిన నేపధ్యంలో ఏపీ రాష్ట్ర రాజకీయ పరిస్థితులను, భవిష్యత్ కార్యాచరణను చర్చించేందుకు ఈ పిలుపు వచ్చినట్లు నేతలు భావిస్తున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కంభంపాటి హరిబాబు, మరో ఎంపీ గోకరాజు గంగరాజులు ప్రస్తుతం ఢిల్లీలోనే వున్నారు. దీంతో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్సీ సోమువీర్రాజు, మాజీ కేంద్రమంత్రులు కావూరి సాంబశివరావు, దగ్గుబాటి పురంధరేశ్వరి, మాజీ రాష్ట్ర మంత్రి కన్నా లక్ష్మీనారాయణ తదితర ముఖ్య బీజేపీ నేతలందరికీ ఢిల్లీ రావాలని సమాచారం అందింది. శనివారం ఉదయం వీరంతా ఢిల్లీ బయల్దేరనున్నారు. తెలుగుదేశం పార్టీ ప్రస్తుతం బీజేపీతో పూర్తిగా తెగదెంపులు చేసుకున్నందున, విభజన అంశాల అమలు ఇప్పుడు స్పీడు చేస్తే బీజేపీ అకౌంట్‌లో పడి ఏపీలో పార్టీ బలో పేతమయ్యే అవకాశం వుంటుందని నేతలు భావిస్తున్నారు. ఇదే విషయాన్ని కేంద్ర పెద్దలకు వివరించి, రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కూడా పలు సూచనలు చేస్తామని ఆపార్టీ నేతలు చెబుతున్నారు.

ఇక టీడీపీ గెలవదు

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కుంటున్నారని బీజేపీ అధికార ప్రతినిధి నరసింహారావు వ్యాఖ్యానించారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తమ అసమర్థ పాలనను కప్పిపుచ్చుకునేందుకే చంద్ర బాబు, తెలుగుదేశం పార్టీ కేంద్రంపై నెపాన్ని నెడుతున్నాయని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌కు విభజన చట్టంలో పేర్కొనని వాటిని సైతం నెరవేరుస్తుంటే బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇక ఏపీలో టీడీపీ గెలిచే అవకాశమే లేదని జోస్యం చెప్పారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసం ముందడుగు

కేంద్రంపై చంద్రబాబు నిప్పులు



విశాలాంధ్ర-అమరావతి : 'రాష్ట్ర ప్రయోజనాల కోసం నేను ముందడుగు వేస్తున్నా.. ఎన్ని ఇబ్బందులు పెట్టినా వెనకడుగు వెయ్యను.. నేను పోరాడుతున్నా.. నా పోరాటానికి ప్రజల మద్దతు అవసరం.. నేను ఎవ్వరికి భయపడను.. భయపడాల్సి వస్తే రాష్ట్ర ప్రజానీకానికే భయపడతా' అని శుక్రవారం శాసన మండలిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఏపీకి సహాయం చేయకపోగా ఎగతాళి చేస్తారా అంటూ మండిపడ్డారు. అమరావతికి ప్రధాని మోడీ మట్టి, నీరు తెచ్చినప్పుడు... మన ఉద్యమంలో భాగస్వాములయ్యారని గర్వపడ్డామని చెప్పారు. దుగరాజుపట్నం పోర్టును ఎందుకివ్వరని, మరోచోట ప్రతిపాదిస్తే కడతారని నమ్మకమేంటని ఆయన ప్రశ్నించారు. రాజకీయ సుస్థిరత కోసం అసెంబ్లీ సీట్లు పెంచాలని, రెండు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్లు పెంచాలని విభజన చట్టంలో ఉందని బాబు గుర్తు చేశారు. రైల్వే జోన్‌పై నాలుగేళ్ల తర్వాత ఇప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామనడం ఏమిటని ప్రశ్నించారు. అమరావతికి 32 వేల ఎకరాలు ఎందుకని అడుగుతున్నారని, రాజధానిపై అవగాహన ఉండే పవన్ కల్యాణ్ మాట్లాడుతున్నారా అంటూ విమర్శించారు. రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి భూములిచ్చారని బాబు గుర్తు చేశారు. ఎంపీలు ఉభయ సభల్లో ఆందోళన చేస్తే పిలిచి మాట్లాడే తీరిక కేంద్రానికి లేదా చిన్న రాష్ట్రమని చిన్న చూపా అని ప్రశ్నించారు. ఆర్థిక బిల్లులో కూడా ఏ మార్పు లేకపోవడంతో ఎన్‌డీఏ నుంచి బయటకు వచ్చామని తెలిపారు.

అవినీతి కేసులో ఏ1, ఏ2 నిందితులకు అపాయింట్‌మెంట్ ఇస్తే అవినీతిని ఎలా రూపు మాపుతారని బీజేపీ నిలదీశారు. రాష్ట్రపతి అభ్యర్థిని ప్రకటించగానే వైసీపీ నేతలు బీహార్ వెళ్లిపోయారని, రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసి ఫొటోలు దిగి విడుదల చేశారని చంద్రబాబు అన్నారు. ఇలా చేయడం ఏమైనా ఉంటే సెటిల్ చేసుకుందామని సంకేతాలివ్వడం కాదా. ప్రధానిపై పీఎంఓ లోపల విశ్వాసం.. బయట అవిశ్వాసం.. ఇది మోసం కాదా అని చంద్రబాబు ప్రశ్నించారు.ప్రత్యేక హోదా వచ్చే అన్ని ప్రయోజనాలు కల్పిస్తామంటేనే ప్యాకేజీకి ఒప్పుకున్నామని ఆయన మరోమారు స్పష్టం చేశారు. ఎన్నికల తర్వాత పవన్ వైసీపీకి మద్దతిస్తారని వైసీపీ ఎంపీ ఒకరు చెప్పారని సీఎం తెలిపారు. పవన్ ప్రత్యేక హోదా కోసం ఉద్యమిస్తే మేం హోదా ఇస్తామని బీజేపీ నేతలే అంటున్నారు. పవన్ మాత్రం ఢిల్లీకి వెళ్లను.. ఇక్కడే పోరాడుతానని అంటున్నారు. ఇదేం రాజకీయం. నేను కేంద్రంపై పోరాడుతోంటే.. బీజేపీ వాళ్లు రాయలసీమ డిక్లరేషన్ ఇవ్వడం చిచ్చు పెట్టడం కాదా అని ఆయన ప్రశ్నించారు. రాయలసీమపై ప్రేమ ఉంటే కర్నూలులో సుప్రీం కోర్టు బెంచ్ పెట్టండి లేదా అమరావతిని దేశ రెండో రాజధానిని చేయండిని చంద్రబాబు నిప్పులు చెరిగారు.

నాలుగేళ్లుగా మంచిగానే.. : పవన్‌పై సీఎం విమర్శలు

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు నాలుగేళ్లుగా తాను మంచిగానే కనిపించానని, ఇప్పుడు ఉన్నట్టుండి.. మూడు మాటల్లో ఆరు అసత్యాలు మాట్లాడతానని అంటున్నారని సీఎం చంద్రబాబు విమర్శించారు. బీజేపీ సరిగా స్పందించకపోవడం వల్లే విడిపోయే పరిస్థితి వచ్చిందని తెలిపారు. మెగా ఆక్వాఫుడ్ పార్కు పెట్టే వాళ్లు తన బంధువులా అంటూ ప్రశ్నించారు. ఉద్యోగాలు వస్తాయనే మెగా ఆక్వాఫుడ్ పార్క్‌కు అనుమతిచ్చా మన్నారు. ఆక్వా పార్క్‌తో కాలుష్యం లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని, తుందుర్రు నుంచి సముద్రంలోకి పైప్‌లైన్ వేస్తున్నామని చంద్రబాబు చెప్పారు. పర్యావరణాన్ని పట్టించుకోవడం లేదని, పరిశ్రమలు రాలేదని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నో రాష్ట్రాల పోటీని ఎదుర్కొని కియాను ఏపీకి తెచ్చామని గుర్తు చేశారు. ఫాతిమా విద్యార్థుల కోసం అన్ని ప్రయత్నాలు చేశామని, ఆరోగ్య మంత్రి ఆరు సార్లు ఢిల్లీ వెళ్లారని చంద్రబాబు చెప్పారు. ఇసుక విక్రయాలకు సంబంధించి ఎక్కడో చిన్నచిన్న పొరపాట్లు జరిగితే.. మైనింగ్ స్కామంటూ గాలి జనార్దన్‌రెడ్డితో పవన్ ముడిపెట్టారని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపామని, అందుకు నిరసన వ్యక్తం చేస్తూ దివంగత మాజీ సీఎం జయలలిత లేఖ పంపానని చెప్పారు. ఎర్రచందనం వేలంలో రూ.1,230 కోట్ల ఆదాయం వచ్చిందని, వేలానికి కేంద్రం నుంచి అనుమతులు రావాలన్నారు. స్మగ్లర్ల ఆస్తుల స్వాధీనానికి చట్టం తీసుకొచ్చామని, విమర్శించే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని జనసేన అధినేతను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఏసీబీ కేసుల్లోనూ ఆస్తులు స్వాధీనం చేసుకుంటున్నామని తెలిపారు. ఉద్దానం కిడ్నీ సమస్య బాధితులకు రూ.2,500 పెన్షన్లు ఇస్తూ, డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రధాని మోడీపై ఒక్క మాట మాట్లాడకుండా తనపై ఫ్యాక్ట్స్ ఫైండింగ్ కమిటీ ఎలా వేస్తారని ప్రశ్నించారు. ఫ్యాక్ట్స్ ఫైండింగ్ కమిటీ వేసి రూ.75 వేల కోట్లు రావాలన్నారు. ఎక్కడికక్కడ అలజడులు సృష్టించి, కేంద్రానికి వెసులుబాటు కల్పించాలని చూస్తున్నారని చంద్రబాబు పవన్‌ను ఉద్దేశించి ఆరోపించారు. పోలవరం కాంట్రాక్ట్‌ను కావాల్సినవారికి ఇప్పించుకున్నారంటూ పవన్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని దుయ్య బట్టారు. వెనుకబడిన ప్రాంతాలకు రూ.1,050 కోట్లు మాత్రమే ఇచ్చారని గుర్తు చేశారు. పీఎంవో ఒప్పుకోలేదని, ఫిబ్రవరిలో ఇచ్చిన నిధులు వెనక్కి తీసుకున్నారని చెప్పారు. పోలవరం ప్రాజెక్టును అడ్డుకోవాలని వైసీపీ యత్నిస్తోందని సీఎం ఆరోపించారు. జాతీయ ప్రాజెక్టుల పనులు నత్తనడకన సాగుతున్నాయని, దేశవ్యాప్తంగా 16 జాతీయ ప్రాజెక్టులుంటే ఏదీ పూర్తికాలేదని చెప్పారు.

చింతమనేనికి ఊరట

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు హైకోర్టులో ఊరట లభించింది. భీమడోలు కోర్టు విధించిన రెండేళ్ల శిక్షపై హైకోర్టు స్టే విధించింది. 2011లో అప్పటిమంత్రి వట్టి వసంత్‌కుమార్‌పై దాడి, దూషణ కేసులో చింతమనేనికి భీమడోలు కోర్టు రెండేళ్ల శిక్ష విధించింది. తనను దోషిగా నిర్ధారిస్తూ భీమడోలు మెజిస్ట్రేట్ కోర్టు ఇచ్చిన ఆదేశాలపై పశ్చిమగోదావరి జిల్లా, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ దశలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ అభ్యర్థన మేరకు ఈ వ్యాజ్యాన్ని న్యాయస్థానం శుక్రవారానికి వాయిదా వేసింది. ఇరువర్గాల వ్యాజ్యాన్ని విన్న న్యాయస్థానం భీమడోలు కోర్టు విధించిన రెండేళ్ల శిక్షపై శుక్రవారం స్టే విధించింది.

జూలను ఆధునికీకరించండి



విశాలాంధ్ర-అమరావతి : రాష్ట్రంలోని జూలను అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునికీకరించాలని అటవీ శాఖ మంత్రి శిద్దా రాఘవరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో రాష్ట్రంలో జూల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి మంత్రి అధ్యక్షతన జూ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 8వ గవర్నింగ్ బాడీ సమావేశం జరిగింది. జూ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కు చైర్మన్‌గా అటవీ శాఖ మంత్రి శిద్దా రాఘవరావు వ్యవహరిస్తున్నారు. జూలను సందర్శించే సందర్శకుల సౌకర్యార్థం మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించడంతో పాటుగా ప్రతి జూలో జూ ప్రాముఖ్యతను, అందులో ఉన్న జంతుజాలాలను గురించి వివరించేందుకు ఒక మినీ థియేటర్‌ను విశాఖపట్నం, తిరుపతిలలో వెంటనే ఏర్పాటు చేయవలసిందిగా అధికారులను ఆదేశించారు. వేసవి వస్తున్నందున జంతువుల వడ దెబ్బకు గురవ్వకుండా చర్యలు తీసుకోవడంతో పాటుగా దేశ, విదేశాల్లోని జూల నుండి అన్ని రకాల జంతువులను తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలన్నారు. విశాఖపట్నం, తిరుపతి జంతు ప్రదర్శన శాల ప్రవేశ టికెట్‌ను రూ.10 నుంచి రూ.20లకు, బ్యాటరీ ఆపరేటెడ్ వాహనాల్లో జంతు ప్రదర్శనశాలను చుట్టురావడానికి చార్జీని రూ.30 నుంచి రూ.60కు, లయన్, టైగర్ సఫారీ చార్జి రూ.25 నుంచి 50కు పెంచుతూ (చిన్న పిల్లలకు రూ.20లు) జాప్ (జూ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ స్కూళ్లలో చదివే చిన్నారులకు జూ ప్రవేశ టికెట్టును రూ.10 నుంచి రూ.5కు తగ్గిస్తూ, గిరిజన విద్యార్థులకు, విభిన్న ప్రతిభావంతులకు జూలో ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. జూలో పని చేస్తున్న వెటర్నరీ డాక్టర్ల జీతాలను రూ.38,500 నుండి రూ.50 వేలకు, వెటర్నరీ ఆఫీసర్ల జీతాలను రూ.20 వేల నుండి రూ.40 వేలకు (యానిమల్స్ రెస్క్యూ సెంటర్లలో పని చేసేవారికి), వెటర్నరీ అసిస్టెంట్ జీతాన్ని రూ.13,200 నుండి రూ.25 వేలకు పెంచుతూ జాప్ నిర్ణయం తీసుకున్నారు. జూ క్యూరేటర్‌కు జూ అంతర్గత నిర్వహణకు సంబంధించి వివిధ ఖర్చుల నిమిత్తం మొత్తాన్ని రూ.10 లక్షల నుండి రూ.25 లక్షలకు పెంచుతూ జాప్ (జూ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) నిర్ణయించింది. ఈ మార్పులన్నీ వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి అమలులోకి రానున్నాయి. జూలను పర్యావరణరహితంగా తీర్చిదిద్దేందుకు విశాఖపట్నం, తిరుపతి జూలలో 60 బ్యాటరీ ఆపరేటెడ్ కార్లను ఆగస్ట్ 15వ తేదీ నుండి ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి తెలిపారు. రాజధాని అమరావతిలో అంతర్జాతీయ స్థాయిలో వెయ్యి ఎకరాల్లో జూను నిర్మించడానికి స్థల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాల్సిందిగా అధికారులను మంత్రి శిద్దా ఆదేశించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ అనంతరాము, పీసీసీఎఫ్ మల్లిఖార్జునరావు, పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్) ప్రదీప్ కుమార్, అడిషనల్ పీసీసీఎఫ్ ఎ.కె.ఝా, ఎ.కె.మౌర్య, సీసీఎఫ్ వైజాగ్ రాహుల్ పాండే, తిరుపతి, విశాఖపట్నం జూ క్యూరేటర్లు, ఆర్థిక శాఖ అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు 12,666 ఎకరాల భూమి

83 ప్రారంభం, పురోగతిలో మరో 149 పరిశ్రమలు

మంత్రి అమరనాథరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలో 2014 నుంచి ఇప్పటి వరకూ వివిధ రకాల పరిశ్రమల స్థాపన కోసం ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల మౌలిక సదుపాయాల కార్పొరేషన్ (ఏపీఐఐసీ) ద్వారా 12,666 ఎకరాల భూమిని కేటాయించినట్లు పరిశ్రమల శాఖ మంత్రి ఎన్ అమరనాధరెడ్డి తెలిపారు. ఇప్పటి వరకూ 1,294 సంస్థలతో అవగాహనా ఒప్పందాలు (ఎంఓయూ) లు కుదుర్చుకోగా 83 కంపెనీలు కార్యకలాపాలను ప్రారంభించాయన్నారు. మరో 149 పరిశ్రమలు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. శుక్రవారం శాసనసభ సమావేశాల ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. వివిధ కంపెనీలు సమర్పించిన దరఖాస్తుల్లోని ప్రాజెక్టు నివేదికల తృతీయ పక్ష మూల్యాంకనం తర్వాతే భూములను కేటాయిస్తున్నట్లు వివరించారు. విశాఖపట్నం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ అచ్యుతాపురం పరిసరాల్లో భూములను పరిశ్రమలకు కేటాయించినా, మౌలిక సదుపాయాలను కల్పించడంలో విపరీతమైన జాప్యం చేయడంతో పెట్టుబడిదారులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఆయా పరిశ్రమల్లో ఉపాధి, ఉద్యోగావకాశాలకు ప్రణాళికాబద్ధ కార్యాచరణ రూపొందించేందుకు జిల్లా కలెక్టర్/జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

సూటు-బూటుతో వస్తే భూ కేటాయింపులు: విష్ణుకుమార్‌రాజు

విశాఖపట్నంలో మూడేళ్లుగా నిర్వహించిన భాగస్వామ్య సదస్సుల్లో సూటు-బూటు వేసుకొచ్చిన వారికి భూములు కేటాయించారని బీజేపీ పక్షనేత వి. విష్ణుకుమార్‌రాజు విమర్శించారు. చేతిలో ల్యాప్‌ట్యాప్‌తో కన్పించిన ప్రతి ఒక్కరితోనూ ప్రభుత్వం ఎంఓయూ కుదుర్చుకుందన్నారు. 'పరిశ్రమలు, సంస్థలకు భూమలు కేటాయింపు' విషయమై ఆయన ఈవిధంగా స్పందించారు. ఎప్పుడూ సూటు వెయ్యనివాళ్లు కూడా భూముల కోసం వాటిని ధరించి సదస్సుకు హాజరయ్యారయ్యారన్నారు. రుషికొండలో ఎంతో విలువైన 40 ఎకరాల భూమిలో ఫ్రాంక్లిన్ టెంబుల్టన్ సంస్థకు 25 ఎకరాలు, ఇన్నోవా సొల్యూషన్స్‌కు 15 ఎకరాలను ఒక్కో ఎకరం రూ. 32.50 లక్షల చొప్పున కేటాయించేందుకు ఏపీఐఐసీ రంగాన్ని సిద్ధం చేసిందన్నారు. ఈ రెండు కంపెనీలు ఏర్పాటైతే కేవలం 2,500 ఉద్యోగాలే వస్తాయని అందువల్ల 5 నుంచి 10 ఎకరాల భూమిని కేటాయిస్తే సరిపోతుందన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. భూములను ఇచ్చే విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని విష్ణుకుమార్‌రాజు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

సీబీఐ కోర్టుకు జగన్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: అక్రమాస్తుల కేసుల విచారణలో వైసీపీఅధ్యక్షుడు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం నాంపల్లిలోని సీబీఐ కోర్టుకు హాజరయ్యారు. ప్రతి శుక్రవారం విచారణ జరుగుతున్న నేపథ్యంలో జగన్ పాదయాత్రకు విరామం ఇచ్చి సీబీఐ కోర్టుకు హాజరయ్యారు. జగన్‌తోపాటు రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి, పెన్నా ప్రతాప్‌రెడ్డి, నిమ్మగడ్డ ప్రసాద్, బీపీఆచార్య, శ్రీనివాసన్, ఇందూ శ్యాం ప్రసాద్ కూడా సీబీఐ కోర్టుకు హాజరైన వారిలో ఉన్నారు. దాదాపు రెండు గంటల పాటు వారంతా కోర్టులోనే ఉన్నారు. ఈ కేసులో దాఖలైన రెండు చార్జిషీట్లపై విచారణ జరుగుతోంది.

'ఉపాధి' సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యం

- ఈ నెల 21న చలో అసెంబ్లీకి పిలుపు
- కూలి వేతనం రూ.500కు పెంచాలి
- కూలీల వలసలు అరికట్టాలి

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జల్లి విల్సన్



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఉపాధి కూలీల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ ఈ నెల 21న చలో అసెంబ్లీకి పిలుపునిచ్చామని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ పేర్కొన్నారు. విజయవాడ దాసరి భవన్‌లో శుక్రవారం ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. విల్సన్ మాట్లాడుతూ ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యాన చేపడుతున్న చలో అసెంబ్లీకి రాష్ట్ర వ్యాప్తంగా శ్రమ జీవులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

వేసవి ఆరంభమైనప్పటికీ గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదని ఎద్దేవా చేశారు. కాంట్రాక్టర్లతో పనులు చేయిస్తూ పేదల కడుపు కొడుతున్నారని విమర్శించారు. ఉపాధి కూలీలకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.445 కోట్ల బకాయిలున్నాయని, రోజు వారీ కూలీ రూ.197 ఇవ్వాలని చట్టం చెబుతోందని, అయితే ఈ కూలీ రూ.70 నుంచి 80 మాత్రమే చేతికొస్తోందన్నారు. బకాయిల చెల్లింపునకు టీడీపీ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి హామీ పని కూలీల వేతనం రూ.500కు పెంచాలని డిమాండు చేశారు. గ్రామాల్లో వ్యవసాయ పనులన్నీ యంత్రాలతో చేయిస్తున్నార న్నారు. దీంతో కూలీలకు పనులు దొరకడం లేదని, మహిళలు, గర్భిణిలు, వృద్ధులను పనులకు రానీయట్లేదని చెప్పారు. చదువుకున్న మేట్లకు పారితోషికం ఇవ్వట్లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో చంద్రబాబు నాయుడు నాలుగేళ్లపాటు కొనసాగినప్పటికీ ఉపాధికి అవసరమైనంత నిధుల్ని తేవడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆయన విమర్శించారు. పనులు లేనందున డెల్టా, మెట్ట ప్రాంతాల నుంచి పెద్దఎత్తున కూలీలు బెంగళూరు, మద్రాసు, తమిళనాడు ప్రాంతాలకు వలసలు వెళుతున్నారని, వాటిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. కూలీలకు ప్రతి గ్రామంలో పనులు కల్పించాలని, 100 రోజులు దాటిన ప్రతి కుటుంబానికీ 200 రోజులపాటు పని దినాలు కేటాయించాలని డిమాండు చేశారు. చేసిన పనికి గుర్తింపుగా స్లిప్పులు ఇవ్వాలని, తపాలా కార్యాలయాల ద్వారా వారం రోజుల్లోగా బిల్లులు ఇవ్వాలని డిమాండు చేశారు. పని దినాల్లో కూలీలకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, ఒంటరి, వృద్ధాప్య మహిళలకు ప్రాధాన్యతనివ్వాలని, యంత్రాలను నిషేధించాలని, అందరికీ పనిముట్లు, టెంట్, మెడికల్ కిట్లను ఇవ్వాలనే తదితర డిమాండ్లతో చలో అసెంబ్లీకి పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో అందరికంటే ఎక్కువగా కష్టపడేదీ వ్యవసాయ కార్మిక కూలీలేనని అన్నారు. పని చేసిన వారం రోజులకూ డబ్బులు రానందున కూలీలు ఆర్థికంగా చితికిపోతున్నారని తెలిపారు. ప్రమాదాల్లో, వడదెబ్బతో చనిపోయిన వారికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రభుత్వం ఇవ్వాలని కోరారు.

రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు ఆవుల శేఖర్ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం సరిగా లేనందున పిల్లలతో సైతం కుటుంబాలు వలసలు పోతున్నాయని చెప్పారు. పచ్చచొక్కాల నేతల జేబుల్లోకి ఈ పథకం నిధులు దారిమళ్లుతున్నాయని విమర్శించారు. చలో అసెంబ్లీకి రాష్ట్ర వ్యాప్తంగా కూలీలంతా తరలి రావాలని కోరారు.

బీజేపీని ఎదుర్కోలేకే టీడీపీ, వైసీపీ అవిశ్వాసం

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలను చూసి ఓర్వలేకే టీడీపీ, వైసీపీ ఎన్‌డీఏ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాయని బీజేవైఎం జాతీయ కార్యవర్గ సభ్యుడు రమేష్‌నాయుడు విమర్శించారు. నాలుగేళ్లలో టీడీపీ అవినీతికి పాల్పడి ప్రజాగ్రహానికి గురవ్వగా, ప్రజా సమస్యలపై పోరాడలేక వైసీపీ ప్రతిపక్ష పాత్రను కోల్పోయిందన్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమేష్‌నాయుడు మాట్లాడారు. రెండు పార్టీలు అవినీతికి పాల్పడుతూ, ప్రజలను వంచిస్తున్నాయన్నారు. పట్టిసీమ, పురుషోత్తపట్నం ప్రాజెక్టులను చేపట్టిన మెగా కన్‌స్ట్రక్షన్స్ అధినేత కృష్ణారెడ్డి వైసీపీకి రూ.200 కోట్లు, టీడీపీకి రూ.450 కోట్లు ముడుపులు ముట్టచెప్పారని విమర్శించారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ రెండు పార్టీలు రాష్ట్రానికి నిధులు ఇవ్వటంలేదని ఆరోపిస్తూ కేంద్రంలోని బీజేపీ సర్కార్‌పై అవిశ్వాసాన్ని పెట్టాయన్నారు. 2019 ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కొనేందుకు ఈ రెండు పార్టీలు అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకునే వ్యూహంలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు గతంలో ఎన్‌టీఆర్ భవన్ నుంచి స్క్రిప్టు రాగా, ఇపుడు బసవ పున్నయ్య భవన్ నుంచి వస్తుండటంతో, ఆ ఆరోపణలకు టీడీపీ సమాధానం చెప్పలేకపోతోందన్నారు. రాష్ట్రానికి కేంద్రం ఏం చేసిందో ప్రజలకు ఇంటింటికీ తిరిగి వివరిస్తామని ఆయన వివరించారు. ఈ సమావేశంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిక్కాల రజనీకాంత్, పట్ల గోవింద్ పాల్గొన్నారు.

విభజన చట్టం, హామీల అమలుకు శాసనమండలి తీర్మానం..

విశాలాంధ్ర అమరావతి : ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లోని అంశాలు, అప్పటి ప్రధాని హామీల అమలులో జరుగుతున్న జాప్యం, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై రాష్ట్ర శాసన మండలి తీవ్ర నిరసనను వ్యక్తం చేసింది. ఆస్తులు, అప్పుల విభజన, విద్యుత్ పంపిణీ, పన్నుల వసూళ్ళు, తిరిగి చెల్లింపుల్లో రాష్ట్రానికి నష్టం జరిగిందని, విభజన చట్టం ప్రకారం రాజధాని అమరావతి నిర్మాణంతోపాటు రాష్ట్రానికి ప్రత్యేక హోదా , ఆదాయం కోల్పోతున్న రాష్ట్రానికి రెవెన్యూ లోటును భర్తీ చేయడం, బుందేల్‌ఖండ్, కోరాపుట్, బోలాంగిర్, కలహండి తరహాలో వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక సాయాన్ని అందించడంపై తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారని మండలి విమర్శించింది.రైల్వేజోన్ ఇవ్వడం కుదరదని, ఉక్కు కర్మాగారం లాభసాటి కాదని, ఓడ రేవుకు అభ్యంతరాలు పెడుతూ తాత్సారం చేస్తున్నారు. పెట్రో కెమికల్ పరిశ్రమకు సుమారు రూ. 5వేల కోట్ల వయబిలిటీ గేప్ ఫండింగ్ భారం రాష్ట్రం భరించాలం టున్నారని, విద్యా సంస్థల పురోగతి అంతంతమాత్రంగా ఉందని, ప్రస్తుత కేటాయింపులతో 20 ఏళ్లకు కూడా అవి పూర్తవ్వవని సభ్యులు వాపోయారు. ఉమ్మడి రాష్ట్రంలోని సంస్థల విభజన నత్తనడక నడుస్తోందని, నియోజకవర్గాల పునర్విభజన ఊసే లేకపోగా, విజయవాడ, గుంటూరు పట్టణాలకు డ్రైనేజీ కోసం ఇచ్చిన డబ్బు కూడా రాజధాని అమరావతికి ఇచ్చినట్లు చూపిస్తున్నారన్నారు. యుటిలైజేషన్ సర్టిఫికేట్లు ఇచ్చినా ఇవ్వలేదన్నట్లు ప్రకటనలు ఇచ్చి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండలి ధ్వజమెత్తింది. రాష్ట్రంపై కేంద్రం అవలంబిస్తున్న ఈ నిర్లక్ష్య ధోరణిని శాసన మండలి తీవ్రంగా ఖండిస్తూ, రాష్ట్రం ఖర్చు చేసిన రూ.2,500 కోట్ల మొత్తాన్ని కేంద్రం సమకూర్చాలన్నారు. రాష్ట్రానికి చట్టపరంగా దక్కాల్సిన అంశాల పై కేంద్ర ప్రభుత్వంలోని బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారు హేళనగా మాట్లాడడాన్ని శాసన మండలి తీవ్రంగా పరిగణించింది దక్షిణాదిలోని ఇతర రాష్ట్రాలతో సమానంగా ఎదిగేంత వరకు కేంద్రం చేయూత అందించాలని కోరుతూ శాసన మండలి తీర్మానించింది.

కొండలనైనా ఢీకొంటాం..: సీఎం

పొట్టిశ్రీరాములుకు మండలి ఘన నివాళి..

విశాలాంధ్ర అమరావతి : సంక్షోభాలనే అవకాశాలుగా మలచుకుని అద్భుతాలు సృష్టించిన చరిత్ర తెలుగువారి సొంతమని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తు చేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం కొండలనైనా ఢీకొంటామని, ఎవరికీ భయపడబోమన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఏపీ శాసనమండలిలో శుక్రవారం నివాళులర్పించారు. మండలిలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధనకు పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో తెలుగువారంతా ఐక్యంగా ఉండాలని, తిరిగి రాష్ట్రంలో చిచ్చుపెట్టాలని దుష్ట శక్తులు పొంచి ఉన్నాయని, అలాంటి కుట్రలను తిప్పికొట్టాలని సీఎం పిలుపునిచ్చారు. నవ్యాంధ్రప్రదేశ్ పునర్నిర్మాణంలో తనకు సహకరించాలని కోరుతూ, రాజధాని అమరావతి నిర్మాణం, తెలుగువారి ఐక్యతే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. 1953లో కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందని, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ప్రథమ ముఖ్యమంత్రిగా పనిచేసి ఆంధ్రజాతిలో ఐక్యత తెచ్చారన్నారు. తెలుగుమాట్లాడే వారందరితో కూడిన తెలుగురాష్ట్రం కావాలన్న తెలుగువారి ఆకాంక్ష మేరకు నైజాం రాష్ట్రం, ఆంధ్రరాష్ట్రాన్ని కలిపి భాషాప్రయుక్త రాష్ట్రాల ప్రాతిపదికన 1956 నవంబర్ 1 హైదరాబాద్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటు చేశారని వివరించారు. ఆంధ్రప్రదేశ్ విభజనతో తెలంగాణతో 60 ఏళ్ల పాటు కొనసాగిన బంధం తెగిపోయిందన్నారు.

ఏఐసీసీలో ఏపీకి 112 మందికి అవకాశం

పీసీసీ ప్రధాన కార్యదర్శి జంగాగౌతమ్



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) సభ్యుల నియమకంలో రాష్ట్రానికి అధిక ప్రాధాన్యత దక్కిందని పీసీసీ ప్రధాన కార్యదర్శి జంగాగౌతమ్ తెలిపారు. ఈమేరకు ఏపీసీసీ రాష్ట్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి సూచనలతో రాష్ట్రం నుంచి 112 మందికి అవకాశం కల్పించారని వివరించారు. ఏఐసీసీ సభ్యుల ఎంపికలో సామాజిక న్యాయానికి అధిక ప్రాధ్యానతిచ్చారన్నారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 70 శాతం వున్నారని పేర్కొన్నారు. 40 ఏళ్లలోపు యువతకు అధిక ప్రాధ్యానత ఇవ్వాలని ఏఐసీసీ మార్గనిర్దేశాల ప్రకారం 20 శాతం యువతకు ఏఐసీసీలో చోటు కల్పించారన్నారు.ఏఐసీసీలో రాష్ట్రానికి అధిక ప్రాధాన్యత కల్పించిన పార్టీ అధినేత రాహుల్ గాంధీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

సంపాదకీయం

ఇలా.. సౌరశక్తి సాధించగలమా?

అంతర్జాతీయ సౌరశక్తి కూటమి (ఇంటర్నేషనల్ సోలార్ అలియన్స్-ఐఎస్ఏ) దేశాల తొలిశిఖరాగ్ర సమావేశం ఇటీవల న్యూఢిల్లీలో జరిగింది. ఫ్రాన్స్ రాజధానిలో పర్యావరణ పరిరక్షణ సదస్సు సందర్భంగా 2015 నవంబర్30న ఈ కూటమి ఏర్పాటైంది. ఇప్పటివరకూ దీనిలో 56దేశాలు సభ్యత్వం పొందాయి. ఈ ఢిల్లీ సమావేశానికి ఇరవైమూడు దేశాల ప్రభుత్వాధినేతలు, మరో పది దేశాల మంత్రులు హాజరయ్యారు. మన ప్రధానితో కలిసి ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. భూమి ఉత్తర దక్షిణాలుగా 180 డిగ్రీలుగా విభక్తమై ఉంది. భూమధ్యరేఖకు దక్షిణంగా 90డిగ్రీలు, ఉత్తరంగా 90డిగ్రీలుగా భూగోళం ఏర్పడడానికి ప్రధాన కారణం సూర్యుడు, భూమికి ఉన్న పరిభ్రమణ సంబంధమే. భూమధ్య రేఖకు దక్షిణంగా, ఉత్తరంగా ఉన్న ఇరవైమూడున్నర డిగ్రీల అక్షాంశరేఖలకు మధ్యలోనే సూర్యుడు నిరంతరం ప్రకాశిస్తాడు. అంటే కర్కటక రేఖ నుంచి మకర రేఖ వరకు దక్షిణాయన, ఉత్తరాయనంగా సూర్యుడు ఆరేసి నెలలు సంచరిస్తాడు. మన దేశం కర్కటక రేఖకు ఇరువైపులా విస్తరించి ఉంది. ఈ కూటమిలో సభ్యత్వం పొందే దేశాలన్నీ మకరరేఖకు, కర్కటక రేఖకు మధ్య విస్తరించి ఉన్నాయి. ఈ దేశాల్లో సూర్యకాంతి ఏడాది పొడవునా పుష్కలంగా లభిస్తుంది కాబట్టి సౌరశక్తి ఉత్పత్తికి వీలవుతుంది. ఆఫ్రికా, దక్షిణ అమెరికా, ఆసియా, ఆస్ట్రేలియా దేశాలు ముఖ్యంగా వర్ధమాన దేశాలు ఈ కూటమిలో ఉన్నాయి. ఈ కూటమి ఏర్పాటుకు భారత్ చొరవ చూపడం అభినందనీయమే. అయితే దేశంలో సౌరవిద్యుత్తు వెలుగులు విరజిమ్మేందుకు చేపడుతున్న చర్యలను చూస్తే పూర్తి నిరాశ కలిగిస్తున్నాయి. నిరంతరాయ ఇంధన రంగంలో మన దేశం 2020 నాటికి నిర్దేశించిన లక్ష్యాలను అందుకోవడానికి చాలా దూరంలో ఉంది. 2015లో ఈ రంగంలో మొత్తం 10.2 బిలియన్ డాలర్ల ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులు పెట్టారు. కానీ ప్రభుత్వం నుంచి అందుతున్న ఆర్థిక సహాయం చాలా తక్కువగానే ఉంది. 2016-17కు కేంద్రప్రభుత్వం 758 మిలియన్ డాలర్లు (రూ. 5,035.79కోట్లు) బడ్జెట్‌లో కేటాయించింది. 2017-18 బడ్జెట్‌లో మొత్తం రూ.5,473కోట్లకు పెంచింది. రానున్న ఆరేళ్లలో వంద బిలియన్ డాలర్ల ఆర్థిక సహాయం అవసరమవుతుంది. తగిన ఆర్థిక సహాయం కొరవడడమే దీని పురోగతికి పెద్ద అడ్డంకిగా మారింది. 2020నాటికి 240 జీడబ్ల్యూ ఇంధన సామర్థ్యాన్ని కలిపేందుకు పవన, సౌర ఇంధన ఉత్పత్తిదారులు, పరిశోధకులు సంసిద్ధత వ్యక్తం చేస్తే, కేవలం 70జీడబ్ల్యూ అదనపు సామర్థ్యానికే ఆర్థిక సహాయం అందుబాటులోకి వచ్చింది. 175జీడబ్ల్యూ సౌర ఇంధనం ఉత్పత్తికి మొత్తం రూ. ఆరు లక్షల కోట్లు (92 బిలియన్ డాలర్లు) అవసరం. పథకాల అమలు నాటికి ఈ ఖర్చు 120బిలియన్ డాలర్లు లేదా రూ.7.22 లక్షల కోట్లు అవుతుంది. కానీ ఈ అంచనాను ప్రభుత్వం తక్కువ చేసి చూపుతోంది. మరోవైపు రుణదాతలు, ఈక్విటీ మదుపరులు ఈ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడంలేదు. వారికున్న అనుమానాలే దీనికి కారణం. ప్రభుత్వరంగంలోని విద్యుత్తు కార్మాగారాలు సౌరఇంధనాన్ని కొనుగోలు చేస్తాయా? అదనంగా ఉత్పత్తి అయ్యే ఇంధనాన్ని నిర్వహించగల సామర్థ్యం మన దేశపు విద్యుచ్ఛక్తి గ్రిడ్‌కు ఉందా? ఈ సందేహాలను తీర్చడానికి అనువైన వాతావరణాన్ని కల్పించడానికి మోడీ సర్కారు ముందుకు రావడంలేదు. వాస్తవానికి కొన్ని అనుకూల పరిణామాలు ఇటీవల చోటుచేసుకున్నాయి. ఉదాహరణకు ఒక వాట్ సౌర విద్యుత్తు ఉత్పత్తికి అయ్యే ఖర్చు 2013-14లో రూ.79.7 ఉండగా, ప్రస్తుతం అది 60.6కు దిగింది. సౌర విద్యుత్తు రంగాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దితేనే నిధులు వచ్చేందుకు అవకాశం ఉంటుంది. 20-25ఏళ్ల దీర్ఘకాలం పాటు ప్రాజెక్టులకు రుణ సదుపాయం కూడా కల్పించాలి. రుణాలకయ్యే వ్యయాన్ని తగ్గించి, పెట్టుబడి ఖర్చులకు ఈక్విటీ మదుపును తగినంత సమకూర్చితే సౌర ఇంధనరంగంలో వృద్ధి సాధ్యమవుతుంది. నిజానికిది పెట్టుబడులకు ప్రోత్సాహం ఇచ్చే పరిశ్రమ. ఖర్చుకు, ఉత్పత్తి ధరకు మధ్య పొంతన సాధించేలా ప్రభుత్వ విధానాలు ఉండాలి. పునరుత్పత్తి ఇంధనంలో సౌరశక్తిదే పైచేయి కావాలంటే అందుకు ప్రభుత్వ విధానాల్లో మార్పు రావాల్సిన అవసరం ఉంది. ఉత్పత్తికి అన్ని విధాలా ప్రభుత్వం దన్నుగా నిలవాలి. కానీ ఆ పని ఎక్కడ చేస్తున్నది? బొగ్గుతో నడిచే కర్మాగారాల ఉత్పత్తి వ్యయంతో పోల్చితే సౌరశక్తి ఉత్పత్తికి అయ్యే ఖర్చు ఇప్పటికీ ఎక్కువగానే ఉంది. సౌర కర్మాగారాల ద్వారా ప్రస్తుతం ఉత్పత్తి అయ్యే 'కిలోవాట్ గంట' విద్యుచ్ఛక్తి ధర ప్రస్తుతం రూ. 4.5- రూ. 5.5 మధ్య ఉంది. బొగ్గు ఆధారిత విద్యుచ్ఛక్తి ధర రూ. 2.5- రూ. 3.5 మధ్య ఉంది. ప్రత్యామ్నాయ ఇంధనంగా సౌరశక్తి ఉత్పత్తి పెంచడానికి తగిన మౌలిక సౌకర్యాలు కల్పిస్తే బొగ్గు ఆధారిత విద్యుత్తు కన్నా చౌకగా అందించడానికి వీలవుతుంది. సౌర పార్కులకు భూములను సేకరించడం, మౌలిక సౌకర్యాలు కల్పించడం వంటి చర్యలు చేపట్టాలి. అంతేకాదు, ఆయా ప్రాజెక్టులకు బిడ్‌లు దాఖలైనా, ప్రాథమిక సన్నాహాలు పూర్తిగాక పోవడం పెద్ద అడ్డంకిగా మారింది. దీనివల్ల ప్రాజెక్ట్ వ్యయం పెరిగిపోతోంది. పవన, సౌర వనరుల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ సామర్థం నాణ్యత లోపిస్తున్నట్లు కూడా విమర్శలు ఉన్నాయి. అసలు ఎంత సామర్థం అందుబాటులోకి, వస్తుంది, ఎప్పుడు వస్తుందన్న విషయాలపై స్పష్టత కొరవడింది. ఉదాహరణకు వరుసగా మూడు రోజులపాటు వర్షాలు కురిస్తే పరిస్థితి ఏమిటి అన్న దానిపై మనకు సరియైన అంచనాలు కొరవడ్డాయి. అటువంటి పరిస్థితిలో చేయాల్సిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై కూడా అవగాహన లేదు. మన విద్యుత్తు గ్రిడ్‌కు నిరంతర సరఫరా సామర్థ్యం ఉందా అన్నది మరో ప్రశ్న. ప్రస్తుత విద్యుత్ సరఫరా మౌలిక సౌకర్యాలను దేశమంతటా పెంచడం కోసం 'గ్రీన్ ఎనర్జీ కారిడార్'ను నెలకొల్పుతామని 2012లో కేంద్రప్రభుత్వం హామీ ఇచ్చినా ఇంతవరకూ చేపట్టలేదు. కొత్త ట్రాన్స్‌మిషన్, గ్రిడ్ మౌలిక సౌకర్యాలను ఆధునికంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. దేశంలో సౌరశక్తి ప్రాజెక్టులకు 'తప్పని సరి' హోదా లభించింది. అంటే నిరంతరం ఆ ఉత్పత్తి జరుగుతూ ఉండాలి. కాని సాంప్రదాయక వనరులతో ఉత్పత్తి చేసే విద్యుచ్ఛక్తి కంటే సౌర ఇంధనం ధర భారం కాకూడదు. చాలాసార్లు సౌరశక్తి ఆపరేటర్లను ఉత్పత్తి తగ్గించుకోవాలని అడగడం జరుగుతున్నది. అలా తగ్గించిన కాలానికి కోల్పోయిన ఆదాయం భర్తీ జరగడంలేదు. ఇటువంటి పరిణామాలు స్పష్టమైన నియమ నిబంధనలు రూపొందించక పోవడం వల్ల చోటు చేసుకుంటున్నా యి. ఈ అడ్డంకులు 2020 నాటికి అందుకోవలసిన లక్ష్యాన్ని అసాధ్యం చేస్తున్నాయి. దేశీయంగా సౌరవిద్యుత్తు ఉత్పత్తికి కావాల్సిన సౌకర్యాలు కల్పించకుండా, ఎదురవుతున్న అడ్డంకుల్ని తొలగించకుండా అంతర్జాతీయ సౌర విద్యుత్తు కూటమిల ఏర్పాటు, శిఖరాగ్రసమావేశాల నిర్వహణ వల్ల ఒనగూరే ప్రయోజనం శూన్యం. ప్రచారానికి తప్ప, ప్రజలకు మేలు చేకూర్చేందుకు పనికిరాదు. మోడీ సర్కారు ఈ వాస్తవాన్ని ఎంత తొందరగా గుర్తిస్తే, అంత సత్వరమే దేశం సౌరశక్తిమంతం అయ్యేందుకు మార్గం సుగమమవుతుంది.

చురక


ఊరింతల కేరింతల
ఊయ్యాల బడ్జెట్టు
రాష్ట్రంలో అధికారం
రాజకీయ టార్గెట్టు

పథకాలు పూర్తిగాక
పరుగు దీసే గతకాలం
బంగారు తెలంగాణ
పార్టీ వేసే హిత గాలం

- వేల్పుల నారాయణ

విశ్లేషణ

మాటల తేటలే - ఆచరణ పరాన్న భుక్కులను పెంచింది



పి.జనార్దనరావు

భారత ఆర్థిక వ్యవస్థను ఆర్థిక మంత్రి జైట్లీ దివాళా స్థితకి చేర్చాడు. కూలుతున్న ఈ చట్రంతో మోడీ 2019 ఎన్నికల్లో విజయం సాధించ ప్రయత్నిస్తున్నాడు. 42 నెలల పాలన తర్వాత ఐదవ లోటు బడ్జెట్‌లో జైట్లీకి గ్రామీణాభివృద్ధి వ్యవసాయ రంగం గుర్తుకు రావడం జరిగింది. ఎంతో కష్టపడి తన సొంత అభిరుచిని పక్కనపెట్టి 1,38,097 కోట్ల రూపాయలు కేటాయింపులు చూపించారు. ఎందుకింత ప్రేమ చూపించాడు జైట్లీ. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందలేదని ఇప్పుడే తెలిసిందా? వివిధ రాష్ట్రాల్లోని గ్రామీణులు, ముఖ్యంగా వ్యవసాయంపైన, చేతివృత్తులపైన ఆధారపడినవారు చేస్తున్న ఆందోళనలు మోడీని నిద్రలేకుండా చేస్తున్నాయి. అంతకు ముందు ఎన్నో విధాలుగా ప్రజలు హర్యానా, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, మహారాష్ట్ర, రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆందోళన చేస్తుంటే చెవికెక్కించుకోలేదు. గ్రామీణ భారతం పూర్తిగా అన్యాయానికి గురైంది. గడచిన రెండున్నర దశాబ్దాల్లో అసమానతలు గతంలో ఎన్నడూ లేనంతగా విస్తృతమయ్యాయి. పేదరికం, మాల్‌న్యూట్రిషన్, నిరక్షరాస్యత అధికం, ఉపాధి అవకాశాలు సీజనల్. సగానికిపైగా వున్న ప్రజలకు ఏ విధమైన ఆస్థులు లేవు. ప్రధాన రహదారులతో గ్రామాలు రోడ్లు వగైరా ప్రాతిపదిక సౌకర్యాలు ఏర్పాటు చేయటం ద్వారా అనుసంధానించబడలేదు. శుభ్రమైన తాగునీరు అందుబాటులో లేదు. ఫ్లోరోసిస్, ఇతర హానికరమైన లోహాలు తాగునీటిలో కలవడం వల్ల, పారిశుద్ధ్య సౌకర్యాల జాడే లేదు. విద్య, ఆరోగ్య రక్షణ చర్యలు అంతం మాత్రమే. రవాణా సౌకర్యాలు, మార్కెట్లు, విద్యుత్ సరఫరా ఏర్పాట్లు లేవు. గ్రామాల్లో వ్యవసాయం దాని అనుబంధ కార్యక్రమాలైన తోటల పెంపకం, కూరగాయల పెంపకం, పశువుల పెంపకం ప్రధానం. వ్యవసాయదారుల్లో 82 శాతం చిన్న సన్నకారు రైతులు. హెక్టారు, రెండు హెక్టార్ల భూమి కలిగినవారు. సాగునీటి వసతులు లేని భూములు 60 శాతం. పంటలు పండించటం, రుతుపవనాలు వర్షించే దానిపై ఆధారంగా ఉన్నాయి. వరి, గోధుమ ప్రధాన ఆహారం. పల్సెస్, వంటనూనెలు, స్పైసెస్ వేర్వేరు సీజన్లలో దేశం వేర్వేరు ప్రాంతాల్లో పండిస్తారు. అనేక కారణాల వల్ల వ్యవసాయం ఖర్చులు పెరిగాయి. ప్రత్యేకించి వ్యాపారానికి, ఎగుమతులకు ఉద్దేశించిన పంటలైన పత్తి, వర్జీనియా పొగాకు, మిర్చి, పసుపు వగైరాలకు మెట్ట ప్రాంతాల్లో కొద్దిపాటి నీటి వసతితో చిరు ధాన్యాలు పండిస్తున్నారు. జనాభా మొత్తం యొక్క ఆహారం పల్సెస్, వంట నూనె అవసరాలు, పాలు, మాంసం, గుడ్లు వగైరాలు గ్రామీణ ఉత్పత్తులే. గ్రామీణులే పెద్దఎత్తున వినియోగదారులు. ఆహారం వగైరాలే కాక, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, విద్యుత్, డీసెల్, వ్యవసాయంలో వినియోగిస్తూ యంత్రపరికరాలు, వస్త్రాలు, బంగారు నగలు, మందులు, పశువులు, కోళ్లు వగైరా పెంచటానికి దాణా, మందులు వగైరాలు కొనుగోలు చేస్తున్నారు. వడ్రంగులు, కమ్మర్లు, మేదర్లు, రజకులు వగైరాలకు వార్షికంగా చెల్లింపులు చేస్తున్నారు. ఖర్చులన్నీ వ్యవసాయదారుడు పెడుతున్నాడు. ఆదాయం దగ్గరకు వస్తే అతడు పండించిన పంటకు తగినంతగా రావడం లేదు. ప్రభుత్వాలు కొన్ని పంటలకు కనీస ధరలు నిర్ణయించినా ఆ ధరలకు కొనుగోళ్లు ఉండనందున వ్యవసాయదారుడు నష్టపోతున్నాడు. ఎన్‌ఎస్‌ఎస్‌ఓ 70వ రౌండ్ 2012-13 పరిశీలనలో వ్యవసాయదారుని కుటుంబం నెలసరి ఆదాయం రూ. 4,426 ఖర్చు రూ. 6,223 మిగులు. రూ. 203. వ్యవసాయం మీద వచ్చే ఆదాయం 2004-05, 2011-12 నాటికి 5.52 శాతం నుండి 2011-12 నుండి 2015-16 నాటికి 1.36 శాతానికి పడిపోయింది. వ్యవసాయదారుడు రుణగ్రస్తుడై ఆత్మహత్యకు పూనుకొంటున్నాడు మోడీ అయితే ఖర్చుపైన 50 శాతం లాభం కల్పిస్తామని వాగ్దానం చేశారు కాని ఆచరణలో పెట్టలేదు. ప్రస్తుత బడ్జెట్‌లో మరలా అదే వాగ్దానం నెరవేర్చ పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి అవసరమైన ప్రాతిపదిక సౌకర్యాలు - సాగునీటి వసతులు పెంపు, గిడ్డంగులు, శీతల గిడ్డంగుల ఏర్పాటు అలాగే ఇతర విధాలైన ఏర్పాట్లు, మెకనైజేషన్ స్ప్రింక్లర్ల ఏర్పాటు అశ్రద్ధకు గురయ్యాయి. ఇందుకు ప్రధాన కారణం గ్రాస్ కేపిటల్ ఫార్మేషన్‌కు కేటాయింపులు తగ్గించడం. ఇంకో సమస్య మార్జినల్ వ్యవసాయదారులు, వ్యాపార పంటలు పండించేవారు పరపతికి ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించటం, పెట్టుబడుల కొరత ఎదుర్కొంటున్న కేంద్రం వద్దగానీ, రాష్ట్రాల వద్దగానీ ప్రత్యామ్నాయం లేదు. అందువల్లనే వ్యవసాయ రంగం దుస్థితికి లోనై జీడీపీలో వ్యవసాయ రంగం అందించే వాటా పడిపోయింది.

అత్యధిక శాతం ప్రజలు నివశిస్తూ స్వయం సమృద్ధి జీవనం గల ఆర్థిక వ్యవస్థను గురించి ప్రభుత్వానికి ఒక విధాన నిర్ణయం లేదు. 70 సంవత్సరాల్లో నగరాల కొరకు శ్రమిస్తున్న పాలకులు మొత్తం జనాభా ఆహార అవసరాలు తీరుస్తున్న వ్యవసాయ రంగాన్ని అశ్రద్ధకు గురిచేయటం ద్వారా కరవు ప్రమాదాన్ని దేశం ముందుకు తెచ్చింది. అత్యంత ఖరీదైన గ్లోబల్ ఆర్థిక వ్యవస్థలో మమేకమవటం ద్వారా విద్య ఆరోగ్య రక్షణను గ్రామీణులకు అందుబాటులో లేకుండా చేశారు. గ్రామీణుల్లో ఆస్థులు కలిగిన సంపన్నులు మరింత సంపన్నులుగాను, తరతరాలుగా పేదలుగా వున్నవారు మరింత పేదలుగా దుర్భర జీవితం గడుపుతున్నారు. ప్రపంచీకరణ పుణ్యం వలన ఇటువంటి అసమానతలతో కూడిన వ్యవస్థ కొనసాగేటట్లు పాలకుల నిర్ణయాలు. నేటి వరకూ ఉపాధి అవకాశాలను పెంచటానికి గాని, విద్యా సౌకర్యాలు విస్తరించటానికి గాని, ఆరోగ్య రక్షణను పెంపొందించటం ద్వారా గ్రామీణ ప్రజలు మెరుగైన జీవితం సాగించటానికి ఏర్పాటు చేయలేదు. గ్లోబల్ ద్రవ్య పెట్టుబడులను కూడా నగరాల్లోని వసతులను పెంచటానికి వాడారు.

పంటలకు కనీస గిట్టుబాటు ధరలు పెంచితే ద్రవ్యోల్బణం పెరుగుతుందని నగరాల్లో ప్రజలు అధిక ధరలు చెల్లించవలసి వస్తుందని సాకులు చెప్పారు. అత్యధిక శాతం వ్యవసాయదారులు పంట నష్టం, గిట్టుబాటు ధరలు లేక రుణగ్రస్తత పెరుగుతుంటే, కుటుంబ పెద్ద ఆత్మహత్యకు పూనుకుంటుంటే దేశం ముందు ముందు ఎటువంటి పరిస్థితులు ఎదుర్కోవలసి వస్తుందో అంచనా లేకుండా పాలకులు వున్నారు. గ్రామీణ ఉత్పత్తులు ఎగుమతి చేయటం ద్వారా రైతులు, లఘు పరిశ్రమలవారు ఆదాయం కేంద్రం పొందుతుంది. కాని వారి సమస్యలు పరిష్కరించటానికి పూనుకోవటం లేదు. దేశంలో సంపద సష్టికర్తలు వ్యవసాయదారులు, లఘు పరిశ్రమలవారు అత్యధికంగా ఉపాధి కల్పించేవారు. స్థానిక వనరులను వినియోగించి సంపద సృష్టిస్తున్నారు. జీడీపీ ఎగుమతులకు తోడ్పడుతున్నారు. ఈ రెండు రంగాల్లో కృషి చేసేవారు గ్రామీణులు ఏ విధంగా .... ప్రభుత్వం ద్వారా తోడ్పాటు పొందని వారు నేడు ప్రభుత్వం ద్వారా అత్యధికంగా ప్రయోనాలు పొందే వారు కార్పొరేట్ రంగం, పరిశ్రమలవారు. వ్యాపారస్తులు. దేశంలో సృష్టించబడిన సంపదలో 75 శాతం పైన పేర్కొనబడిన ఒక్కశాతం పొందుతున్నారు. 2018 ఫిబ్రవరిలో ఆక్సుఫామ్ సంస్థ ప్రకటించిన డాలరు బిలియనీర్లు 119లో ఒక్కరు కూడా వ్యవసాయం రంగంలోని వారు గాని, గ్రామీణ ప్రాంతం నుండి గాని వచ్చినవారు లేరు. గడచిన 10 సంవత్సరాల్లో 2007 నుండి 2017 వరకు భారతదేశంలో వ్యక్తుల సంపద 3165 బిలియన్ డాలర్ల నుండి 8230 బిలియన్ డాలర్లకు పెరిగింది. కాని దిగువ స్థాయిలోవున్న అత్యధికుల జీవన విధానం ఏ విధంగాను మెరుగుపడలేదు. పెరిగిన సంపదలో ఎక్కువగా కొద్ది శాతం మంది దగ్గర పోగుపడింది. పెట్టుబడిదారీ అభివృద్ధి విధానం భారతదేశంలో సాధించిన ప్రగతి. 2017లో ప్రపంచ వ్యాపితంగా ఇండియా బెస్ట్ పెర్ఫార్మింగ్ వెల్త్ మార్కెట్ పరిగణించబడింది. ఆలోచించవలసిన అంశం ఏమంటే మన్మోహన్ సింగ్ ప్రభుత్వంగాని, నరేంద్ర మోడీ ప్రభుత్వం గాని భారతదేశంలో సృష్టించబడిన సంపదలో అత్యధిక భాగం అత్యల్ప శాతం ప్రజలవద్ద పోగుపడటానికి తోడ్పడ్డారు. ప్రజల సంక్షేమానికి పేదరికం, మాల్‌న్యూట్రిషన్, నిరక్షరాస్యత నివారణకు, వర్క్‌ఫోర్స్‌లో నైపుణ్యాలు పెంచటానికి తోడ్పడలేదు. సామాజికంగా పెరుగుతున్న అసమానతలు తగ్గించటానికి ప్రయత్నించక ఉపాధి అవకాశాలు గ్రామీణ ప్రాంతాల్లో తగ్గి వ్యవసాయ కూలీలు, మార్జినల్ రైతులు నగరాలకు వలసలను ఆపటానికి ప్రయత్నించలేదు. దేశీయమైన వనరులను కొల్లగొట్టేవారిని అత్యధికశాతం ప్రజలు తమ శ్రమ ద్వారా సృష్టించిన సంపదను సొంతం చేసుకొనే వారిని పెట్టుబడిదారీ అభివృద్ధి విధానం తయారు చేసింది. పరాన్న భుక్కులు వారు. దేశ సంపదను కొల్లగొట్టే అవకాశం మోడీ కల్పిస్తున్నారు. ఆర్థికమంత్రి జైట్లీ అత్యంత సంపన్నుడు మాటకారి, తిమ్మిని బమ్మిని చేయగల సమర్థుడు. ఆర్థికమంత్రి 2014-15 నుండి పెద్ద లోటు బడ్జెట్లు వేస్తూ 30 లక్షల కోట్లు అప్పులు చేశారు. 25 లక్షల కోట్లు పన్ను మినహాయింపులు కార్పొరేట్ రంగానికి కట్టబెట్టాడు.

పెద్దనోట్లు రద్దు చేయటంవల్ల ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. జీడీపీ 2016-17లో 6.1 శాతానికి తగ్గింది. దేశవ్యాప్తంగా ఖరీఫ్, రబీ సీజన్ల వ్యవసాయ కార్యక్రమాలు తీవ్రంగా నష్టపోయాయి. నగదు అందుబాటు లేనందున లఘు పరిశ్రమలు కనస్ట్రక్షన్, రియల్ ఎస్టేట్ కార్యక్రమాలు స్తంభించాయి. దాదాపుగా 1.5 మిలియన్ల ఉపాధులు కోల్పోయారు. 'అదేమీ లేదు అంతర్జాతీయంగా మాంద్యం కొనసాగటం, ఎగుమతులు, దిగుమతులు పడిపోవటం వల్ల' అని జైట్లీ చెప్పారు. తాజాగా పంజాబ్ నేషనల్ బ్యాంకు, ఓరియంటల్ బ్యాంకు వగైరాల్లో అప్పు తీసుకొని చెల్లించకుండా కొంత మంది వజ్రాల వ్యాపారస్తులు దేశం విడిచి పారిపోయారు. ఇప్పటికే మోడీ, జైట్లీ ద్వయం భారత ఆర్థిక వ్యవస్థను గ్లోబల్ ద్రవ్యపెట్టుబడికి పూర్తిగా అప్పగించారు. ప్రపంచ బ్యాంకు ఐఎంఎఫ్‌లు మరిన్ని ఆర్థిక సంస్కరణలు కోరుతున్నాయి. అంతర్గత సమస్యలు ద్రవ్యోల్బణం పెరగడంతో, ప్రైవేటు పెట్టుబడి రావడం లేదు. ఇందన ధరలు పెరుగుతున్నాయి. బ్యాంకింగ్ రంగం ఆరోగ్యంగాలేదు. ఎన్‌పీఏలు, రూ. 9.75 లక్షల కోట్లు. అగ్రి రివైవల్, ఎగుమతులు పడిపోవటం, నోట్ల రద్దు, జీఎస్టీ అమలు, బ్యాంకింగ్ సంస్కరణ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తును అంధకారం వైపు నడుపుతోంది.

- విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, విజయవాడ.

నిన్నటి వరకు మిత్ర పక్షాలు : నేడు మీకు మీరే, మాకు మేమే

ఏపీపై కేంద్రం చిన్న చూపు

ప్రొఫెసర్ బి. రామకృష్ణారావు

రాజకీయాల్లో శాశ్వత మిత్రులు శాశ్వత శత్రువులు ఉండరన్నది నేడు దేశరాజకీయాలు ముఖ్యంగా రాష్ట్రరాజకీయాలు మరోసారి నిరూపిస్తున్నాయి.నేడు ఆంధ్రప్రదేశ్‌లో క్షణక్షణం రాజకీయాలు వేడేక్కుతున్నాయి.మరొసారి ప్రత్యేక హెూదా చుట్టూ రాజకీయాలు పరిభ్రమిస్తున్నాయి.ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం-2014లో 2 జూన్, 2014 నుండి రెండు తెలుగు రాష్ట్రాలు ఏర్పడ్డాయి. కాబట్టి పై చట్టంలో ఆంధ్రరాష్ట్ర అభివృద్ధికి కొన్ని ముఖ్యమైన హామీలు ఇచ్చారు.ఇవి గాక నాటి యుపీఏ ప్రధాని విభజిత రాష్ట్రానికి 5 సంవత్సరాలు ప్రత్యేక హోదా కల్పిస్తున్నట్లు పార్లమెంటులో ప్రకటన చేసారు. 10సంవత్సరాలు కావాలని నాటి ప్రతి పక్ష నేతలైన వెంకయనాయుడు,అరుణ్ జైట్లీలు పార్లమెంటులో డిమాండ్ చేయడం సర్వవిదితమే.ఇవి గాక,ఎన్నికల ప్రచారంలో భాగంగా నాటి ప్రధాని అభ్యర్థి నేడు ప్రధాని అయిన మోడీ తిరుపతి బహిరంగ సభలో 10 సంవత్సరాలు ప్రత్యేక హోదా కల్పిస్తామని, ఢిల్లీని తలదన్నే రాజధానిని నిర్మిస్తామని, తల్లిని చంపి బిడ్డను బ్రతికించిన రాష్ట్రానికి అన్ని విధాలా ఆదుకుంటామని దైవసన్నిధిలో ప్రకటన చేశారు. చట్టంలో పేర్కొన్న హామీలుగాని, ప్రజ్వామ్యానికి దేవాలయం అయిన పార్లమెంటులో ఇచ్చిన దేశప్రధాని ప్రత్యేక హోదా హామీని గాని గత నాలుగేళ్లుగా పూర్తి స్థాయిలో అమలు కాలేదు. ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

విభజన హామీలలో అతి ముఖ్యమైనది ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేకహోదా. విభజనతో కోపోద్రిక్తులైన సీమాంధ్ర ప్రజలను శాంతింపజేయడానికి ప్రత్యేక హోదా అంశాన్ని వెంకయ్య నాయుడు చొరవతో యూపీఏ సర్కారు ఆనాడు ప్రకటించింది. దానికి ప్రధాన ప్రతిపక్షమైన బీజేపీ కూడా వత్తాసు పలికింది. నెలలు గడిచినా కేంద్రంలో అధికారం చేపట్టిన ఎన్డీఏ సర్కారు ప్రత్యేక హోదాపై మీనమేషాలు లెక్కించటం ప్రారంభించింది. ఇకపై ఏ రాష్ట్రానికి అట్టి హోదా ఉండబోదని రెండుసార్లు పార్లమెంటులో లిఖితపూర్వకంగా కేంద్ర ప్రణాళిక మంత్రి తెలియజేయటంతో ఆంధ్ర ప్రజలు ఖంగుతిన్నారు. అంతవరకు కేంద్ర పరిశీలనలో ఉందని కాలయాపన చేసి మభ్యపెట్టారు. ఊరడింపు చర్యగా దాని స్థానంలో రాష్ట్రానికి ప్రత్యేక ఆర్థిక సాయాన్నికేంద్రం ప్రకటించడం దానికి టీడీపీ పెద్దలు, వెంకయ్య నాయుడు వత్తాసు పలకడం, హోదా ముగిసిన అధ్యాయమని ప్రకటించడం వంటి వింతలు జరిగాయి. హోదా విషయంలో చంద్రబాబు నాలుగుసార్లు నాలుగు రకాల మాటలు మాట్లాడడం చూస్తుంటే ప్రత్యేక హోదాపై ఆయనకే స్పష్టత లేదా లేక ప్రజల ఆకాంక్ష, వామపక్షాల ఉద్యమాలు, వైసీపీ రాజీనామాలు, అవిశ్వాస తీర్మానం ప్రకటనలు వంటివి ఆయన్ని యూ-టర్న్ తీసుకొని హోదాకు తలొగ్గేటట్లు చేశాయా? అన్న అనుమానం కలుగుతోంది. చట్టభద్రతగల ప్రత్యేక హోదాను కాకుండా చట్టభద్రత లేని ప్రత్యేక ఆర్థిక సాయాన్ని ఎరగా చూపించి రాష్ట్ర ప్రభుత్వ నోరుమూయించింది. ఈ ప్రత్యేక సాయం ప్రకారం కేంద్రం ఆర్థికసాయం చేసే పథకాలకు 60 శాతినికి బదులుగా 90 శాతం కేంద్రమే భరిస్తుంది. ఆ విధంగా విభజిత రాష్ట్రానికి రూ. 16,447 కోట్లు అదనంగా కేంద్ర గ్రాంటు కింద లభిస్తాయి. కేంద్రం దీనిని "ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్టు" లకు అధిక నిధులు కల్పించి భర్తీ చేయాలని ప్రతిపాదిస్తోంది. అట్టి ప్రాజెక్టులు ప్రారంభించడానికే ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి ఆ నిధులను అలా కాకుండా నేరుగా రాష్ట్రానికే ఇవ్వాలని కేంద్రాన్ని కోరింది. 14వ ఆర్థిక సంఘం పనికాలం ఇప్పటికే సగం పూర్తయి పోయింది కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం నిధులు విడుదల చేయాలని కోరుతోంది. ఇంతవరకు ఈ పద్దు కింద రూ. 400 కోట్లు కూడా పూర్తిగా విడుదల కాలేదు. పోనీ, ప్రత్యేక హోదాకు బదులు ప్రకటించిన ప్రత్యేక ఆర్థిక సాయాన్నైనా అమలు చేశారా అంటే ఏడాదిన్నర దాటినా అదీ లేదు. ఇంతవరకు కేంద్రం రాష్ట్రానికి ఏ పద్దుకింద ఇంతవరకు ఎంత ఇచ్చింది అన్న దానిపై ఇరువురికీ స్పష్టత కొరవడడం విశేషం. కేంద్రం రూ. 3,55,400 కోట్లు ఏపీకి ఇచ్చామంటుంటే కేవలం రూ. 12,800 కోట్లు మాత్రమే ఇచ్చారని రాష్ట్ర ప్రభుత్వం అంటోంది. రైల్వే జోను, హోదా కల్పించవలసిన అవసరం లేదని తెలుగుబిడ్డ పురందేశ్వరి అనడం చాలా శోచనీయం.

ప్రత్యేకహోదావలే విశాఖ రైల్వే జోనుకు కూడా తాజా సమాచారం ప్రకారం మంగళం పాడే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ విషయంలో కేంద్రం ఒడిస్సా ప్రభుత్వపై నెపం పెడుతోంది. ఎందుకంటే విశాఖను ప్రత్యేక జోనుగా ప్రకటిస్తే, విశాఖ కేంద్రం నుండి వస్తున్న అధికాదాయాన్ని ఒడిశా కోల్పోతుంది. త్వరలో ఒడిశాకు ఎన్నికలున్నాయి. కాబట్టి విశాఖను రైల్వేజోనుగా ప్రకటిస్తే రాబోయే ఎన్నికలలో బీజేపీ ఒడిశాలో దెబ్బతినొచ్చు. విశాఖ జోను లాభసాటి కాదని కేంద్రం కొత్తగా తెరపైకి తెచ్చింది. కాని ఇందులో వాస్తవం లేదు. ఎందుకంటే ఒకసారి విశాఖ రైల్వేజోను ఏర్పాటు చేస్తే, అందులో అధికరాబడి ఆర్జిస్తున్న విజయవాడ, గుంతకల్లు కూడా కలుస్తాయి. నేడు కేంద్రమంత్రిగా ఉన్న రాంవిలాస్ పాశ్వాన్ లాభసాటిలేని హజ్‌పూర్‌కు కొత్తగా రైల్వేజోన్‌ను ప్రకటించినపుడు అంతకన్నా లాభసాటిగా ఉన్న విశాఖకు ఎందుకు రైల్వేజోన్‌ను ప్రకటించకూడదు?

రెవిన్యూ లోటు : ఉమ్మడి రాష్ట్రానికి అధికాదాయం తెచ్చిపెట్టే రాజధాని హైదరాబాదు తెలంగాణకు పోవడంతో విభజిత ఆంధ్ర రాష్ట్రానికి రెవిన్యూ లోటు ఏర్పడింది. ఈ లోటును కేంద్రమే భర్తీ చేస్తుందని చట్టంలో పేర్కొనబడింది. 2014-15కు ఈ రెవిన్యూ లోటు రూ. 16,078 కోట్లకు రాష్ట్ర ప్రభుత్వం లెక్కించి కేంద్రానికి పంపగా దానిని కేంద్రం రూ. 7,500 కోట్లకు కుదించి రూ. 3,977 కోట్లు ఇంతవరకు చెల్లించింది. ఇంకా కేవలం రూ. 138 కోట్లు మాత్రమే ఏకపక్షంగా నిర్ణయించి వస్తాయనడం ఆశ్చర్యకరం. ఇంకో ప్రత్యామ్నాయ పద్ధతిని 14వ ఆర్థిక సంఘం అనుసరించిన లెక్కప్రకారం విభజన జరిగిన మొదటి రెండు సంవత్సరాలకు కలిపితే రూ. 1600 కోట్లు వస్తుంది. రెండో పద్ధతి ప్రకారం వెళ్తే ఆంధ్రాకు లబ్ధి జరుగుతుందని కేంద్ర ఆర్థిక శాఖ హితవు పలికింది. దీనినిబట్టి ఏదో ఒక సాకు చూపించి కేంద్రం రాష్ట్రానికి ఇవ్వవలసిన తన భారాన్ని బాధ్యతను తగ్గించుకుంటున్నదని అర్థమౌతోంది. ఇరువురికి ఈ అంశంలో ఏకాభిప్రాయం వచ్చినట్లు లేదని భోగట్టా.

ఉక్కు కర్మాగారం : నియమిత తేదీ నుండి 6 నెలల లోపు వెనుకబడిన రాయలసీమ జిల్లాలో ఒకటైన కడపలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు పరిశీలించడం ఒకటి. ఈ జిల్లాలో విస్తారంగా ఇనుప ఖనిజ గనులు కూడా ఉన్నాయి. కాని ఇది తక్కువ గ్రేడుకు చెందినది. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ముఖ్యంగా యువతకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఇనుప ఖనిజాన్ని ప్రతిపాదిత ఉక్కు కర్మాగారానికి ఉచితంగా ఇస్తామని హామీ కూడా ఇచ్చింది. ఉక్కు ఉత్పత్తి ధరలో సుమారు 50 నుంచి 60 శాతం ముడి ఇనుము ధరే ఆక్రమిస్తుంది. కాబట్టి ఇక్కడ తయారైన ఉక్కును మార్కెట్ ధరకన్నా 50 శాతం తక్కువకు అమ్మవచ్చు. ప్రైవేటు రంగంలో ఉన్న జిందాల్, టాటా కంపెనీలకు భారత ప్రభుత్వం ముడి ఇనుము గనులను కేటాయించింది. కాని అదే ప్రభుత్వం ప్రభుత్వ రంగంలో ఉన్న విశాఖ స్టీలు ప్లాంటుకు మాత్రం ఒక ఇనుప గనిని కూడా కేటాయించకపోవడం, ఫలితంగా ఆ ప్లాంటు నష్టాల్లో కొట్టుమిట్టాడడం చాలా శోచనీయం. ఇదంతా అన్యాయానికి ఒక పార్శ్వం అయితే చట్టంలో పేర్కొన్న కడప ఉక్కు కర్మాగారాన్ని కేంద్రం నిర్మించడానికి ఆసక్తి చూపకపోవడం ఇంకొక పార్శ్వం. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి జీవనాడి వంటి పోలవరం ప్రాజెక్టును చట్టంలోని సెక్షన్ 90 ప్రకారం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి, కేంద్రమే నిర్మించాలి. కారణాలేమైనప్పటికీ ప్రాజెక్టు నిర్మాణాన్ని రాష్ట్రమే చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ఖర్చు బిల్లులు ఆమోదించి రాష్ట్రానికి డబ్బు చెల్లించడంలో తీవ్రమైన జాప్యం జరుగుతుండడం మూలంగా సుమారు రూ. 300 కోట్ల వడ్డీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అనవసరంగా భరించవలసి వస్తోంది. ఈ సమస్య పరిష్కారానికై ఒక "రివాల్వింగ్ ఫండ్" ఏర్పాటు చేయమని వేడుకున్నా కేంద్రం ముందు అది అరణ్య రోధన అయింది. పునరావాసంతో సహా ప్రస్తుతం ప్రాజెక్టు వ్యయాన్ని రూ. 58 వేల కోట్లకు అంచనా వేశారు. దానిలో పునరావాసానికి రూ. 33 వేల కోట్లు ఖర్చు చేయవలసి వుంటుంది. కేంద్రం 2014 తర్వాత ప్రాజెక్టుకయ్యే ఖర్చును మాత్రమే భరిస్తామని ప్రకటించింది. ఇంతవరకు 2014 తర్వాత రాష్ట్ర ప్రభుత్వం రూ. 7431 కోట్లు ఖర్చు చేయగా కేంద్రం రూ. 4329 కోట్లు ఇచ్చింది. పునరావాస బాధ్యత తీసుకోడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధంగా లేవు. మంత్రుల రాజీనామాల నేపథ్యంలో ఈ ప్రాజెక్టు భవిష్యత్ నిర్మాణం ప్రశ్నార్థకమే. ఢిల్లీలో తాజాగా రూ. 25 వేల కోట్లతో ప్రతిపాదిస్తున్న ఒక ఎగ్జిబిషన్ సెంటర్ (ద్వారకా కన్వెన్షన్ సెంటర్) కన్నా, పోలవరం జాతీయ ప్రాజెక్టుకు ఆ మాత్రం ప్రాముఖ్యత కూడా లేదా? అలాగే కోట్లు కోట్లు వెచ్చించి జీవంలేని విగ్రహాలపై ఖర్చు చేస్తున్నారు. జీవనాడైన పోలవరం నాటికన్నా తీసేసినదా? ఈ ప్రాజెక్టు ఖర్చులపై కొర్రీల మీద కొర్రీలు కేంద్ర శాఖ వేయడం చాలా బాధాకరం. సెక్షన్ 46(3) ప్రకారం ఉత్తరాంధ్రలోని 3 జిల్లాలు, రాయలసీమలోని 4 జిల్లాలను వెనుకబడిన జిల్లాలుగా కేంద్రం గుర్తించింది. నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఈ జిల్లాలకు బుందేల్ ఖండ్ తరహాలోనూ, కొరాపుట్-బోలంగిర్-కలహండీ తరహాలోను సాయం అందిస్తామని ప్రకటించారు. దీని ప్రకారం రూ. 23,500 కోట్ల సాయం రాష్ట్రానికి రావాలి. అయితే మొదటి మూడేళ్లు దేశంలోని ఇతర వెనుకబడిన జిల్లాలతోపాటు జిల్లాకు రూ. 50 కోట్లు చొప్పున ఇప్పటికి కేవలం రూ. 1050 కోట్లు మాత్రమే సాయం అందింది. 4వ ఏడాది రూ. 50 కోట్లు చొప్పున రూ. 350 కోట్లు ఇచ్చినట్లే ఇచ్చి మరల వెనక్కి తీసుకున్నారు. జిల్లాకు విడుదల చేసిన రూ. 50 కోట్లు కనీసం 5 కి.మీ. ఆధునిక రోడ్డు వేయడానికి కూడా చాలవు. రూ. 50 కోట్లతో జిల్లాలో ఎటువంటి మౌలిక వసతులు కల్పించవచ్చో కేంద్రమే చెప్పాలి.

కొత్త రాష్ట్రానికి రాజధాని లేకపోవడంతో పాలనా సౌలభ్యం కొరకు కొత్తగా రాజధాని ఏర్పరచుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. సెక్షను 94(3) ప్రకారం శాసనసభ, శాసనమండలి, హైకోర్టు, రాజ్‌భవన్, సచివాలయం కార్యాలయాల నిర్మాణానికి కేంద్రం ఆర్థికసాయం అందించాలి. దీనికై రూ 42,935 కోట్లు అవుతుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. కేంద్రం ఇప్పటికి కేవలం రూ. 1500 కోట్లు మాత్రమే ఇచ్చింది. మరో రూ. 1000 కోట్లు విజయవాడ, గుంటూరు డ్రైనేజి అభివృద్ధికి ఇచ్చింది. కాని ఇవి రాజధాని పరిధిలోకి రాదని రాష్ట్రం చెబుతోంది. కాని కొన్ని వేల కోట్లు పెట్టి విగ్రహాలు ప్రతిష్టించడం, అలాగే ఎగ్జిబిషన్ సెంటర్‌కు (కన్వెన్షన్ సెంటర్) కేటాయించడం, విమర్శలున్నా ముంబయి, గుజరాత్‌ల మధ్య లక్షా పదివేల కోట్లతో బుల్లెట్ ట్రైన్ ప్రారంభించడం వంటివి చూస్తుంటే ఆంధ్రాపై కేంద్రం వివక్ష చూపుతోందని అర్థమవుతోంది. రూ. 1500 కోట్లతో ఢిల్లీని తలదన్నే రాజధాని తయారవుతుందా?

మిగతా రాష్ట్రాలతోబాటు చేసిన సాయాన్నే అదేదో ఆంధ్రాకు ప్రత్యేకంగా ఇచ్చినట్లు చెప్పడం విచిత్రం. ఇన్నాళ్లూ సౌమ్యుడిగా ఉన్న గల్లా జయదేవ్ పార్లమెంటులో ఒక్కసారిగా విమర్శనాస్త్రాలు బీజేపీపై సంధించడం ఆ పార్టీ పెద్దలకు మింగుడు పడలేదు. మొత్తం మీద సీఎం చంద్రబాబు తెలివిగా బీజేపీ మీద ప్రజావ్యతిరేకత తనవైపు రాకుండా జాగ్రత్తపడుతున్నారు. కాంగ్రెస్, బీజేపీలకు సమదూరం పాటించాలన్నదే చంద్రబాబు వ్యూహం. ప్రస్తుతం ఇరువురి మధ్య ఉన్న ప్రచ్ఛన్నయుద్ధం బహిరంగ యుద్ధమవుతుందో లేదో వేచి చూడాలి.

- విశ్రాంత ఆచార్యులు ఏయూ, సెల్ : 9849102403

వి-మెయిల్

'డొక్కు రైల్ జోన్లు కోరవద్దు-లక్ష కోట్లు మింగే బుల్లెట్ రైళ్ళే మాకు ముద్దు' కేంద్రం

కేంద్ర హోం శాఖ కార్యదర్శి 'విశాఖ కేంద్రంగా రైల్ జోన్ ఏర్పాటు సాధ్యం కాదు. అయినా ఆ ఏర్పాటుతో మీకేం లాభం ఒక జనరల్ మేనేజర్ పోస్టు రావడం తప్ప' అని వ్యాఖ్యానించినట్టు పేపర్లో వచ్చింది.అయితే ఇంకేం? కేంద్రం పెద్ద ఖర్చేమీ లేని జోన్ ఏర్పాటు చేసి,తద్వారా విభజన చట్టం హామీ ,ఉత్తరాంధ్ర ఆకాంక్ష సులువుగానే నెరవేర్చేయొచ్చని భావించొచ్చు కదా! అది మానేసి మళ్ళీ మిగతా రాష్ట్రాల అభిప్రాయాలంటూ నసగడం దేనికి? ఆంధ్రప్రదేశ్ లో,విశాఖ కేంద్రంగా రైల్ జోన్ ఏర్పాటు చేస్తే ఒడిశా కు గానీ,పశ్చిమ బంగ కు గానీ ఛత్తీస్ ఘడ్ కి గానీ అభ్యంతరమెందుకుఉండాలి? అదే మాట వారిని నిలదీసి ఒప్పించవచ్చు కదా! విశాఖ పట్నం ఇప్పుడున్న డివిజన్ లో రైల్వే కి అధికాదాయం సమకూరుస్తున్న స్టేషన్.దీనిని కోల్పోవడం,పరిపాలన పట్టుని కోల్పోవడం ఈస్ట్ కోస్ట్ జోన్ కి నష్టం.కాబట్టి అవి సహజంగానే వ్యతిరేకిస్తాయి.అయితే ప్రత్యేక జోన్ అన్నది ఆంధ్రుల హక్కు, పైగా విభజన చట్టంలో కేంద్రం పూచీపడిన అధికారిక హామీ.ఆంధ్రుల ఆకాంక్షని సాకారం చెయ్యాల్సిన కేంద్ర ప్రభుత్వం కమిటీలంటూ సాగదీసి,సాగదీసి చివరకి పరిహాసమాడడం అప్రజాస్వామికం.ఇదే ప్రభుత్వం లక్షకోట్ల ప్రజాధనం వ్యయంతో పరిమిత లాభం గల బుల్లెట్ రైలు ప్రాజెక్టుని ఘనంగా తలకెత్తుకుంది. ముంబై, అహ్మదాబాద్ నగరాల మధ్య సవాలక్ష విమానాలు ఎగురుతున్నాయి.అంతకు మించి రైళ్లు,బస్సులు ఏడు గంటల ప్రయాణంతో ప్రయాణీకుల్ని చేరవేస్తున్నాయి.ఆ ప్రయాణ సమయం మూడు గంటలకి తగ్గించడానికి లక్షకోట్లు ధారబోసే ప్రయాస పడాలా! దాని వల్ల కలిగే లాభమేపాటిది?ప్రభుత్వం ప్రజల పట్ల బాధ్యతతో ఆలోచిస్తే అర్థమౌతుంది ఏది అవసరమో,ఏది అనవసరమో?

-డా. డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ, పార్వతీపురం.

విశాలాంధ్ర
బతుకు
The Life
శనివారం
17 మార్చి 2018



ఉగాది పండగ అన్ని పండగలకూ భిన్నమైనది. ఇది ప్రకృతి పండగ. తెలుగు సంవత్సరాది ప్రారంభదినమే ఉగాది. ఆరు రుచుల సమ్మేళనం ఉగాది పచ్చడితో పాటు కొత్త ఏడాది రోజున కొత్త వంటకాల మీద దృష్టి పెట్టేవాళ్ళూ ఉంటారు. ఇవి కొత్తగానే కాదు కాలానికి తగ్గట్టుగా శరీరానికి పోషకాలు అందించే వంటకాలు అయితే మరింత మంచిది కదా! అలాంటి వంటకాలనే మనము ఈ రోజు గుర్తు చేసుకుందాం. సంప్రదాయ వంటకాల గురించి మన ముందు తరాలు, పెద్ద తరానికి బాగా తెలుసు. వాళ్ళు ఏడాది పొడవునా చేసిన వంటకాలే ఇవి. ఈ తరానికి వీటిని చెయ్యడం కాదు అసలు తెలుసుకోవడానికే సమయం ఉండడం లేదు. అందుకే అందరికీ తెలిసిన పాత వంటకాలనే సరికొత్తగా గుర్తుచేసుకుందాం! వీలైతే ఒకసారి వండి చూద్దాం!

ఉగాది రుచులు

ఈ ఉగాది పచ్చడిని ఒక్కో ఇంట్లో ఒక్కో రకంగా తయారు చేస్తారు. ఎలా చేసినా ఇందులో ఆరు రుచులు కచ్చితంగా ఉండాలి. ఈ షడ్రుచుల మిశ్రమమైన ఉగాది పచ్చడి అత్యంత ఆరోగ్యకరం. అందుకనే ఈ రోజున దీనిని తప్పనిసరిగా తినాలని చెబుతారు. ఈరోజు మాత్రమే కాదు ఈ సీజన్ అంతా పచ్చడిని తినవచ్చు. అలా తింటే రోగాలకు ఆమడదూరాన ఉన్నట్టే.

ఉగాది పచ్చడి

కావలసిన పదార్థాలు

చింతపండు గుజ్జు చిన్న నిమ్మకాయంత, బెల్లం అరకప్పు, ఉప్పు చిటికెడు, కారం పావు టీ స్పూన్, పచ్చిమామిడి కాయ ఒకటి, అరటిపండు ఒకటి, వేప పువ్వు అర రెండు టీ స్పూన్‌లు.



తయారీ విధానం

మామిడికాయ, బెల్లాన్ని సన్నగా తురిమి పెట్టుకోవాలి. అరపండుని చిన్న ముక్కలుగా చేసుకోవాలి. చింతపండు గుజ్జు నుంచి రసం తీసి మిగిలింది పాడేయాలి. ఒక గిన్నెలో ఇవన్నీ వేసి కలపాలి. ఇందులోనే ఉప్పు, కారం, వేపపువ్వు కూడా వేసి కలపాలి. అంతే ఉగాది పచ్చడి తయారైనట్టే. ఈ పచ్చడిలో ఇష్టమైనవాళ్ళు కొబ్బరి తురుము కూడా కలుపుకోవచ్చు. కొంతమంది దీనిని ముందుగా తాలింపు వేసి అందులో అన్నీ వేసి కలుపుతారు. తాలింపుతో పాటు అందులో అన్ని పదార్థాలు వేసి కొద్దిగా ఉడికించి దించుకోవచ్చు కూడా. ఇలా రకరకాలు ఉగాది పచ్చడిని తయారు చేస్తారు.

బియ్యం, శనగపప్పు పాయసం

శనగపప్పుతో పాయసం ఎప్పుడైనా తయారు చేశారా? అసలు విన్నారా! ఇది దక్షిణాది వంటకమే. ముఖ్యంగా కర్నాటకలో దీనిని ఎక్కువగా తయారు చేస్తారు. పండగలప్పుడే కాదు, పెళ్ళిళ్ళు, నామకరణ మహోత్సవం, తదితర వేడుకల్లోనూ ప్రత్యేకంగా దీనిని తయారు చేయిస్తారు కన్నడిగులు. అక్కడ దేవాలయాల్లో నైవేద్యంగానూ పంచుతారు. అంత ప్రసిద్ధి కర్నాటలో ఈ వంటకం. ఎప్పుడూ తయారు చేయలేదే అని ఇబ్బందిపడక్కర్లేదు. చాలా తేలిగ్గా, నిముషాల్లో దీనిని వండేయవచ్చు. ఈ స్వీట్ మీ పండగ వాతావరణానికి మరింత సంతోషాన్ని చేకూరుస్తుంది.



కావలసిన పదార్థాలు

పచ్చి శనగపప్పు ముప్పావు కప్పు, బియ్యం అర కప్పు, నీళ్ళు ఆరున్నర కప్పులు, గసగసాలు ఒక టేబుల్ స్పూన్, కొబ్బరి తురుము ఒక కప్పు, బెల్లం ఒక కప్పు, నెయ్యి ఒక టేబుల్ స్పూన్, జీడిపప్పు ముక్కలు పావు కప్పు, కిస్‌మిస్‌లు పావు కప్పు, యాలకుల పొడి పావు టేబుల్ స్పూన్ .

తయారీ విధానం

పొయ్యి మీద పాన్ పెట్టి వేడి చేసి శనగపప్పు వేసి వేయించండి. అది వేగిన తర్వాత బియ్యం వేయండి. మధ్యస్థాయి మంట మీద రెండు నిముషాలు వేయించిన తర్వాత ఈ రెండింటిని కలిపి కుక్కర్‌లో వేసి ఐదు కప్పుల నీళ్ళు పోయండి. మూడు, నాలుగు విజిల్స్ వచ్చేవరకూ ఉడికించి తర్వాత చల్లారనివ్వండి. అది అలా పక్కన ఉంచి పొయ్యి మీద పాన్ పెట్టి గసగసాలు వేసి వేయించండి. పచ్చి వాసన పోయేవరకూ ఉంచండి. ఈ గసగసాలతో పాటు తురిమిన కొబ్బరిని, అరకప్పు నీటిని కలిపి మిక్సీలో వేసి మెత్తగా చేయండి. దీనిని తీసి పక్కన పెట్టుకోండి. పాన్‌ను వేడిచేసి మధ్యస్థాయి మంట ఉంచి బెల్లం వేయండి. ఆ వెంటనే అర కప్పు నీళ్ళు పోయండి. ఐదు నిముషాల్లో బెల్లం కరిగిపోయి ఉడకడం ప్రారంభమవుతుంది. ఇది ఉడుకు పట్టిన తర్వాత మంట సన్నగా పెట్టి ఇందులో ఉడికించిన బియ్యం, శనగపప్పుని వేయండి. దీనిని బాగా కలిపి అరకప్పు నీటిని పోయండి. మిక్సీ పట్టిన మిశ్రమాన్ని కూడా వేసి బాగా కలతిప్పండి. రెండు, మూడు నిముషాలు ఉంచండి. నేతిలో వేయించిన జీడిపప్పు ముక్కలు, కిస్‌మిస్‌లు ఇందులో వేయండి. ఇక చివరగా యాలకుల పొడి చల్లండి. అంతే బియ్యం, శనగపప్పు పాయసం రెడీ. వేడివేడిగా తింటే చాలా బాగుంటుంది. బియ్యం, శనగపప్పు కుక్కర్‌లో ఉడికించేటప్పుడు అందులో కప్పు పాలు కూడా పోస్తే రుచి మరింత హెచ్చుతుంది. బెల్లం పాకంలో బియ్యం, శనగపప్పు మిశ్రమాన్ని వేసేటప్పుడు మంటను బాగా తగ్గించి పెట్టడం మర్చిపోవద్దు. ఇష్టమైనవాళ్ళు ఇందులో కొబ్బరి పాలూ పోసుకోవచ్చు. ఇలా చేసుకుంటే ప్రత్యేకమైన రుచి వస్తుంది.

బాదం పూరీ!

ఇది కూడా పండగల సమయంలో ప్రత్యేకంగా చేసుకునే తీపి వంటకమే. పేరుకి ఇది బాదం పూరీనే కానీ బాదం లేకుండానూ దీనిని తయారు చేసుకోవచ్చు. అదే దీని ప్రత్యేకత. పేరు వింటూనే నోరూరిపోయే వంటకాల్లో ఇదీ ఒకటి. రూపంలో ఆకట్టుకోవడమే కాదు రుచిలోనూ ఇది ప్రత్యేకమైనదే. పైన కరకరలాడుతూ, లోపల అంతా మెత్తగా నోట్లో పెట్టగానే కరిగిపోయేలా ఉండే ఈ స్వీట్‌ను పిల్లలూ, పెద్దలు కూడా బాగా ఇష్టపడతారు. మరి ఈ ఉగాది రోజున సరికొత్తగా బాదం పూరీని మీరూ తయారు చేస్తారా!

కావలసిన పదార్థాలు

మైదా పిండి ఒక కప్పు, పంచదార ముప్పావు కప్పు, కరిగించిన నెయ్యి పావు కప్పు, ఎండు కొబ్బరి తురుము అర కప్పు, నూనె డీప్ ఫ్రైకి సరిపడ, బియ్యం పిండి రెండు టేబుల్ స్పూన్‌లు, నీళ్ళు ఒక కప్పు, ఉప్పు రుచికి సరిపడ, యాలకుల పొడి ఒక టేబుల్ స్పూన్ లవంగాలు ఎనిమిది లేదా పది.



తయారీ విధానం

ఒక వెడల్పాటి గిన్నె తీసుకుని మైదాపిండి, బియ్యం పిండి, ఉప్పు, నెయ్యి వేసి బాగా కలపండి. పిండి అంతా బాగా కలిసేవరకూ, ఉండలు లేకుండా మృదువుగా, మెత్తగా అయ్యేవరకూ కొద్దికొద్దిగా నీళ్ళు పోస్తూ కలపండి. దీనిని పది నిముషాలు పక్కన పెట్టండి. పాన్ తీసుకుని అందులో పంచదార, నీళ్ళు పోసి పొయ్యి మీద పెట్టండి. పంచదార అంతా కరిగి పాకం రావడం ప్రారంభమైన తర్వాత యాలకుల పొడి వేసి పొయ్యి మీద నుంచి తీసి పక్కన పెట్టండి. కలిపి ఉంచుకున్న పిండిని చిన్నచిన్న ముద్దలుగా తీసుకుని గుండ్రంగా చేయండి. వీటిని త్రిభుజాకారంలో పూరీల్లా చేయండి. పూరీ పొరలు విడిపోకుండా మధ్యలో లేదా చివర్ల లవంగాన్ని గుచ్చండి. పొయ్యి మీద పాన్ పెట్టి నూనె వేసి బాగా కాగనివ్వండి. ఇందులో పూరీలు వేసి వేయించండి. వేయించిన పూరీలను ఆ వెంటనే పంచదార పాకంలో ముంచి తీసి ప్లేట్‌లో పెట్టండి. ఆ పైన కొబ్బరి తురుము చల్లండి. అంతే బాదం పూరీలు లేదా పాకం పూరీలూ రెడీ. ఈ పిండి కలుపుకునేటప్పుడు బాదం పొడి వేసి కలుపుకోవచ్చు. ఇలా చేస్తే పూరీలకు కొత్త రుచి వస్తుంది, పేరుకు తగ్గ వంటకం అవుతుంది. బాదం అందుబాటులో లేనివాళ్ళు, ఈ రుచిని ఇష్టపడనివాళ్ళు ఇది లేకుండానే చేసేసుకోవచ్చు. పంచదార పాకం తొందరగా రావాలనుకుంటే ముందుగా పాన్‌ను బాగా వేడెక్కనివ్వండి. పాకం వచ్చే వరకూ బాగా కలుపుతూ ఉండండి. పూరీలు వేసే సమయానికి పంచదార పాకం చిక్కబడిపోతున్నట్లు అనిపిస్తే అందులో కొద్దిగా నీళ్ళు పోసి మరోసారి వేడిచేయండి.

మామిడికాయ పులిహోర

మామిడికాయలు వచ్చే కాలం ఇది. కొత్త మామిడికాయలతో ఈ సీజన్‌లో అతి ఎక్కువగా చేసుకునే సంప్రదాయ వంటకం మామిడికాయ పులిహోర లేదా మ్యాంగో రైస్. ఇది ఎంత ప్రసిద్ధి చెందిందో అంత అరోగ్యకరమైనది కూడా. ఈ వేసవి సీజన్‌లో ఉదయాన్నే రుచిగా, ఉండే, ఆరోగ్యంగా ఉంచే అల్పాహారం ఏదైనా ఉందంటే అది మామిడి పులిహోరే. దీనినే మామిడి చిత్రాన్నం అని కూడా అంటారు. చూడగానే నోరూరించడమే కాదు శరీరానికి మంచి పోషకాలనూ ఇది అందిస్తుంది. ఒక్కసారి తింటే మళ్ళీమళ్ళీ తినాలనిపించే వంటకం ఇది.

కావలసిన పదార్థాలు

బియ్యం ఒక కప్పు, కొబ్బరి తురుము ముప్పావు కప్పు, నూనె తగినంత, కొత్తిమీర అరకప్పు, వేరుశెనగ గుళ్ళు అరకప్పు, పచ్చిమిర్చి ఎనిమిది లేదా పది, మామిడి కాయ ఒకటి, గుప్పెడు కరివేపాకులు, చిటికెడు ఇంగువ, ఆవాలు అర టేబుల్ స్పూన్, పచ్చి శనగపప్పు అర టేబుల్ స్పూన్, మినపప్పు అర టేబుల్ స్పూన్, మెంతులు అర టేబుల్ స్పూన్, పసుపు అర టేబుల్ స్పూన్, ఉప్పు ఒకటి, రెండు టేబుల్ స్పూన్‌లు (తగినంత) .



తయారీ విధానం

బియ్యం బాగా కడిగి కుక్కర్‌లో పెట్టి మూడు విజిల్స్ రానివ్వండి. కుక్కర్ మూత తీసి అన్నం చల్లారేవరకూ (పావుగంట) ఉంచండి. మామిడికాయను బాగా సన్నగా తరగండి. మెంతులు, కొద్దిగా ఆవాలు వేయించి బాగా పొడి చేయండి. పాన్ తీసుకుని రెండు టేబుల్ స్పూన్‌ల ఆయిల్ వేసి కాగాక ఆవాలు, శనగపప్పు, మినపప్పు, ఇంగువ, కరివేపాకులు వేసి వేగనివ్వండి. అందులోనే వేరుశెనగ గుళ్ళు వేసి వేయించండి. తర్వాత పచ్చిమిర్చి ముక్కలు, పసుపు మామిడికాయ తురుము వేసి ఒకటి, రెండు నిముషాలు ఉంచండి. చివరగా ఇందులో అన్నం వేసి బాగా కలపండి. చివరగా ఉప్పు, మెంతిపొడి చల్లి కలపండి. అంతా అయ్యాక కొబ్బరి తురుము, కొత్తిమీర తరుగు చల్లండి. అంతే మామిడికాయ పులిహోర లేదా మామిడి చిత్రాన్నం రెడీ. ఇందులో మీకు ఇష్టమైన ఏదైనా చెట్నీ కలుపుకుని అయినా తినవచ్చు. అన్నం ముందుగా వండుకుని కలుపుకుంటేనే తినడానికి బాగుంటుంది. ఇలా కాకుండా ఇందులోనే వేసి ఉడికిస్తే ఉండలు కట్టేస్తుంది. చూడడానికి, తినడానికి కూడా బాగోదు. మెంతి, ఆవాలు పొడి పచ్చి మామిడికాయ పులుపు ఘాటుని నోటికి అంతగా తెలియనివ్వకుండా చేస్తాయి. మీకు పులుపు ఎంతగా ఇష్టమైతే అంత ఎక్కువగా మామిడి తురుము ఇందులో కలుపుకోవచ్చు. ఇందులో కరివేపాకులు ఎంత ఎక్కువ వాడితే ఆరోగ్యానికి అంత మంచిది.



అతడు-ఆమె



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

ఊరుబిండి అతని చేతిలో వేస్తూండగా నా గెడ్డం పట్టుకుని ముద్దుపెట్టుకోబోయాడు. "తడిగావంచా కట్టుకుని ముద్దు పెట్టుకోండి. లేకపోతే ఊరుబిండి మైలపడిపోతుందండీ" అన్నాను. "మైలా, గియలా మా ఇంగ్లీషువారికి లక్ష్యంలేదు, ఇలారా!" అని గిరీశం నన్ను ముద్దు పెట్టుకున్నాడు. "అబ్బ! ఊరుబిండికంటే కంపుగా వుందండీ! మీ నోరు!" అన్నాను. "దటీజ్ ఇగ్నోరెన్సు- అనగా అది ఒక అజ్ఞానం. ఇది చుట్టకంపు కాదు. హవానా సిగర్స్ ఫ్రాగ్రెన్సు. అనగా తెల్లవాడి సమిధుల యొక్క ధూపం" అన్నాడు గిరీశం. "ఏమోనండీ! నా నోట్లో ఇల్లాంటి వాసనని మా అమ్మ పసిగట్టిందంటే ఎమికలు విరగ్గొడుతుందండీ!" అన్నాను. "దటీజ టిరనీ! యిదే బంగాళీగుంట అవుతే యేం జేస్తుందో తెలిసిందా? తల్లి అయేది, తండ్రి అయేది చీపురుకట్ట పట్టుకుని బుర్ర వాయగొడుతుంది!" అన్నాడు గిరీశం. "నన్నూ అట్లాగే చెయ్యమంటారా?" "నాట్ ది స్లయిటెస్టు అబ్జెక్షన్! దటీజ్ సోషల్ రిఫామ్! అనగా అది లోకం మరామత్తు!" అన్నాడు గిరీశం - నాకు తెలివొచ్చేసింది.

(నిన్నటి సంచిక తరువాయి)

16 అతడు

డైరీ రాసి నెలరోజులైంది. అప్పుడే జూలై పదిహేను వొచ్చేసింది. ఈనెలనెలా పదిహేను రోజులూ ఊపిరి సలపకుండా పనే. గోదావరి రైలు వంతెనని వెడల్పు చెయ్యాలని 'వార్ డిపార్టుమెంటు' ఫర్మానా యిచ్చింది. అందుకు సంబంధించిన పాత ప్లానులన్నీ వెతికి, నాటి సారాంశం తయారు చెయ్యమని పెద్దదొర నాకు పని అప్పజెప్పాడు. రోజూ మిలిటరీ ఇంజనీర్లతో సమావేశాలు, సంప్రతింపులే. నిన్నటికి పూర్తిచేసి కాగితాలన్నీ ఇచ్చేశాను. అసలే క్లబ్బుకీ, నాకూ సహం ఎరుక. ఈ హడావుడి వచ్చింతరువాత క్లబ్బు గుమ్మమే తొక్కలేదు. నిన్న ఆ కాగితాలిచ్చేసిన తరవాత తలకదుక్కున్నట్టుంది. అంచేత ఒకమాటు క్లబ్బుకి వెళదాం అని కారు అటువేపు తిప్పా. క్లబ్బు ఆవరణలోకి వెళ్ళబోతున్నాను - సుభ, వాళ్ళ అమ్మా, నాన్నా కార్లో క్లబ్బు నుంచి ఇంటికి వెళ్ళిపోతున్నారు. ఆవిడ దూరంనుంచి చెయ్యి వూపింది నన్ను చూసి. బహుశా నా గురించి తన తల్లి దండ్రులతో చెప్పి వుండదనుకుంటాను. ఏమిటని చెబుతుంది? గోదావరి వంతెనని కట్టించిన మహానుభావుడని చెబుతుందా? కృష్ణ వారధిని వేయించిన ఘనుడని వర్ణిస్తుందా? కొత్త ఆఫీసు భవనం నిర్మించిన శిల్పి అని పొగుడుతుందా. లక్షమంది ఇంజనీర్లలో నేనొకడిని, కోటికాకులల్లో ఒక కాకిని. పోనీ, వాళ్ళ ఇంటికి వెళుదునా? సీతారాం తరుచు వాళ్ళింటికి వెళుతూంటానని మొన్న యేదో గాంధిజీ కాంగ్రెసు గురించి మాటొచ్చి - అన్నాడు. అబ్బే! నేను వెళితే సుభని వెంబడించి నట్టుంటుంది. మర్యాద తెలియనివాడు అనుకుంటారు. నా ప్రీస్ట్రెస్డు కాంక్రీటుబ్రిడ్జీ డిజైనుని ఇంజనీరింగు సాంకేతిక పత్రికల్లో ప్రచురించి పేరు సంప్రదించి అప్పుడు వాళ్ళింటికి వెళతాను! "అమ్మా నాన్నా! ఇదిగో ఈయనే జనార్ధనరావుగారు, ఇంజనీరింగులో ఉద్దండపిండం! మొన్ననే ఈయన్ని గురించి పత్రికల్లో చదివాంకామూ!" అని నన్ను వాళ్ళ తల్లిదండ్రులకి పరిచయం చేస్తుంది....ఓ వెర్రికుట్టే! నీ డిజైను చూసినవాడెవడు? నీ ఇంజనీరింగు పత్రికలు చదివి ఆనందించేవాడెవడు? ఈ మహాసముద్రంలో యీ కాకిరెట్టని చూసి ఆశ్చర్యపడేవా డెవడోయ్? అనుకుని కారుని వెనక్కి తిప్పేసి ఇంటికి వెళ్ళిపోయాను.

ఇంటికెళ్ళేసరికి చిన్నదొర అంతరంగిక గుమస్తా గుమ్మంలో హాజరై కూచున్నాడు. నన్ను చూసి లక్కతో సీలువేసిన వుత్తరాన్ని జేబులోంచి తీసి "మీకోసం ధరణా కూచున్నాను. పెద్దదొర మీ చేతికే స్వయంగా ఇవ్వమన్నాడండి" అంటూ ఆ వుత్తరాన్ని నాచేతికిచ్చి వెళ్ళిపోయాడు. అత్యంత "అవసరం - పరమ రహస్యం" అని పైన రాసివుంది వుత్తరం మీద - లోపల వుత్తరం చదువుకున్నాను. "జపానువాళ్ళు యేనిమిషానికి దేశంమీద కొస్తారో ఏం తెలియడం లేదు. జపాను దండయాత్రని యెదుర్కొనడానికి అతి రహస్యమైన ఇంజనీరింగు పనులని కొన్నింటికి తక్షణం చేయవలసి వుంది. అందుకుగాను పెద్ద ఆఫీసర్లలో అతినమ్మకమైన కొద్దిమందిని ఎంచబోతున్నాం. ఇందులో పంపించుతూన్న ప్రశ్నావళిని పూర్తిచేసి వెంటనే ఇరవై నాలుగు గంటలలో పెద్దదొరకి అందజేయవలసింద"ని వుంది. ప్రశ్నావళిలో ఏముందీ? పేరూ, వూరు, వయస్సు, హోదా, జీతం



వగైరా వగైరా బాగానేవుంది. తరవాత: మీ రాజకీయాభిప్రాయాలేమిటి? మీకు పెళ్ళి అవుతే మీ భార్యయొక్క, లేక మీరు ప్రదానం అవుతే మీ కాబోయే భార్యయొక్క - అదీకాకపోతే మీ స్నేహితురాండ్రయొక్క (ఒకటి రెండు మూడు అంటూ వరుసగా పేర్కొని) రాజకీయాభిప్రాయాలు ఏమిటి? మీ స్నేహితులలోనూ, బంధువర్గంలోనూ (పై ప్రశ్నక్రిందవచ్చే స్త్రీలతో సహా) కాంగ్రెసు కమిటీలకుకాని, కమ్యూనిస్టు పక్షానికికాని చెందినవారున్నారా? ఉంటే-వారి రాజకీయలక్ష్యం, వారియొక్క పూర్తి వివరాలు. షరా: పై ప్రశ్నలకు బుద్ధిపూర్వకముగా అబద్ధపు జవాబులు వ్రాసినయడలగానీ, యీ ఉత్తరం సంగతి యితరులకు తెలియపరచినగానీ ఢిఫెన్సు ఆఫ్ ఇండియా ఆర్డినెన్సు ప్రకారం రాజద్రోహపు నేరంకిందనూ, ఆర్మీయాక్టు ప్రకారమున్ను సమ్మరీ శిక్షకు పాత్రలవుతారు" అని వుంది.

సరే ఏముంది - వెంటనే రాసిపారేద్దాం అనుకుని స్నానం చేసి అయ్యరుని కాఫీ పెట్టి ఇమ్మని మేజాదగ్గిర కూచున్నాను. మొదటి నాలుగు ప్రశ్నలకు జవాబులు రాసేశాను. గవర్నమెంటు ఉద్యోగిని, మిలిటరీ అధికారిని అగుటచేత నాకు రాజకీయాభిప్రాయాలు లేవు - నేను యే రాజకీయపక్షంలోనూ యెన్నడూ చేరలేదు - నాకు పెళ్ళి కాలేదు. నాకు స్నేహితురాండ్రు యెవ్వరూ - లేరు - అని రాయబోదాం అనుకున్నాను. టక్కుని కలం పట్టేసింది. నాకు తెలిసిన స్త్రీలు యెవరున్నారు? ఆగు - ఆగు. సూరమ్మ పిన్ని వుంది. మా అమ్మలాగే సూరమ్మగారు కూడా నీళ్ళబిందెలు మోసేది. మా అమ్మకంటే చిన్నదవటంచేత పిన్ని అని నేను చిన్నప్పుడు పిలిచేవాడిని. ఆవిడ నెలసరి నాగాలు పెడితే ఆమెవంతు మా అమ్మ ఆమె వాడిక ఇళ్ళలో పోసేది. అందుకు సూరమ్మ పిన్ని అమ్మకి డబ్బులు ఇస్తానంటే అమ్మ పుచ్చుకునేదికాదు. నాకు ఉద్యోగం అయిన కొత్తరికంలో అమ్మ చెన్నపట్నం వస్తూ సూరమ్మ పిన్నినికూడా ఒకమాటు సాయం తీసుకొచ్చింది. మరునటి సంవత్సరం వాళ్ళిద్దరికీ, నాకు ఫస్టుక్లాసు పాసులు తెప్పించి వాళ్ళకి రామేశ్వరంయాత్ర చేయించాను. అమ్మకోరిక ప్రకారం అమ్మ చచ్చిపోయేక ఆవిడకి నెలకి పాతిక రూపాయలు పంపిస్తున్నాను. మొన్న బాంబింగు అయాక విశాఖపట్నంలైను తనిఖీకి వెళ్ళినప్పుడు కొత్తఅగ్రహారం సందులో ఆవిడె ఇంటికి వెళ్ళాను ఆవిడను చూసేందుకు. మిలిటరీ డ్రైవరు అన్నాడు:

"మీకు తెలిసినవాళ్ళు ఈ సందులో ఎవరుంటారండీ? ఈ సందులోకి కారు వెళ్ళదే" అన్నాడు. "నువ్విక్కడుండు - నేను నడచి వెళ్ళి వస్తానులే" అన్నాను. పాపం, ఇల్లేమిటి - పంచ! ఆ వీధి అరుగుమీదే - పీటవేసి కూర్చోమంది. రాత్రికి మూత పెట్టుకుంది కాంసు - మజ్జిగలో తడిప్పెటిన అటుకులు తినమని బాదం ఆకులో వేసి యిచ్చింది. "సూరమ్మ పిన్నీ! యీ ఫలహారం నాకు పెడితే నీకు మరి రాత్రికి వస్తేకదమ్మ! ఇంత మంచినీళ్ళు దాహానికి నీ చేత్తో ఇయ్యి. అదే చాలు" అన్నా. "అదేమిటి? జనార్ధనంబాబు! గవనేరు పని చేస్తూన్నవాడికి నేనేం పెట్టగలను! పంచభక్ష్య పరవాణ్ణం అనుకుని యీ అటుగ్గింజలే నోట్లో వేసుకో నాయనా! ఇంకా ఎన్నాళ్ళిలా బతకాలో! తలమాసిన ముండని, ఆ అచ్చమ్మక్కయ్య యే స్వర్గంలో వుందో - ఆవిడ ధర్మమా అంటూ నాకు ఏ లోపం లేకుండా నువ్వు చూస్తున్నావు. మిమ్మల్నిద్దరినీ తలచుకోని క్షణం లేదంటే నమ్ము నాయనా!" అని కంటతడిపెట్టుకుంది... ఇక పెద్దదొర ప్రశ్నావళిలో సూరమ్మ పిన్నిగురించి - "ఆవిడె రాజకీయపార్టీ - అఖిల భారత గంగా భాగీరథీ సమాజం మాజీ ఉపాధ్యక్షురాలు - వయస్సు - అరవయ్యోపడి - రాజకీయాభిప్రాయాలు - మొరంసొజ్జి, పొంగరం, అటుకులు పేలాలు - పిచ్చాపాటీ - సీతారామస్వామి కోవిల్లో రామస్మరణ - రీడింగు రూములో పురాణ కాలక్షేపం" - అని రాయాలి! పోతే అంతే - మరెవ్వరున్నారు? సుభపేరు రాయాలా ఏమిటి? యేవ్రని రాస్తాను? తల్లిదండ్రులు ప్రముఖ కాంగ్రెసువాదులు. సుభ రాజకీయాలు కాంగ్రెస్సా, కమ్యూనిస్టా? నేనెప్పుడూ అడిగి తెలుసుకోలేదే! కాంగ్రెసు వాళ్ళని అప్పుడప్పుడూ విమర్శిస్తూండేది. కమ్యూనిస్టులూ మంచివాళ్ళే అంది ఒకమాటు. అంచేత కమ్యూనిస్టువొచ్చునా? ఆవిడె రాజకీయాలతో వీళ్ళకేం పని? నా ఇంజనీరు పని నెరవేర్చడంలో ఆమె రాజకీయాభిప్రాయాలతో వీళ్ళకేం పని? నా ఇంజనీరు పని నేరవేర్చడంలో ఆమె రాజకీయాభిప్రాయాలతో ప్రసక్తెందుకు గవర్నమెంటుకి? నన్ను సి.ఐ.డి. పని చెయ్యమనా? ఛీ! నేనా పని చెయ్యను. నాకు తెలియదు అని రాసేస్తాను. అసలు రాయడమే పిరికిపంద పని. నేను రాయేరాయను. రాయను సరేకదా - 'నా సాంకేతిక విద్యను చూసి మీరు నాకు ఉద్యోగం ఇచ్చారు. ఇన్ని సంవత్సరాలు నా పనిని నేను శక్తివంచన లేకుండానూ, మీకు తృప్తికరంగానూ, మనస్ఫూర్తిగానూ నెరవేరుస్తున్నాను. అందుచేత నా స్నేహితుల రాజకీయాభిప్రాయాల ప్రస్తావన మీ కవసరం లేదు. ఈ కారణాలచేత నేను ప్రశ్నావళిని పూర్తి చేయకుండానే తిరిగి పంపించేస్తున్నాను అని రాసేస్తాను.

ఎందుకేనా మంచిది - సుభనే అడుగుదునా? 'ఇలా కాగితం వచ్చింది. చాలా రహస్యం. ఆ ప్రశ్నావళికి ఏమని జవాబు రాయమన్నారు? మీ సలహా తీసుకుని ఆ ప్రకారం రాస్తాను' అని అడుగుతాను. నయం ఇంకా! నా బుద్ధి గడ్డి తింటుందా ఏమిటి? లేకపోతే ఆమెని ఇరుకులో పెట్టడమేమిటి? నా వ్యవహారం. నాబాధ్యత ఆమె నెత్తిమీద పెట్టడమేమిటి? నాకేమిటి మాయదారి బుద్ధులు? "బ్రిటిషువాడుమనకిన్నాళ్ళుండి ఏం వలకపోశాడు - జపానువాడూ, జర్మనీవాడూ వచ్చి మనకేం వలకపోయ్యాలి గనక? ప్రపంచంనుంచి సామ్రాజ్యవాదులనీ, ఫాసిస్టులనీ అవసరం అయితే కత్తికఠార్లతో యుద్ధంచేస్తూ ప్రజాస్వామ్యాన్ని, సామ్యవాద సమాజాన్ని, అందుతోపాటు భారత స్వాతంత్ర్యాన్ని కూడా స్థాపించాలి" అని అంది ఒకసారి. ఇది కమ్యూనిజం కింద లెక్కా? మార్క్సు లెనిను, స్టాలిను అని మాత్రం రెండు మూడుమాట్లు ఈ మధ్యే అంటూ వచ్చినట్లు నాకు జ్ఞాపకం.

- ఇంకా వుంది.

ఐఐఎస్‌సీలో కోర్సు పూర్తిచేస్తే భవిష్యత్ బంగారమే

ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల

దేశంలో సైన్స్ ఎడ్యుకేషన్ అంటే టక్కున గుర్తొచ్చే విద్యాసంస్థ... బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్‌సీ).
అంతర్జాతీయంగా యూనివర్సిటీలకు ర్యాంకులు ఇచ్చే క్యూఎస్, టైమ్స్, ఏఆర్‌డబ్ల్యూయూ తదితర సంస్థల ర్యాంకుల జాబితాలో ప్రతిఏటా తప్పనిసరిగా స్థానం పొందే సంస్థ ఇది. దీనికి ప్రధాన కారణం.. బోధన, పరిశోధన పరంగా ఇన్‌స్టిట్యూట్‌లో పాటిస్తున్న ప్రమాణాలే. ఇక్కడ కోర్సులు పూర్తి చేస్తే.. భవిష్యత్తు బంగారమవుతుందనే అభిప్రాయముంది. 2018-19 విద్యా సంవత్సరానికి.. యూజీ, పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఐఐఎస్‌సీ నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో పూర్తి వివరాలు...

ప్రయోజనాలు..

ఐఐఎస్‌సీలో ఏ కోర్సులో ప్రవేశం లభించినా.. ఉజ్వల భవిష్యత్తు సొంతమవడం ఖాయం. ఇటీవల కాలంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ గణాంకాలే ఇందుకు నిదర్శనం. బ్యాచిలర్, పీజీ ప్రోగ్రామ్‌ల అభ్యర్థులకు ఆర్ అండ్ డీ సంస్థలు, మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలు, ఫార్మసీ సంస్థల్లో సగటున రూ.15లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు లభిస్తున్నాయి.
పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి డీఆర్‌డీఓ, డీబీటీ తదితర పరిశోధన సంస్థల్లో పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్స్, సీఎస్ఐఆర్ లేబొరేటరీల్లో సైంటిస్ట్ హోదాలో ఉద్యోగాలు లభిస్తున్నాయి.
ఐఐఎస్సీలో ప్రవేశం పొందిన విద్యార్థులు సమంజసమైన ట్యూషన్ ఫీజుతోపాటు అత్యాధునిక ల్యాబ్స్, తక్కువ ధరకే భోజనం, వసతి వంటి ఇతర సౌకర్యాలు కూడా అందిపుచ్చుకోవచ్చు.
ఇంటిగ్రేటెడ్ పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు ఎంపికైన అభ్యర్థులకు ఎంహెచ్ఆర్‌డీ, సీఎస్ఐఆర్, యూజీసీ, ఐసీఎంఆర్, డీబీటీ, ఏఐసీటీఈ, డీఏఈ సంస్థలు అందించే స్కాలర్‌షిప్ లభిస్తుంది.

యూజీ ప్రోగ్రామ్స్...

ఐఐఎస్‌సీ అందించే యూజీ కోర్సు.. బ్యాచిలర్ ఆఫ్ సైన్స్(రీసెర్చ్). ఈ కోర్సు వ్యవధి నాలుగేళ్లు. కోర్ సైన్స్, ఇంటర్ డిసిప్లినరీ అంశాలు ఇందులో భాగంగా బోధిస్తారు. బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ ప్రోగ్రామ్‌ను పూర్తిచేస్తే.. ఇండస్ట్రీలో, ఉన్నత విద్య



పరంగా ఆకర్షణీయ అవకాశాలు అందుకోవచ్చు. నాలుగేళ్లు పూర్తి చేసిన తర్వాత అభ్యర్థులకు ఆసక్తి ఉంటే మరో ఏడాది అక్కడే చదివి(ఎంఎస్) మాస్టర్ ఆఫ్ సైన్స్ పట్టా అందుకునే అవకాశాన్ని ఐఐఎస్‌సీ కల్పిస్తోంది. నాలుగేళ్ల బీఎస్ కోర్సుల్లో భాగంగా సైన్స్ సబ్జెక్టులు స్పెషలైజేషన్‌లుగా చదవడంతోపాటు ఇంజనీరింగ్, సోషల్ సైన్సెస్ అంశాలను అధ్యయనం చేయాల్సి ఉంటుంది. మొదటి మూడు సెమిస్టర్‌లలో విద్యార్థులంతా తప్పనిసరిగా... ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అంశాలు చదవాల్సి ఉంటుంది. ఆ తర్వాత 4వ, 5వ , 6వ సెమిస్టర్‌లలో విద్యార్థులు తమకు నచ్చిన స్పెషలైజేషన్లు (ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, బయాలజీ, మెటీరియల్స్ అండ్ ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్) ఎంపిక చేసుకోవచ్చు. 7వ, 8వ సెమిస్టర్స్‌లో ఫ్యాకల్టీ పర్యవేక్షణలో రీసెర్చ్ ఓరియెంటెడ్ ప్రాజెక్టు వర్క్ ఉంటుంది.

అర్హతలు:

12వ తరగతి/ ఇంటర్‌ను 2017లో పూర్తిచేసిన; 2018లో పూర్తిచేసుకోనున్న విద్యార్థులు యూజీ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు.
ఇంటర్/ 12వ తరగతిలో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా చదివుండాలి.
12వ తరగతి/ ఇంటర్‌లో కనీసం 60శాతం మార్కులు సాధించి ఉండాలి.

ఎంపిక విధానం :

కిశోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజన (కేవీపీవై)-ఎస్ఏ స్ట్రీమ్-2016లో ఉత్తీర్ణత సాధించి, ఫెలోషిప్‌నకు ఎంపికైన అభ్యర్థులు.
కిశోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజన (కేవీపీవై)-ఎస్‌బీ స్ట్రీమ్-2017లో ఉత్తీర్ణత సాధించి, ఫెలోషిప్‌నకు ఎంపికైన వారు.
కిశోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజన (కేవీపీవై)-ఎస్ఎక్స్‌కు 2017లో హాజరై, ఫెలోషిప్‌నకు ఎంపికైన అభ్యర్థులు.
కేవీపీవై-ఎస్ఏ, ఎస్ఎక్స్‌కు ఎంపవర్‌మెంట్ ఇనిషియేటివ్ ద్వారా ఎంపికైన ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులు.
ఐఐటీ జేఈఈ-మెయిన్, అడ్వాన్స్‌డ్‌కు 2018లో హాజరవుతున్న అభ్యర్థులు. అయితే ఈ విధానంలో దరఖాస్తు చేసుకునే విద్యార్థులు.. జేఈఈ-మెయిన్, అడ్వాన్స్‌డ్‌లలో జనరల్ అభ్యర్థులు తప్పనిసరిగా 60శాతం మార్కులు సాధించాలి. ఓబీసీ అభ్యర్థులు 54శాతంబీ ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యుడీ అభ్యర్థులు 30శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించడం తప్పనిసరి. నీట్ యూజీ 2018కు హాజరుకానున్న అభ్యర్థులు. కనీసం 60 శాతం(జనరల్), 54 శాతం (ఓబీసీ), 30 శాతం (ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ).

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేది : ఏప్రిల్ 30, 2018 వరకు
దరఖాస్తు ఫీజు : జనరల్/ ఓబీసీ/ కెఎమ్ (కాశ్మీరీ మైగ్రెంట్) అభ్యర్థులకు రూ.500; ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూడీ అభ్యర్థులకు రూ.250
వెబ్‌సైట్ : http://www.iisc.ac.in/ug


పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు...

బ్యాచిలర్ ఆఫ్ సైన్స్‌తోపాటు పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు కూడా ఐఐఎస్‌సీ ప్రకటన విడుదల చేసింది. దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఆయా ప్రోగ్రామ్‌ల వివరాలు...

1. రీసెర్చ్ ప్రోగ్రామ్స్(పీహెచ్‌డీ/ ఎంటెక్ (రీసెర్చ్).
2. కోర్స్ ప్రోగ్రామ్స్(ఎంటెక్/ మాస్టర్ ఆఫ్ డిజైన్/ మాస్టర్ ఆఫ్ మేనేజ్‌మెంట్.
3. ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్.
4. పీహెచ్‌డీ-ఎక్స్‌టర్నల్ రిజిస్ట్రేషన్ ప్రోగ్రామ్స్(ఈఆర్‌పీ).

అర్హతలు :

బీటెక్ ఉత్తీర్ణత లేదా సైన్స్/ ఎకనామిక్స్/ జాగ్రఫీ/ సోషల్ వర్క్/ సైకాలజీ/ మేనేజ్‌మెంట్/ కామర్స్/ ఆపరేషన్స్ రీసెర్చ్/ కంప్యూటర్ సైన్స్/ అప్లికేషన్ స్పెషలైజేషన్లతో పీజీ.
గేట్ స్కోర్ లేదా నెట్ జేఆర్ఎఫ్ ఉత్తీర్ణత.



ఇంజనీరింగ్/ టెక్నాలజీ/ ఆర్కిటెక్చర్/ అగ్రికల్చర్/ ఫార్మసీ/ వెటర్నరీ సైన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు; బీఈ/ బీటెక్ తర్వాత ఎంఎస్/ ఎంబీఏ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరి విషయంలోనూ గేట్, నెట్-జేఆర్ఎఫ్ వారికి కొంత ప్రాధాన్యం ఉంటుంది.
గేట్ స్కోర్ గుర్తింపు పరంగా.. 2016/ 2017/ 2018 సంవత్సరాల్లో గేట్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆప్టిట్యూడ్ టెస్ట్, ఇంటర్వ్యూ..

ఎంటెక్‌లో పేర్కొన్న కొన్ని స్పెషలైజేషన్ల (క్లైమేట్ సైన్స్, కంప్యుటేషనల్ డేటాసైన్స్, ఎర్త్ సైన్స్, ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్)కు అభ్యర్థులను ఎంపిక చేసే క్రమంలో ఆప్టిట్యూడ్ టెస్ట్, ఇంటర్వ్యూను ఐఐఎస్‌సీ నిర్వహిస్తుంది.

మాస్టర్ ఆఫ్ డిజైన్ :

ఐఐఎస్‌సీ అందిస్తున్న మరో మాస్టర్స్ కోర్సు.. మాస్టర్ ఆఫ్ డిజైన్. ఇంజనీరింగ్/ టెక్నాలజీ/ డిజైన్/ ఆర్కిటెక్చర్ కోర్సుల్లో ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణతతోపాటు గేట్ 2016/ 2017/ 2018 స్కోర్/ సీడ్ 2018 స్కోర్ పొందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులను ఎంపిక చేసే క్రమంలో డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్, ఆ తర్వాత చివరగా ఇంటర్వ్యూ ఉంటుంది.

మాస్టర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ :

సైన్స్ ఎడ్యుకేషన్‌కు పేరు గడించిన ఐఐఎస్‌సీ వినూత్నంగా మాస్టర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కోర్సును కూడా అందిస్తోంది. బీటెక్‌లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి గేట్ (2016/2017/2018) స్కోర్లు ఉన్న అభ్యర్థులు/ క్యాట్-2017 ఉత్తీర్ణులు, జీమ్యాట్ స్కోర్ పొందిన అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులు. ఈ స్కోర్ల ఆధారంగా దరఖాస్తులను షార్ట్ లిస్ట్ చేసి తదుపరి దశలో గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తుంది.

ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ :

ఐఐఎస్‌సీ ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్ అందిస్తోంది. ప్రస్తుతం బయలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, మ్యాథమెటికల్ సైన్సెస్ విభాగాల్లో ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్ అందుబాటులో ఉన్నాయి. బీఎస్‌సీ(ఎంపీసీ, బీజెడ్‌సీ) లేదా బీఫార్మసీ, బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, బ్యాచిలర్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ కోర్సుల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణతతోపాటు.. జామ్-2018లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులు.
జెస్ట్-2018 అభ్యర్థులు ఫిజికల్ సైన్సెస్ కోర్సుకు అర్హులు.
బీఈ/ బీటెక్ పూర్తి చేసి.. జామ్-2018లో మ్యాథమెటిక్స్/ మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్ పేపర్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు మ్యాథమెటికల్ సైన్సెస్ కుబీ బయోటెక్నాలజీ పేపర్‌లో ఉత్తీర్ణులు బయలాజికల్ సైన్స్ విభాగాలకు అర్హులు.
కెమికల్ సైన్సెస్ స్పెషలైజేషన్ ఎంపిక చేసుకున్న అభ్యర్థులకు మాత్రం జామ్ స్కోర్‌తోపాటు ఇంటర్వ్యూ కూడా నిర్వహిస్తారు.

పీహెచ్‌డీ-ఈఆర్‌పీ :

ఆర్‌అండ్‌డీ సంస్థలు/ ఇండస్ట్రీస్‌తోపాటు ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మాస్యుటికల్, వెటర్నరీ, మెడికల్ కళాశాలలు/ యూనివర్సిటీల్లోని అధ్యాపకుల కోసం పీహెచ్‌డీ-ఎక్స్‌టర్నల్ రిజిస్ట్రేషన్ ప్రోగ్రామ్స్(ఈఆర్‌పీ)ను ప్రత్యేకంగా ఐఐఎస్‌సీ రూపొందించింది. ఔత్సాహిక అభ్యర్థులు, రెగ్యులర్ కోర్సుల వారికి అవసరమైన అర్హతలతోపాటు సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ జేఆర్ఎఫ్/ డీబీటీ జేఆర్ఎఫ్/ ఐసీఎంఆర్ జేఆర్ఎఫ్/ గేట్/ ఎన్‌బీ హెచ్ఎంలలో ఏదో ఒక పరీక్షలో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో
ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు : ఫిబ్రవరి 1, 2018 నుంచి మార్చి 26, 2018 వరకు.
దరఖాస్తు ఫీజు : జనరల్/ఓబీసీ రూ.800, ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూడీ అభ్యర్థులకు రూ.400; అన్ని కేటగిరీల ఈఆర్‌పీ అభ్యర్థులకు ఫీజు రూ.2000; డీఆర్‌డీవో, బార్క్, ఇస్రో, ఎన్‌పీఎల్, ఎన్‌టీఆర్‌వో, కెఎస్ఆర్‌టీసీ, బీఎంటీసీ, బీడీఏ, పీడబ్ల్యూడీ, సీపీఆర్ఐ స్పాన్సర్డ్ అభ్యర్థులకు ఫీజు రూ.800.
వెబ్‌సైట్ : http://www.iisc.ac.in/admission

అత్యున్నత పరిశోధనల కోసం.. పీఎంఆర్ఎఫ్

సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాల్లో అత్యున్నత పరిశోధనలు చేసే దిశగా దేశంలోని ప్రతిభావంతులను ఆకర్షించేందుకు ఉద్దేశించిన పథకం... ప్రైమ్ మినిస్టర్స్ రీసెర్చ్ ఫెలోషిప్ (పీఎంఆర్ఎఫ్). దీనిద్వారా 23 ఐఐటీలు/ ఐఐఎస్సీ, బెంగళూరులో పీహెచ్‌డీలోకి ప్రవేశం కల్పిస్తారు. మొదటి రెండేళ్లు నెలకు రూ.70 వేలు, మూడో సంవత్సరం నెలకు రూ.75,000, చివరి రెండేళ్లు నెలకు రూ.80 వేల ఫెలోషిప్‌ను కేంద్ర ప్రభుత్వం అందించనుంది. దీంతోపాటు ఎంపికైన ప్రతి ఒక్కరికి ఏడాదికి రూ.2 లక్షల రీసెర్చ్ గ్రాంట్ కూడా లభిస్తుంది. పీఎంఆర్ఎఫ్‌కు తాజాగా దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమయ్యాయి. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు..

అర్హులు :

ఐఐఎస్సీ, ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఎస్ఈఆర్‌లు, కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఐఐఐటీల్లో బీటెక్/ ఐదేళ్ల ఇంటెగ్రేటెడ్ ఎంటెక్/ ఐదేళ్ల ఇంటెగ్రేటెడ్ ఎంఎస్సీ/ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఐదేళ్ల అండర్ గ్రాడ్యుయేట్-పోస్ట్ గ్రాడ్యుయేట్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్స్ పూర్తిచేసిన అభ్యర్థులు, (లేదా) ఫైనలియర్ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
కనీసం 8 సీజీపీఏ పొంది ఉండటం తప్పనిసరి. డ్యూయల్ డిగ్రీ బీటెక్+ఎంటెక్ విషయంలో.. సీజీపీఏ వేర్వేరుగా ఇస్తే బీటెక్ సీజీపీఏను పరిగణనలోకి తీసుకుంటారు. డ్యూయల్ డిగ్రీ మొత్తానికి ఒకటే సీజీపీఏ ఇస్తే.. దాన్నే పరిశీలిస్తారు. బ్యాక్‌లాగ్స్ ఉన్న అభ్యర్థులకు అర్హత లేదు.
గత అయిదేళ్ల కాలంలో సంబంధిత అకడమిక్ కోర్సులు పూర్తి చేసి ఉండాలి. 2014లో లేదా ఆ తర్వాత సంబంధిత అర్హతలు పొందినవారు పీఎంఆర్ఎఫ్ 2018కు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు.
జేఈఈ/ యూసీఈఈడీ, కేవీపీవై, ఎన్‌సీబీల ద్వారా ఐఐఎస్సీ, ఐఐటీలు, ఐఐఎస్ఈఆర్‌ల్లో నాలుగేళ్ల బీఎస్ లేదా బీఎస్సీ లేదా బీడీఈఎస్ కోర్సులు పూర్తిచేసిన వారూ అర్హులే.

ఎంపిక విధానం కఠినం :

అత్యుత్తమ ప్రతిభావంతులను, నిజమైన ఆసక్తి కలిగిన వారిని ఎంపిక చేసేలా పీఎంఆర్ఎఫ్‌కు ఎంపిక ప్రక్రియ రెండు దశల్లో కఠినంగా ఉంటుంది. ఈ పథకం కింద 18 విభాగాల్లో పీహెచ్‌డీలోకి ప్రవేశం కల్పిస్తారు.
మొదట అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న సబ్జెక్టు, ఇన్‌స్టిట్యూట్లకు దరఖాస్తు చేసుకోవాలి. ఒకటి కంటే ఎక్కువ సబ్జెక్టుల ఆప్షన్స్ ఇస్తే ప్రాధాన్య క్రమాన్ని తెలపాలి.
దరఖాస్తులను పరిశీలించడానికి ప్రతి నోడల్ ఇన్‌స్టిట్యూట్‌లో నిపుణుల బృందం ఉంటుంది. దరఖాస్తులను మొదట స్క్రీనింగ్ చేస్తారు. ఆ తర్వాత సెలక్షన్ కమిటీ ప్రతి దరఖాస్తును పరిశీలిస్తుంది. వీరు దరఖాస్తులను పరిశీలించి రాత పరీక్ష/ ఇంటర్వ్యూలకు (ఏదైనా ఒకటి ఉండొచ్చు లేదా రెండూ నిర్వహించే అవకాశముంది) అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
తొలిదశలో ఎంపికైన విద్యార్థులు నోడల్ సంస్థలో జరిగే రాత పరీక్షలు లేదా ఇంటర్వ్యూలకు హాజరవ్వాలి. ఇందులో కనబర్చే ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను పీఎంఆర్ఎఫ్‌కు ఎంపిక చేస్తారు.

ఐదేళ్లకు రూ. 55 లక్షలు :

పీఎంఆర్ఎఫ్‌కు ఎంపికైన స్కాలర్‌కు ఐదేళ్లలో మొత్తంమీద రూ.55 లక్షలు అందుతాయి. మొదటి రెండేళ్లు నెలకు రూ.70 వేలు, మూడో ఏడాది నెలకు రూ.75 వేలు; నాలుగు, ఐదు సంవత్సరాల్లో నెలకు రూ.80 వేలు పొందుతారు. వీటితోపాటు రీసెర్చ్ గ్రాంట్ పేరిట ఏటా రూ.2 లక్షలు ఇస్తారు. బీటెక్‌తో నేరుగా పీఎంఆర్ఎఫ్‌కు ఎంపికైతే ఐదేళ్లు, ఇంటెగ్రేటెడ్ కోర్సుల నేపథ్యం ఉన్నవారికైతే నాలుగేళ్లపాటు ఫెలోషిప్ లభిస్తుంది. పీఎంఆర్ఎఫ్‌కు ఎంపికైన విద్యార్థులు ప్రతిష్టాత్మక ఐఐఎస్సీ లేదా దేశంలో ఉన్న 23 ఐఐటీల్లో పరిశోధనలు చేయొచ్చు.

18 విభాగాల్లో ప్రవేశాలు..

పీఎంఆర్ఎఫ్ కింద 18 విభాగాల్లో ప్రవేశాలు కల్పిస్తారు. అవి.. అగ్రికల్చర్ అండ్ ఫుడ్ టెక్నాలజీ, ఆర్కిటెక్చర్ అండ్ రీజనల్ ప్లానింగ్, బయలాజికల్ సైన్సెస్, బయోమెడికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఇంజనీరింగ్ డిజైన్, సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో ఇంటర్ డిసిప్లినరీ ప్రోగ్రాములు, మెటీరియల్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్, మెకానిక ల్ ఇంజనీరింగ్, మైనింగ్-మినరల్-కోల్- ఎనర్జీ సెక్టార్, ఓషియన్ ఇంజనీరింగ్ అండ్ నేవల్ ఆర్కిటెక్చర్, ఫిజిక్స్, టెక్స్‌టైల్ టెక్నాలజీ.
అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న పరిశోధన విభాగానికి సంబంధించి ప్రాజెక్టు అబ్‌స్ట్రాక్ట్‌ను పీఎంఆర్ఎఫ్ వెబ్‌సైట్లో సూచించిన విధంగా సమర్పించాలి. టెక్నాలజీ, సైన్స్‌కు సంబంధించి, జాతీయ ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని పరిశోధన అంశాన్ని ఎంపిక చేసుకోవాలి.
ప్రాజెక్టు ఎంపిక అనంతరం దానికి సంబంధించిన సారాంశాన్ని వెయ్యి పదాల్లో తెలియజేయాలి. ఆసక్తి ఉన్న విభాగం, పరిశోధన నైపుణ్యాలు, అనలిటికల్ స్కిల్స్, సబ్జెక్టు విషయ పరిజ్ఞానం ప్రస్ఫుటమయ్యేలా ఖచ్‌తీఖష్ రూపొందించాలి. అభ్యర్థుల వడపోతలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది.

విమర్శలు..

పీఎంఆర్ఎఫ్ పథకానికి ప్రఖ్యాత సంస్థల్లో విద్యనభ్యసించిన వారినే అర్హులుగా ప్రకటించడం విమర్శలకు దారితీస్తోంది. ఇతర విద్యా సంస్థల్లో పరిశోధనలు చేస్తున్న, గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన వారిలోనూ మెరికల్లాంటి విద్యార్థులు ఉంటారని.. వారిని పీఎంఆర్ఎఫ్‌కు అనుమతించకపోవడం సరికాదని కొందరు అభిప్రాయపడుతున్నారు. పెద్దమొత్తంలో ఫెలోషిప్స్, గ్రాంట్లు కేవలం కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న విద్యాసంస్థలకు మాత్రమే వర్తింపజేయడం వల్ల ఇతర కాలేజీల్లో చదువుతున్న ప్రతిభావంతులు నష్టపోయేందుకు ఆస్కారముందంటున్నారు. అదే విధంగా ఐఐఎస్సీ, ఐఐటీల్లో పీహెచ్‌డీకి మాత్రమే పీఎంఆర్ఎఫ్ ఇవ్వడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఉద్యోగావకాశాలు

ముఖ్య తేదీలు :
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ : మార్చి 31, 2018.
ఇంటర్వ్యూ తేదీలు : 2018, మే 15 నుంచి.
ఫలితాల విడుదల : 2018, జూన్ 1.
దరఖాస్తు రుసుం : రూ.1000
వెబ్‌సైట్ : https://pmrf.in

విశాలాంధ్ర బిజినెస్

-509.45 సెన్సెక్స్ 33,176.00	-165.00 నిఫ్టీ 10,195.15	-300 బంగారం (విజయవాడ) 28,850	బంగారం (విశాఖపట్నం) 29,000 ప్రొద్దుటూరు 29,920 22 క్యారట్లు, 10 గ్రాములు	-200 వెండి (విజయవాడ) 39,300 కిలో (రూపాయల్లో)	వెండి (విశాఖపట్నం) 41,400 ప్రొద్దుటూరు 41,723 కిలో (రూపాయల్లో)	డాలరు Vs రూపాయి 64.93

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
ఎం&ఎం	741.55	0.88
విప్రో	295.75	0.85
ఎస్-బ్యాంక్	312.90	0.16
హెచ్‌యువిఎల్	1,310.90	0.13

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
టాటా మోటార్స్	340.10	-3.67
టాటా మోటార్స్ (డి)	190.00	-3.21
ఏషియన్ పెయింట్స్	1,125.45	-3.06
అదానీపోర్ట్స్	382.00	-2.89
హీరో మోటార్‌కార్ప్	3,652.80	-2.67

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	64.93	64.93
యూరో	80.15	80.02
పౌండ్	90.50	90.72
ఆస్ట్రేలియా డాలర్	50.92	50.42
సింగపూర్ డాలర్	49.53	49.39

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	28,920	30,930
చెన్నై	28,950	30,962
బెంగళూరు	28,400	30,374
ముంబై	29,710	31,775
విజయవాడ	28,850	31,300
విశాఖపట్నం	29,000	31,020
ప్రొద్దుటూరు	29,920	30,370
ముడి చమురు		65.12

'సర్వశిక్ష' ఉద్యోగుల వెతలు

- ◆ 8ఏళ్ల నుంచి కాంట్రాక్టు పద్ధతిలో విధులు
- ◆ క్రమబద్ధీకరణలో ప్రభుత్వ నిర్లక్ష్యం
- ◆ 20వేల మంది భవిష్యత్తు ప్రశ్నార్థకం
- ◆ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం నిల్
- ◆ ఆందోళన బాటలో సిబ్బంది



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ సర్వశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ)లో పనిచేస్తున్న కాంట్రాక్టు/ ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పదేళ్ల నుంచి ఎస్ఎస్ఏ, దానికి అనుబంధ విభాగాలలో దాదాపు 20 ఏళ్ల మంది కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. ఎస్ఎస్ఏకు అనుబంధంగా 14 ముఖ్య విభాగాలున్నాయి. ఇందులో డీఎల్ఎంటీ(డివిజనల్ లెవెల్ మోనిటరింగ్), ఐఈఆర్టీ (ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ టీచర్స్), క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ (సీఆర్‌పీఎస్), పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్, కేజీబీవీ (కస్తూర్భా బాలికల విద్యాలయం) కీలకంగా ఉన్నాయి. ఎస్ఎస్ఏకు అనుబంధంగా ఉన్న డీఎల్ఎంటీ విభాగంలో రాష్ట్ర వ్యాప్తంగా డివిజన్‌కు ముగ్గురు చొప్పున అధికారులు పనిచేస్తున్నారు. ఈ పోస్టులకు పీజీ, ఎంఈడీలు చేసిన వారిని నియమించారు. ఐఈఆర్టీలో 2,600 మంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి మండల కేంద్రాల్లో ఉన్న భవిత సెంటర్లలో అంగవైకల్యం, ప్రత్యేక అవసరాలగల విద్యార్థులకు వారు విద్యను బోధిస్తారు. వారంతా గ్రాడ్యుయేట్‌తోపాటు స్పెషల్ ఎడ్యుకేషన్‌లో బీఈడీ చదివి ఈ ఉద్యోగాల్లో చేశారు. సీఆర్‌పీఎస్ విభాగాలలో రాష్ట్ర వ్యాప్తంగా 4,600 మంది పనిచేస్తున్నారు. బడి మానేసిన పిల్లల్ని తిరిగి బడిలో చేర్పించడం, మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షణ తదితర అంశాల్ని క్లస్టర్లు చూస్తారు. పార్టు టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు 5,200 మంది పనిచేస్తున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఆర్ట్, క్రాఫ్ట్ విభాగాలకు కాంట్రాక్టు పద్ధతిలో క్లస్టర్లు విధులు నిర్వహిస్తున్నారు.

ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలి

ఎస్ఎస్ఏలో సుదీర్ఘకాలం నుంచి వివిధ విభాగాల్లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న సిబ్బంది ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం లేనందున తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రతిఏటా రెన్యువల్ పేరుతో పాత సిబ్బంది ఉద్యోగాలను తొలగించడం బాధాకరం. సీనియార్టీ ప్రాతిపదికన ఉద్యోగాల్ని క్రమబద్ధీకరించాలి. తమ న్యాయమైన డిమాండ్లు సాధించేంత వరకూ ఉద్యమిస్తాం.

-కె.విజయ్,
ఏపీ సర్వశిక్ష అభియాన్-కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఏఎస్ఏలో అతి ముఖ్యమైన విభాగం కేజీబీవీ. ఎస్సీ,ఎస్టీ విద్యార్థినులు, అనాధ పిల్లలకు పూర్తిస్థాయిలో విద్యను అందించడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఎస్ఎస్ఏ కార్యకలాపాల్లో ఇది సింహభాగంగా నిలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 358 కేజీబీవీ పాఠశాలలున్నాయి. ప్రతి పాఠశాలలో కాంట్రాక్టు పద్ధతిన 23 మంది టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ దాదాపు ఎనిమిదేళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రతి పాఠశాలకూ సైన్స్, మ్యాథ్స్, ఇంగ్లీషుతోపాటు మిగిలిన సబ్జెక్టులకు కలిపి ఏడుగురు టీచర్ల చొప్పున ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో తాము సమానంగా పనిచేస్తున్నప్పటికీ, ఉద్యోగాల్ని క్రమబద్ధీకరించట్లేదని ఎస్ఎస్ఏ కాంట్రాక్టు సిబ్బంది వాపోతున్నారు.

పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలేవి?

ఎస్ఎస్ఏలోని వివిధ విభాగాల్లో దీర్ఘకాలం నుంచి పని చేస్తున్న వారికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అనారోగ్యంతో మరణించిన సిబ్బంది కుటుంబం వీధుల పాలవుతోంది. ప్రతి ఏటా రాజకీయ నాయకుల జోక్యంతో పాత సిబ్బందిని మార్పుచేసి వారి స్థానంలో కొత్తవారిని నియమిస్తున్నారు. దీంతో సీనియర్లు ఉద్యోగాల్ని కోల్పోవాల్సిన దుస్థితి నెలకొంది. ఎస్ఎస్ఏలో రాజకీయ నేతల జోక్యంపై సర్వత్రా విమర్శలు నెలకొన్నాయి.

నష్టాల్లో మార్కెట్లు

510 పాయింట్ల కోల్పోయిన సెన్సెక్స్

10,200 దిగువన నిఫ్టీ



ముంబై: దేశ రాజకీయాల వేడి స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపింది. వరుసగా మూడవరోజు శుక్రవారం దేశీయ మార్కెట్లు నష్టాల్లో నమోదై మూడు నెలల కనిష్టానికి దిగజారాయి. మొత్తంమీద ఈ వారం అంతా మార్కెట్లు నష్టాల్లోనే నమోదయ్యాయి. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంతో తెదేపా తెగదెంపులు చేసుకున్న విషయంతో అంతర్జాతీయ మార్కెట్ల బలహీన సంకేతాలతో మార్కెట్లు ఆరంభం నుంచే నష్టాల్లో నమోదవుతున్న సూచీలు.. రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మరింత భారీ నష్టాల్లో ముగిసాయి. సెన్సెక్స్ 510 పాయింట్ల నష్టంతో 1.51శాతంతో 33,176 పాయింట్లు నమోదుచేయగా, నిఫ్టీ 165పాయింట్ల నష్టంతో 1.59శాతంతో 10,195.15 వద్ద ముగిసింది. ఒక దశంలో 550 పాయింట్లు కోల్పోయి మరింత కనిష్టానికి పడిపోయింది. బిఎస్ఇ సెక్టరల్ సూచీలన్నీ మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్, ఎనర్జీ మరింత నష్టాల్లో నమోదయ్యాయి. బిఎస్ఇ మిడ్‌కాప్ 1.07శాతం, స్మాల్‌కాప్ 1శాతం దిగజారింది. ఎమ్ అండ్ ఎమ్, విప్రో, హిందుస్తాన్ లీవర్, యస్ బ్యాంకు ప్రధాన లబ్దిదారులుగా నమోదయ్యారు. టాటా మోటార్స్, ఆసియన్ పెయింట్స్, అదానీ పోర్ట్స్, హీరో మోటాకార్ప్ నష్టాలు మూటగట్టుకున్నాయి. ఒక్కో కంపెనీ షేరు విలువ 3 నుంచి 4శాతానికి పైగా పతనమైంది. దాదాపు అన్ని రంగాల షేర్లు నష్టాల్లోనే ముగిశాయి. 30షేర్ల సెన్సెక్స్ బారోమీటర్ 565.62 పాయింట్లతో 33,119.92 పాయింట్లు నష్టపోయింది. బ్లుచిప్ కంపెనీలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటిసి, హెచ్‌డిఎఫ్‌సి నష్టపోగా టాటా మోటార్స్ 3.67శాతం, టాటాస్టీల్ 1.78 శాతం, ఓఎన్‌జిసి 2.26శాతం, హెచ్‌డిఎఫ్‌సి 2.15శాతం, సన్‌ఫార్మా 2.63 శాతం, ఎన్‌టిపిసి 2.65శాతం, ఆదానీ పోర్ట్సు 2.89శాతం రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.29 శాతం, ఐటిసి 1.85శాతం, డాక్టర్ రెడ్డీస్ 2.07శాతం, ఆసియన్ పెయింట్స్ 3.09 శాతం, కొటక్ మహీంద్రా బ్యాకు 2.58 శాతం హీరో మోటాకార్ప్ 2.67 శాతం,టిసిఎస్ 1.52శాతం నష్టపోయాయి. ఈక్విటీ మార్కెట్ 9.19శాతం నష్టపోయింది.పిఎస్‌యుబ్యాంకింగ్ రంగం ఈ ట్రేడింగ్‌లో తీవ్రంగానష్ట పోయింది.

ఆసియా మార్కెట్లు: శుక్రవారం ఆసియా మార్కెట్లు మిశ్రమ ఫలితాల్లో నమోదయ్యాయి. అమెరికా మార్కెట్ స్టీల్ అండ్ అల్యూమినియం దిగుమతులపై దిగుమతి సుంకం పెంచడంతో మదుపరులు తీవ్ర అప్రమత్తతపాటిస్తున్నట్లు తెలుస్తోంది. జపాన్‌నిక్కీ 225 0.6శాతంతో 21,676 పాయింట్లు, హాంగ్‌కాంగ్ హేంగ్‌శాంగ్ 0.4శాతంతో 31,408పాయింట్లు, షాంఘై కాంపోజిట్ 0.6శాతంతో 3272 పాయింట్లు, నష్టాల్లో నమోదుకాగా, సౌత్ కొరియా కాస్పి కొద్దిగా మెరుగై 0.1 శాతంతో 2493 వద్ద నిలిచింది. అమెరికా మార్కెట్లు వరుసగా నాలుగవ సెషన్‌లో ప్రతికూలంగానే ముగిసాయి. డౌ జోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ 115.54 పాయింట్ల నష్టంతో 0.47శాతం 24,876 పాయింట్లు నమోదుచేయగా ఎస్అండ్‌పి 500 2.15 పాయింట్ల నష్టంతో 0.08 శాతంతో 2747.33 పాయింట్లు, నాస్డాక్ కాంపోజిట్ 15.07పాయింట్ల నష్టంతో 0.2శాతంతో 7481పాయింట్లు నమోదుచేసింది.

మార్కెట్లో జాగ్వార్ ఎక్స్ఈ, ఎక్స్ఎఫ్...!



విజయవాడ: జాగ్వార్ ల్యాండ్ రోవర్ ఇండియా జాగ్వార్ ఎక్స్ఈ, ఎక్స్ ఎఫ్‌ను మార్కెట్‌కు పరిచయం చేసింది. తేలిక, సమర్థవంత అల్-అల్యూమినియం ఇంజెనియమ్ పెట్రోల్ పైరేన్. కొత్త 2.0 (లీటరు) ఇంజెనియం 147 కేడబ్ల్యూ మరియు 184 కేడబ్ల్యూ ఉద్గాతాలు రెండింటి లోనూ పెట్రోల్ మోటార్ను అందిస్తుంది. దీనిని 8-స్పీడ్ ఎలక్ట్రానిక్‌తో జత చేశారు. ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ విత్ జాగ్వార్ సీక్వెన్షియల్ షిఫ్ట్ టిమ్, ఆల్ సర్ఫేస్ ప్రోగ్రెస్ కంట్రోల్. జాగ్వార్ ఎక్స్ఈ ధర రూ. 35.99 లక్షల నుంచి మొదలవుతుంది, జాగ్వార్ ఎక్స్ఎఫ్ ధర రూ. 49.80 లక్షలు. ఇంజినియం పెట్రోల్ ఇంజిన్లు జాగ్వార్ ల్యాండ్ రోవర్ యొక్క స్వల్ప ఘర్షణ అన్ని అల్యూమినియం-ఇంటెన్సివ్ డిజైన్లను మెరుగైన ఉష్ణ లక్షణాలు, మెరుగైన సామర్థ్యం కోసం తేలికపాటి నిర్మాణాన్ని అందిస్తాయి. కొత్త పెట్రోల్ యూనిట్లు లాగ్ తగ్గించడానికి జంట స్క్రోల్ టర్బోలును విస్తరింపచేస్తాయి. నిరంతరంగా వేరియబుల్ వాల్వ్ లిఫ్ట్ టెక్నాలజీ గాలి ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఈ పేటెంట్ టెక్నాలజీ కోసం ఇన్‌క్లేవ్ వాల్వ్ లిఫ్ట్ యొక్క పూర్తిగా వేరియబుల్ నియంత్రణను అందిస్తుంది రివ్ శ్రేణి అంతటా వాంఛనీయ సామర్థ్యం, శక్తి, టార్క్ కలవు. "జాగ్వార్ ఎక్స్ఈ, ఎక్స్ఎఫ్ భారతదేశంలో అద్భుతమైన సామర్ధ్యాన్ని ప్రదర్శించాయి.

సమర్థవంతమైన ఇంజనీయం పెట్రోల్ పైరేన్ అవార్డు గెలుచుకున్న సెడాన్లలో కలవు. ఈ రెండు కార్లు అందించే థ్రిల్లింగ్ డ్రైవ్, ఆనంద కరమైన అనుభవం మేము కస్టమర్లకు అందిస్తాము అని జాగ్వార్ ల్యాండ్ రోవర్ ఇండియా అధ్యక్షుడు, మేనేజింగ్ డైరెక్టర్ రోహిత్ సూరి తెలిపారు.




మార్కెట్లోకి హోండా యాక్టివా 5జీ

న్యూఢిల్లీ: దేశీయ ద్విచక్ర వాహన తయారీ దిగ్గజం హోండా మోటార్ సైకిల్స్ అండ్ హోండా స్కూటర్స్ ఇండియా కొత్త స్కూటర్‌ను లాంచ్ చేసింది. యాక్టివా వారసత్వాన్ని కొనసాగిస్తూ, హోండా యాక్టివాను సరికొత్తగా విడుదల చేసింది. ఆటో ఎక్స్‌పో-2018లో ప్రారంభించిన యాక్టివా 5జీని కొత్తగా అప్‌గ్రేడ్ చేసి మార్కెట్లో ప్రవేశపెట్టింది. దీని ప్రామాణిక మోడల్ ధర రూ. 52,460 (ఎక్స్-షోరూమ్, ఢిల్లీ)గా నిర్ణయించింది. డీలక్స్ వెర్షన్ ధర రూ. 54,325 (ఎక్స్-షోరూమ్,ఢిల్లీ)గా ఉంది. స్కూటర్ల కోసం బుకింగ్స్ ప్రారంభమయ్యాయనీ, డెలివరీలు వెంటనే ప్రారంభించాలని నిర్ణయించినట్లు హోండా ఒక ప్రకటనలో తెలిపింది.

ఎన్నికల బాండ్లు విక్రయం రూ.222కోట్లు



న్యూఢిల్లీ:రూ.222కోట్ల విలువైన ఎన్నికల బాండ్లను అమ్మినట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పి.రాధాకృష్ణన్ శుక్ర వారం లోక్‌సభకు తెలియజేశారు. రాజకీయ పార్టీలకు వచ్చే విరాళాల ప్రక్రియను పారదర్శకంగా చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఎన్నికల బాండ్ల విధానాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. మార్చి ఒకటో తేదీ నుంచి పదో తేదీ వరకు ఈ ఎన్నికల బాండ్ల విక్రయాలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ చేపట్టింది. మార్చి 9, 2018 వరకు తొలి విడత అమ్మకాల్లో భాగంగా రూ.222కోట్ల ఎన్నికల బాండ్ల విక్రయాలు జరిగాయని మంత్రి రాధా కృష్ణన్ లోక్‌సభలో ఓ ప్రశ్నకు రాతపూర్వక సమాధానం ఇచ్చారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖల్లోనే వీటి విక్రయాలు జరిపినట్లు మంత్రి పేర్కొన్నారు. బాండ్లు జారీ చేసిన తేదీ నుంచి 15 రోజుల వరకు మాత్రమే ఇవి చెల్లుబాటు అవుతాయని ఆయన తెలిపారు. భారత్‌లో పౌరుడిగా ఉన్న వ్యక్తి లేదా సంస్థ ఈ బాండ్లను కొనుగోలు చేయవచ్చు. గత లోక్‌సభ లేదా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఒక శాతానికి తక్కువ కాకుండా ఓట్లు సాధించిన గుర్తింపుపొందిన రాజకీయ పార్టీలకు మాత్రమే ఈ బాండ్లను అందుకోవడానికి అర్హత ఉంటుంది. బ్యాంకు ఖాతాద్వారా మాత్రమే సదరు పార్టీ ఈ బాండును నగదుగా మార్చుకోవాలని ఆయన లోక్‌సభకు వెల్లడించారు. జనవరి, ఏప్రిల్, జులై, అక్టోబర్ నెలల్లో పది రోజుల పాటు ఈ బాండ్ల విక్రయాలు జరుపుతామని ఆయన తెలి పారు. బాండ్లను కొనుగోలు చేసే వ్యక్తులు బ్యాంకుల వద్ద తప్పనిసరిగా కైవీసీ పత్రాలను పూర్తి చేయాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



భారత్‌లో ట్రెక్ బైస్కిల్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ప్రపంచంలోనే అగ్రగామి సైకిల్ బ్రాండ్‌గా పేరొందని ట్రెక్ బైస్కిల్ తాజాగా భారతీయ మార్కెట్‌లోకి కాలుమోపింది. రోడ్లు, పర్వతాలు మొదలైన వాటిపై ప్రయాణించేందుకు అనువైన బైస్కిల్ శ్రేణిని ఆవిష్కరించింది. ఈ నూతన సైకిళ్లను ట్రెక్ ఇండియా కంట్రీ మేనేజర్, జర్మన్ ప్రొఫెషినల్ రోడ్ బైస్కిల్ రేసర్ జెన్స్ వైజెట్ ఆవిష్కరించారు. యుఎస్ఎలోని విస్కాన్సిన్‌లో గల వాటర్ లూలో 1976లో ఈ ట్రెక్ బైస్కిల్ సంస్థను స్థాపించారు. సంస్థ అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం 100 దేశాలకు తన వ్యాపారాన్ని విస్తరించిందని ట్రెక్ బైస్కిల్ మేనేజర్ జర నవనీత్ బంకా తెలిపారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక సహకారంతో ట్రెక్ సైకిళ్లను రూపొందించామన్నారు.

పాతదిచ్చి కొత్తది తీసుకో..

ముంబై : షావోమి 2017 నవంబర్‌లో ప్రారంభించిన ట్రేడ్ ఇన్ కార్యక్రమాన్ని ఇక మీదట తన వెబ్‌సైట్ ఎంఐ.కామ్‌లో కూడా అందుబాటులోకి తెస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా షావోమి తన వినియోగదారులకు ఇన్‌స్టాంట్ ఎక్స్ఛేంజ్ కూపన్లను అందిస్తోంది. ఈ కూపన్లతో వినియోగదారులు పాత స్మార్ట్ ఫోన్లను ఇచ్చి, కొత్త ఫోన్లను తీసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు ప్రకటించింది. కాషీఫై భాగస్వామ్యంతో ప్రారంభించి ఈ కార్యక్రమాన్ని తొలుత అన్ని షావోమీ స్టోర్లలో అందుబాటులోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం స్టోర్లకే పరిమితమైన ఈ ఎక్స్ఛేంజ్ ఆఫర్‌ని షావోమి తన వెబ్‌సైట్ ఎంఐ.కామ్‌లోకి కూడా విస్తరించింది. ఎంఐ ఎక్స్ఛేంజ్ ఆఫర్‌ను పొందడానికి, ఎంఐ.కామ్‌లో దానికి కేటాయించిన ప్రత్యేక పేజీలోకి వెళ్లాలి. అక్కడ ఎక్స్ఛేంజ్ చేయాలనుకున్న స్మార్ట్‌ఫోన్‌ను ఎంపిక చేసుకోవాలి. షావోమి మీ ఫోన్ కండీషన్, ప్రస్తుతం మార్కెట్లో దాని విలువను బట్టి మీకు ఉత్తమ ఎక్స్ఛేంజ్ ధరను సూచిస్తుంది. ఒకవేళ మీకు ఎక్స్ఛేంజ్ ధర నచ్చితే మీ ఫోన్ ఐఎమ్ఈఐ నంబర్ సహాయంతో ఎక్స్ఛేంజ్ వాల్యూ కూపన్ని పొందవచ్చు. ఈ నగదు మీ ఎమ్ఐ అకౌంట్‌కి జమ అవుతుంది. ఆ ఎక్స్ఛేంజ్ కూపన్ సహాయంతో మీరు మీకు నచ్చిన కొత్త షావోమి ఫోన్‌ను తీసుకోవచ్చు. ఎక్స్ఛేంజ్‌లో ఫోన్ కొనాలంటే కచ్చితంగా మీ పాత ఫోన్ పనిచేస్తూ ఉండి, ఎటువంటి ఫిజికల్ డ్యామేజ్ లేకుండా ఉండాలనే నిబంధనను పెట్టింది కంపెనీ. మీ పాత ఫోన్ స్క్రీన్‌లాక్‌ను తీసేసి, మిగతా సీక్రెట్ లాక్స్ ఏమైనా ఉంటే వాటిని కూడా అన్‌లాక్ చేసి ఇవ్వాలని పేర్కొంది. షావోమి లిస్ట్‌లో ఉన్న ఫోన్లకే ఈ ఎక్స్ఛేంజ్ ఆఫర్ వర్తిస్తుంది. వినియోగదారుడు ఒక్కసారి ఒక్క ఫోన్‌ను మాత్రమే ఎక్స్ఛేంజ్ చేసుకునే అవకాశం ఉంది. ఎక్స్ఛేంజ్ కూపన్ వాలిడిటీ కేవలం 14 రోజులు మాత్రమే. ఈ ఆఫర్ కేవలం స్మార్ట్‌ఫోన్లకే వర్తిస్తుందని కంపెనీ తెలిపింది.

విజ్ఞానం

అరుదైన ఉభయచర జీవి పాలు



ఆస్ట్రేలియాకు చెందిన ప్లాటిపస్ అనే జీవి పాలలో అద్భుతమైన రోగనిరోధక శక్తి ఉన్నట్లు శాస్త్రజ్ఞుల పరిశోధనలో వెల్లడైంది. చూసేందుకు బాతు ముక్కు, ఎలకతోకతో విచిత్రంగా ఉండే ఈ జీవి బచ్చుతో కూడిన ఉభయచరజీవిగా చెప్పవచ్చు. దీని పాలలో ఉండే ప్రత్యేకమైన మాంస కృత్తులకు రోగకార బాక్టీరియాను నశింపచేసే శక్తిఉన్నట్లుగా 2010 లోనే నిపుణులుగుర్తించారు. కానీ ఇప్పటివరకు పరిశోధన చేసి ఇప్పుడు ధృవపరచినట్లు తెలుస్తోంది. ప్లాటిపస్ అనే ఈ జీవి మమేలియన్ గ్రూపుకుచెందింది. ఇది గుడ్లుపెట్టి, పొదిగి పిల్లల్ని చేస్తుంది. వీటి పాలలో ఉండే ప్రోటీన్ నిర్మాణ తీరు చాలా విభిన్నంగా ఉంటుంది. అరుదైన గుణాత్మక స్వభావం ఉన్న వీటి పాలలో ఇతర జీవులనుండి రక్షించుకునేందుకు తోడ్పడుతాయని డీకన్‌యూనివర్సిటీలో అధ్యయనం చేస్తున్న జూలీ వెల్లడించారు.

రాకెట్ సాంకేతికతతో కృత్రిమ గుండె



రాకెట్ సాంకేతిక నిర్మాణాన్ని వినియోగించి చైనా శాస్త్ర వేత్తలు కృత్రిమ గుండెను రూపొందించారు. జంతువులపై చేపట్టిన ప్రయోగంలో భాగంగా, ఆరు గొర్రెలలో ఈ గుండెను అమర్చి అవన్నీ ఆరోగ్యంగానే జీవనం సాగిస్తున్నట్లు చైనా ఎకాడమీ ఆఫ్ లాంచ్ వెహికల్ టెక్నాలజీ, టెడా ఇంటర్నేషనల్ కార్డియోవాస్కులార్ హాస్పిటల్ చేపట్టిన సంయుక్త ప్రయోగంలో వెల్లడైంది. రాకెట్ సర్వో సిస్టమ్‌ను ఆధారంగాచేసుకుని ఈ కృత్రిమ గుండెను చేసారు. వీరి సూచనల మేరకు ద్రవ-వాయువులను నియంత్రించే అయస్కాంత కృత్రిమ గుండెను చేయడమైంది. 2020నాటికల్లా ఇది రోగులకు అందుబాటులోకి రావచ్చునని తెలుస్తోంది. ఈ విధానంతో రక్త ప్రసరణకు ఎటువంటి అవరోధక కలగచేయకుడా రక్తాన్ని ఇతర ప్రాంతాలలకు చేరవేయగలదని తెలుస్తోంది.



బిగ్ సిలో శాంసంగ్ ఎస్9, ఎస్9+

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: బిగ్ సి ద్వారా శాంసంగ్ ఎస్9, ఎస్9+ మొబైల్స్‌ను తెలుగు రాష్ట్రాల మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. కూకట్‌పల్లి బాలాజీ నగర్ బిగ్ సి షోరూమ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో సంస్థ ఫౌండర్, సీఎండీ ఎం.బాలుచౌదరి, సినీతార సమంత, శాంసంగ్ సంస్థ ప్రతినిధి ఉదయ్ భట్‌లు ఈ మొబైల్స్‌ను విడుదల చేశారు. బాలు మాట్లాడుతూ శాంసంగ్ ప్రతిష్టాత్మక మొబైల్స్ ఎస్9, ఎస్9+లు ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఒక్క తమ బిగ్ సి ద్వారానే మార్కెట్లోకి విడుదలయ్యాయన్నారు. ఈ మొబైల్ కొనుగోలుపై హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, పెటిఎం మాల్ ద్వారా రూ.6000 క్యాష్ బ్యాక్ అందిస్తున్నట్లు, ఇఎంఐ పద్ధతిలో కూడా కొనుగోలు చేయవచ్చని తెలిపారు. కారియర్ అగ్రిగేషన్‌తో గాలక్సీ ఎస్9, ఎస్9+ 2.5 రెట్లు వేగంగా స్ట్రీమ్ చేయగలవని, అత్యుత్తమైన కెమేరా, సూపర్ స్లో-ఎంఐ సామర్థ్యంతో స్మార్ట్‌ఫోన్లపై ఎన్నడూలేని ఫీచర్లతో లభిస్తున్నాయి. ఎస్9, ఎస్9+లు 64 జిబి రూ.57,900, 64,900, 245 జిబి రూ.65,900, 72,900లకు లభిస్తున్నాయి.

క్లబ్ వన్ ఎయిర్ చేతికి మరో

ఫాల్కన్-2000 విమానం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: కార్పొరేట్ వర్గాలకు ఛార్టర్ ఫ్లైట్ ఆపరేటర్‌గా పేరుగాంచిన క్లబ్‌వన్ ఎయిర్ ఏవియేషన్ కంపెనీ మరో ఫాల్కన్ 2000 ఎయిర్ క్రాఫ్ట్ సమకూర్చుకోనుంది. ఫ్రాన్స్‌కు చెందిన డస్సాల్ట్ ఫ్యాల్కన్ బిజినెస్ తరగతికి చెందిన జెట్ విమానం కార్పొరేట్ వర్గానికి, ప్రత్యేక ప్రయాణాలు చేసే గ్రూపులకు సేవలందిస్తుంది. డస్సాల్ట్ సంస్థకు చెందిన ఫాల్కన్ విమానాల పనితీరు, కార్యాచరణ, ఖర్చు సామర్థ్యాన్ని పరిగణలోకి తీసుకుని కొత్త విమానాన్ని ఆ సంస్థ నుంచి కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు క్లబ్ వన్ ఎయిర్ సిఇఒ రాజన్ మెహ్రా తెలిపారు. ప్రస్తుతం క్లబ్‌వన్ ఎయిర్ సంస్థకు 10 ఆధునిక జెట్ విమానాలు ఉండగా, ఇందులో నాలుగు ఫాల్కన్ 2000లు ఉన్నాయని తెలిపారు.

ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో

శ్రీచైతన్యకు స్థానం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించారు. 3ఏళ్ల నుంచి 5 ఏళ్లలోపు ఉన్న 100 మందికి పైగా విద్యార్థులు ఒకే స్కూలుకు చెందిన వారు కావడం విశేషం. ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ జడ్జీల సమక్షంలో ఈ పోటీలు చెన్నైతో పాటు బెంగుళూరులోని శ్రీచైతన్య స్కూల్ క్యాంపస్‌లో జరిగాయి. జడ్జి రాజేందర్ లూత్రా మాట్లాడుతూ ఇంతటి ప్రతిభావంతులైన చిన్నారులకు తమ బుక్‌లో స్థానం కల్పించడం గౌరవంగా భావిస్తున్నామన్నారు. శ్రీచైతన్య స్కూల్ ఆకడమిక్ డైరెక్టర్ సీమ మాట్లాడతూ చిన్న వయస్సులోనే ఇంతటి ఘనతకు శ్రీచైతన్య స్కూల్-స్టార్ మేవరిక్స్ ఎర్లీ ఎడ్యుకేషన్ ప్రోగ్రామే కారణమన్నారు. ఈ ప్రోగ్రామ్‌ను కర్ణాటక, తమిళనాడులోనే కాక తెలుగు రాష్ట్రాల్లోని శ్రీచైతన్య స్కూల్-టెక్నో కరిక్యులమ్ బ్రాంచీలలోనూ ఈ విద్యాసంవత్సరం నుండే ప్రారంభించినట్టు తెలిపారు. చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు, సిబ్బందికి విద్యాసంస్థల చైర్మన్ డా.బిఎస్.రావు అభినందించారు.

'యాక్టివ్ అస్యూర్' పేరిట ఆదిత్య బిర్లా కొత్త బీమా

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: కనీస వయసు 5 ఏళ్ల నుంచి తీసుకునేందుకు వీలైన కొత్త భీమా పాలసీ యాక్టివ్ అస్యూర్‌ను విడుదల చేసినట్లు ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్స్యూరెన్స్ వెల్లడించింది. ఈ పాలసీలో భాగంగా ఇద్దరు పెద్దవారు, నలుగురు చిన్నరులకు భీమా వర్తిస్తుందని సంస్థ సీఈఓ మయాంక్ భత్వాల్ తెలిపారు. ఒక సింగల్ పాలసీలో 25 సంవత్సరాల వయసున్నవారిని కూడా చిన్నరులుగా పరిగణిస్తామన్నారు. రూ.10 లక్షల పాలసీపై 150 శాతంగా రూ.5 లక్షల రీలోడ్ లభిస్తుందని, 586 రకాల డేకేర్ చికిత్సల నుంచి రక్షణ కల్పిస్తుందని తెలిపారు.



ఇంట్లోనే మొబైల్ నంబరును

ఆధార్‌తో లింక్ చేయండి

ఇప్పటి వరకు మొబైల్ నంబర్‌ని ఆధార్‌కి లింక్ చేయడానికి, మీరు మీ సమీప దుకాణానికి వెళ్లి గంటలు వేచి ఉండాల్సి వచ్చింది. ఇప్పుడు UIDAI ఈ ప్రక్రియను మరింత సులభతరం చేసింది. కింద ఇచ్చిన సూచనలను అనుసరించడం ద్వారా సులభంగా మీ నంబర్‌ను లింక్ చేయవచ్చు.

స్టెప్ 1 : మీ మొబైల్ నుండి 14546 కి డయల్ చేసి IVR కోసం వేచి ఉండండి.

స్టెప్ 2 : కాల్ కనెక్ట్ అయిన తర్వాత, ఇచ్చిన సూచనలకు జాగ్రత్తగా వినండి. వాటిని అనుసరించండి. మీరు ఇండియన్ అయితే, ప్రెస్ 1 లేకపోతే విదేశీయుడితే 2 నొక్కండి.

స్టెప్ 3 : ఇప్పుడు మీ 12 అంకెల ఆధార్ నెంబర్‌ను నమోదు చేయండి. ధృవీకరణ కోసం, ఇది తిరిగి నమోదు చేయాలి.

స్టెప్ 4 : నిర్ధారణకు ప్రెస్ 1, మీరు తప్పు చేసినట్లయితే 2 నొక్కండి.

స్టెప్ 5 : ఇప్పుడు మీ నెంబర్‌పై 6 అంకెల OTP వస్తుంది. ఈ సమయంలో, టెలికాం ఆపరేటర్ మీ పేరు, ఫొటో పుట్టిన తేదీని వాయిస్ మెసేజ్ పంచుకోవడానికి అనుమతిని కోరుతుంది.

స్టెప్ 6 : ఇప్పుడు మెసేజ్‌లో అందుకున్న 6 అంకెల OTP ని ఎంటర్ చెయ్యండి.

స్టెప్ 7 : మీ మొబైల్ నంబర్ తదుపరి 48 గంటల్లో లింక్ అవుతుంది.



గుండె గుట్టు చెబుతుంది

చదువుకునే రోజుల్లో చేతి పిడికిలి బిగించి గుండె ఇలా ఉంటుంది... ఇలా కొట్టుకుంటుంది అని చూపించేవారు. అంతకుమించి గుండె సంగతులు ఏవీ మనకు తెలిసేవి కావు. కానీ మీ మొబైల్‌లో bodyxq heart యాప్ ఉంటే గుండె పని చేసే విధానాన్ని త్రీడీలో చూడొచ్చు. నడిచినప్పుడు ఏ భాగం ఎలా పని చేస్తుంది, ధమనులు, సిరలు ఎలా స్పందిస్తాయి లాంటి వివరాలూ తెలుస్తాయి. దీంతోపాటు గుండె సంబంధిత జబ్బులు వచ్చినప్పుడు దాని పనితనంలో ఎలాంటి మార్పులొస్తాయనే విషయమూ దీని ద్వారా తెలుసుకోవచ్చు.

* https://goo.gl/argIYy

మొబైలే... కంప్యూటర్‌లా

స్మార్ట్‌ఫోన్ తెర, ఆప్ ఐకాన్లు లాంటివాటిలో మార్పులు తీసుకొచ్చే లాంచర్లు చాలా ఉన్నాయి. అయితే మొబైల్‌ను ఏకంగా కంప్యూటర్‌లా మార్చేవి మాత్రం కొన్నే ఉన్నాయి. వాటిలో Leena Desktop UI ఒకటి. దీన్ని మీ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకుంటే స్క్రీన్ కంప్యూటర్ తరహాలో కనపిస్తుంది. మెనూ బార్ కనిపించే విధానం నుంచి, ఆప్ ఐకాన్‌లు వరకు అన్నీ మారిపోతాయి. ఒకేసారి స్క్రీన్ మీద ఒకటికిమించి యాప్‌ను ఓపెన్ చేసుకోవచ్చు.

* https://goo.gl/BF3xyk



కలిపేయ్... విడదీసేయ్

పాట నుంచి ఓ భాగాన్ని కత్తిరించాలంటే ఒక ఆప్... రెండు పాటల్ని కలపాలంటే ఇంకో యాప్... వీడియోను ఆడియోగా కన్వర్ట్ చేయాలంటే మరొక యాప్... ఇలా ఒక్కోదాని కోసం ఒక్కో యాప్ డౌన్‌లోడ్ చేసుకునేదాని కన్నా అన్నింటికీ ఒకే యాప్ ఉంటే బాగుంటుంది కదా. Timbre: Cut, Join, Convert mp 3 అలాంటిదే. ఈ యాప్‌తో ఎంపీ3 పాటను జాయిన్, కట్, కన్వర్ట్, స్ప్లిట్ చేసుకోవచ్చు. వీడియోలను కూడా ఇలా ఎడిట్ చేసుకోవచ్చు. దీంతోపాటు వీడియోల నుంచి ఫ్రేమ్స్‌ను ఎక్స్‌ట్రాక్ట్ చేసుకోవచ్చు. వీడియో ప్లే అయ్యే వేగాన్ని కావల్సినట్లు మార్చుకోవచ్చు.

* https:///goo.gl/gohJce



మెరుగులు కొత్తగా..

ఫొటోలకు బేసిక్ ఎడిటింగ్ చేసి, ఫిల్టర్లు అద్ది, ఎమోజీలు జోడించడం ఎప్పటినుంచో చేస్తున్నదే. కాస్త ఏదైనా కొత్తగా ప్రయత్నిద్దాం అనుకుంటున్నారా? అయితే Framy ఆప్ ఒకసారి వాడి చూడండి. లైవ్ ఇమేజెస్ దీని ప్రత్యేకత. దీని కెమెరాతో ఫొటోను క్లిక్ చేసి... నీటి ప్రవాహం, జలపాతం, జంతువులు లాంటి లైవ్ ఇమేజెస్‌ను జోడించొచ్చు. ఆ తర్వాత వాటిని అదే ఆప్‌లో షేర్ చేసుకోవచ్చు. లేదంటే డౌన్‌లోడ్ చేసుకొని సోషల్ నెట్‌వర్కింగ్ సైట్స్‌లో పోస్ట్ చేసుకోవచ్చు.

* https:///goo.gl/LU8VTS



అన్నీ ఒకే దగ్గర



స్నేహితులతో ముచ్చట్ల కోసం ఛాటింగ్ యాప్స్, సమాచార శోధన కోసం సెర్చ్ ఇంజిన్, సినిమా వీడియోల కోసం స్ట్రీమింగ్ యాప్స్, హోటళ్ల వివరాల కోసం ఇంకో రకం యాప్... ఇలా మీ మొబైల్‌లో చాలా యాప్స్ ఉండుంటాయి. వీటన్నింటిని ఒకే యాప్‌లో అందిస్తే చాలా బాగుంటుంది కదా. ఆ యాప్ పేరే Flochat సాధారణ మెసెంజర్ ఆప్స్‌లా దీన్ని ఇన్‌స్టాల్ చేసుకొని యాక్టివేట్ చేసుకోవాలి. ఆ తర్వాత మెసేజ్ ద్వారా మీ స్నేహితుల్ని దీంట్లోకి ఆహ్వానించొచ్చు. పైన హెడర్‌లో ఉండే కళ్లజోడు బొమ్మను క్లిక్ చేస్తే... మీకు పెద్ద వసతుల గని కనిపిస్తుంది. సమాచార శోధన, ఆఫర్ల వివరాలు, క్యాబ్ బుకింగ్ లాంటి చాలా ఆప్షన్లు ఇందులో ఉన్నాయి.

* https://goo.gl/H5Zc49

వాట్సయాప్ ఫొటోలు



మన ఫోన్ కాంటాక్టుల్లో ఉన్న చాలామంది వాట్సయాప్‌లో ప్రొఫైల్ పిక్చర్లని కలిగి ఉంటారు. వారు సెట్ చేసుకున్న ప్రొఫైల్ పిక్చర్లని మన ఫోన్‌లో కాంటాక్ట్స్‌కి సెట్ చేసుకోవాలంటే కాంటాక్ట్ ఫొటో అనే అప్లికేషన్‌ని ఇన్‌స్టాల్ చేసుకుంటే సరిపోతుంది. https://goo.gl/Z4TdHd అనే లింక్ నుండి దీన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మొట్టమొదటిసారి రన్ చేసిన వెంటనే ఇది వాట్సయాప్ ప్రొఫైల్ పిక్చర్లని స్కాన్ చేసి, వాటిని కాంటాక్టులకు అప్లై చేసే అవకాశాన్ని కల్పిస్తుంది.

ట్రయాంగిల్ యాప్‌తో ఆదా

స్మార్ట్‌ఫోన్లలో మొబైల్ డేటా వినియోగంపై ఓ కన్నేసే థర్డ్ పార్టీ యాప్‌లు చాలా ఉన్నాయి. ఏ యాప్ ఎంత డేటాను వాడుతోంది, దేన్ని నిలువరిస్తే డేటా వృథాను అడ్డుకోవచ్చు అంటూ కొన్ని సూచనలు కూడా ఇస్తుంటాయి. ఇలాంటి అంశాలతో గూగుల్ ట్రయాంగిల్ అనే కొత్త యాప్‌ను రూపొందించింది. ఇటీవల ఈ యాప్‌ను ఫిలిప్పీన్స్‌లో ప్రారంభించింది. దీన్ని ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకుంటే మీ మొబైల్ డేటా వినియోగాన్ని లెక్క కట్టి చూపిస్తుంది. మీ ఫోన్‌లోని ఏవైనా కొన్ని యాప్స్‌ని నెట్ యాక్సెస్ చేయక్కర్లేదు అని మీకనిపిస్తే దాన్ని ట్రయాంగిల్ ఆప్ ద్వారా చేయొచ్చు.

ప్రభుదేవా లక్ష్మి టీజర్ విడుదల



ప్రభుదేవా, ఐశ్వర్య రాజేష్ తారాగణంగా ప్రమోద్ ఫిలింస్, ట్రిడెంట్ ఆర్ట్స్ బ్యానర్స్‌పై విజయ్ దర్శకత్వంలో ప్రతీక్ చక్రవర్తి, శృతి నల్లప్ప, ఆర్.రవీంద్రన్ నిర్మాతలుగా రూపొందుతోన్న చిత్రం 'లక్ష్మీ' ఈ సినిమా పాత్రికేయుల సమావేశం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగింది. ప్రభుదేవా మాట్లాడుతూ - "దర్శకుడు విజయ్ నాకు సోదరుడితో సమానం. తనతో 'అభినేత్రి' సినిమా చేయడం గొప్ప అనుభవం. తర్వాత మా కాంబినేషన్‌లో అభినేత్రి 2 సినిమా చేద్దామని కూడా అనుకున్నాం. ఆ సమయంలో ఈ స్క్రిప్ట్ విన్నాను. చాలా బాగా నచ్చింది. ఇలాంటి సినిమాకు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ చాలా ముఖ్యం. శామ్ అద్భుతమైన సంగీతాన్ని అందించాడు. సినిమా చూస్తే ఆడియెన్స్‌కు అర్థమవుతుంది. డాన్స్ ఫిలిం చేయాలని విజయ్ అంటే.. ఓ రేంజ్‌లో చేయాలని అనుకున్నాను. నిర్మాతలు కూడా నా అభిప్రాయాన్ని అర్థం చేసుకుని మేకింగ్‌లో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమాను నిర్మించారు. డాన్స్ మూవీస్ వచ్చి చాలా రోజులయ్యాయి. ఈ సినిమాలో నటించిన పిల్లలందరూ చాలా బాగా చేశారు. నేను అన్నట్లుగానే సినిమా ఓ రేంజ్‌లో ఉంటుంది. ఇండియా మొత్తం నుండి పిల్లలను ఎంపిక చేశారు. ఈ పిల్లలతో చేయడం మంచి ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చింది" అన్నారు.

దర్శకుడు ఎ.ఎల్.విజయ్ మాట్లాడుతూ - "ప్రభుదేవా డాన్సింగ్ లెజెండ్. ఆయనతో ఎప్పుడు సినిమా చేసినా ఓ లెర్నింగ్ ఎక్స్‌పీరియెన్స్. మంచి స్క్రిప్ట్ సెన్స్ ఉన్న వ్యక్తి ప్రభుదేవాగారు. నిర్మాతలు శృతి, ప్రతీక్‌లు చక్కగా సినిమా చేశారు" అన్నారు.

శృతి నల్లప్ప మాట్లాడుతూ - "ప్రభుదేవాగారితో సినిమా చేయడం నా కల. ఈ సినిమాతో అది నేరవేరినందుకు ఆనందంగా ఉంది" అన్నారు.

ప్రతీక్ మాట్లాడుతూ -"మేం ప్రభుదేవా గారితో సినిమా చేయాలని ముందుగా ఏమీ ప్లాన్ చేసుకోలేదు. ఏదో అలా జరిగింది. తెలుగులో మా బ్యానర్‌లో వస్తున్న సినిమా ఇది. భవిష్యత్‌లో తెలుగు, తమిళంలో మరిన్ని సినిమాలు చేస్తాం" అన్నారు.

ప్రభుదేవా, ఐశ్వర్య రాజేష్, బేబి దిత్యా బాండే, సల్మాన్ యూసఫ్ ఖాన్, సోఫియా, కోవై సరళ, సత్యం రాజేష్, చామ్స్ తదితరులు నటిస్తోన్న ఈ చిత్రానికి మ్యూజిక్: శామ్ సి.ఎస్, కెమెరా: నిరవ్ షా, డైలాగ్స్: సత్య, సాహిత్యం: వనమాలి, కొరియోగ్రఫీ: పరేశ్ సిరోద్కర్, రుయెల్ డౌసన్ వరిందని, స్టంట్స్: స్టంట్ సిల్వ, ఆర్ట్: ఎ.రాజేశ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: గణేశ్, ఓమార్, నిర్మాతలు: ప్రతీక్ చక్రవర్తి, శృతి నల్లప్ప, ఆర్.రవీంద్రన్, రచన, దర్శకత్వం: విజయ్.

విశాలాంధ్ర సినిమా

'సిరిమల్లె పువ్వా' చిత్రం ప్రారంభం..

ఎస్. ఎమ్. క్రియేషన్స్ పతాకంపై మమత, నరేంద్ర, షఫీ, ప్రియ ప్రధాన పాత్రధారులుగా గౌతమ్. ఎమ్ దర్శకత్వంలో లేడీ నిర్మాత కౌసర్ జహాన్ నిర్మిస్తున్న మెసేజ్ ఓరియంటెడ్ చిత్రం 'సిరిమల్లె పువ్వా'. ఈ చిత్రం ప్రారంభోత్సవం తెలంగాణ ఆర్థిక మంత్రి మఈటల రాజేందర్ చేతులమీదుగా జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వెనుక బడిన తరగతుల కమిషన్ అధ్యక్షులు డాక్టర్ వకుళా భరణం కృష్ణ మోహనరావు, సుధాకర్ గోగికర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు గౌతమ్ మాట్లాడుతూ.. "ఇదొక వెరైటీ చిత్రం. ఈ చిత్రంలో మంచి మెసేజ్ ఉంటుంది. ప్రతి ఒక్కరిని ఆకట్టుకునేలా మంచి కథ, కథనంతో ఈ చిత్రం తెరకెక్కిస్తున్నాం. పేరుకు తగినట్లుగానే.. సిరిమల్లె పువ్వంత స్వచ్ఛంగా ఈ సినిమా ఉంటుంది.." అన్నారు. నిర్మాత కౌసర్ జహాన్ మాట్లాడుతూ.. " గౌతమ్ గారు చెప్పిన కథ ఎంతగానో నచ్చింది. మంచి మెసేజ్ వుంది. మంచి కమర్షియల్ ఎలిమెంట్స్ వున్నాయి. ఈ చిత్రం ఖచ్చితంగా మా బ్యానర్‌కి మంచి పేరు తెచ్చే చిత్రం అవుతుంది.." అన్నారు. మమత, నరేంద్ర, షఫీ, ప్రియ, జి. పుల్లారావు, దీప్తి, వీరు, కుమార్, గౌతమ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి డి.ఓ.పి: సూర్య, ప్రభాకర్, ఫిరోజ్, ఎడిటర్: నందమూరి హరి, మ్యూజిక్: రామ్ మోహన్, ఆర్ట్ డైరెక్టర్: వాసుదేవరావు, ప్రొడక్షన్ మేనేజర్: లక్ష్మణ్, ప్రొడ్యూసర్: శ్రీమతి కౌసర్ జహాన్, కథ-దర్శకత్వం: గౌతమ్. ఎమ్.

ఊహ, వాస్తవాల అందమైన కలయికగా రాజరథంలోని

'నిన్ను నేను ప్రేమించానంటూ' పాట



అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'రాజరథం' విడుదల దగ్గరయ్యే కొద్దీ చిత్ర బృందం మరో పాటని విడుదల చేశారు. 'నిన్ను నేను ప్రేమించానంటూ' అంటూ సాగే ఈ యుగళగీతం వినసొంపుగా ఉండడమే గాక, అద్భుతమైన దృశ్యాలతో కనువిందు చేయనుంది. బర్ఫీ, జగ్గా జాసూస్, వంటి చిత్రాలకి పని చేసిన ఆర్ట్ డైరెక్టర్ రజత్ పొద్దార్ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ పాటని ఊహ, వాస్తవాల కలయికగా ఒక భారీ సెట్‌తో ఎంతో అందంగా తీర్చిదిద్దారు. ఊటీ అడవుల్లో చిత్రీకరణ జరుపుకున్న ఈ పాట కోసం అడవుల్లోనే భారీ సెట్ నిర్మించారు. ఈ పాట కోసం ఆర్ట్ డిపార్ట్‌మెంటు వారు ప్రతిరోజూ ఎంతో శ్రమించి సెట్‌ని నిర్మించేవారు. అటవీశాఖ వారి నియమాల ప్రకారం సాయంత్రం 6 గంటల తర్వాత సెట్ ఉంచకూడదు. అందుకని రోజూ ఉదయం 3 గంటలకి సెట్ నిర్మాణం మొదలెట్టి సాయంత్రం 6 గంటలకి మళ్ళీ తీసేసేవారు. చిత్ర సంగీత దర్శకుడు, దర్శకుడు అయిన అనూప్ 90ల పాటల్లో ఉండే రొమాంటిక్ ఫ్లేవర్‌తో ఈ పాట ఉండాలని అందుకోసం 40 మంది సంగీత నిపుణుల తో వయలిన్, సెల్లోస్‌లతో కూడిన అర్కెస్ట్రాని ఉపయోగించారు. ఇప్పటికి సరిపోయే పదాలతో రామజోగయ్య శాస్త్రి గారు పాటని రచించి పాటకి నిండుదనాన్ని తెచ్చారు. ఈ చిత్రంలోని అన్ని పాటల ఆర్కెస్ట్రాకి ప్రముఖ సాక్స్ వాయిద్యకారుడు సాక్స్ రాజా ఆధ్వర్యంలో నిర్వహించారు. చాలా కాలం తర్వాత ఇంత మంచి మెలోడీ లకి పనిచేసినందుకు ఎంతో సంతోషంగా ఉందని స్వయంగా సాక్స్ రాజా చెప్పడం విశేషం. ప్రముఖ నటుడు రవి శంకర్ 'రాజరథం'లో 'చల్ చల్ గుర్రం' అని సాగే పాటని పాడిన విషయం తెలిసిందే. ఆ పాటతో పాటు అయనకీ ఈ "నిన్ను నేను ప్రేమించానంటూ' అనే పాట ఎంతగానో నచ్చిందట. ఈ పాట గురించి చెప్తూ, " నేను సినిమాకి సంబంధించి ఎన్నో పనులు చేయగలను కానీ ఈ 'నిన్ను నేను ప్రేమించానంటూ' లాంటి పాటని మాత్రం స్వరపరచలేను. అనూప్‌కి నిజంగానే ఆ సరస్వతి దేవి ఆశీస్సులున్నాయి". పాట చిత్రీకరణ కోసం చిత్రబృందం చాలానే కష్టపడ్డారు. అంత చల్లటి వాతావరణంలో రైన్ సీక్వెన్స్ చిత్రీకరించాక హీరో నిరూప్, హీరోయిన్ అవంతిక శెట్టిలు జ్వరం బారిన పడేవారు. ఎంతో అప్పీల్ ఉన్న ఈ పాటని బాలీవుడ్ సింగర్‌తో పాడించే అవకాశం ఉన్నా అనూప్ తానే ఈ 'నిన్ను నేను ప్రేమించానంటూ' అంటూ సాగే పాటని పాడటం విశేషం. టైటిల్ పాత్ర 'రాజరథం'గా రానా దగ్గుబాటి గాత్రంలో తీర్చిదిద్దిన ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ఈ నెల 23న విడుదల చేయడానికి నిర్మాణ సంస్థ 'జాలీ హిట్స్' సన్నాహాలు చేస్తోంది.

ఎన్టీఆర్‌కు విలన్‌గా జగపతి బాబు



ప్రతి సినిమాలో కథానాయకుడి పాత్ర ఎంత ముఖ్యమో ప్రతి కథానాయకుడి పాత్ర కూడా అంతే ముఖ్యం. ఇక సినిమాకు కథానాయకుడు యంగ్ టైగర్ ఎన్టీఆర్ అయితే ఇక ప్రతి కథానాయకుడి పాత్ర ఆయనకు ధీటుగానే ఉండాలి. ఈ పాత్ర ఎంపిక కోసం తెరవెనుక బాగానే కసరత్తు జరుగుతుంది. ఎన్టీఆర్, త్రివిక్రమ్ కాంబోలో సినిమా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో ప్రతి కథానాయకుడి పాత్రకు జగపతిబాబును ఎంపిక చేసినట్టు సమాచారం. ఎన్టీఆర్, జగపతి బాబు గతంలో నాన్నకు ప్రేమతో సినిమాలో కలిసి నటించారు. మళ్లీ ఈ సినిమాలో వీరిద్దరి కాంబో రిపీట్ కాబోతోంది.

సాయిపల్లవి,నిత్యామీనన్ ఒకే సినిమాలో



'ఫిదా' సినిమా అంటే టక్కున గుర్తొచ్చే పేరు సాయిపల్లవి. అంతలా తన నటనతో తెలుగు ప్రేక్షకులను 'ఫిదా' చేసేసింది. అదే సమయంలో నిత్యామీనన్ కూడా అంతే. 'అలా మొదలైంది, ఇష్క్, గుండెజారీ గల్లంతైంది' మూవీలతో తెలుగు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసేసింది. ఇక ఇప్పుడు వీళ్లద్దరూ ఒకే సినిమాలో కన్పించనున్నారట. తమిళంలో ఓ సినిమా చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారట. తమిళ నటుడు కె. భాగ్యరాజ్ తనయుడు శంతను భాగ్యరాజ్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఈ సినిమా కోసం నిత్యామీనన్, సాయి పల్లవిని సంప్రదించారట. శంతను చెప్పిన కథకు వీరిద్దరూ ఓకే చెప్పారట. మరో దర్శకుడు మిస్కినే ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారట. నటుడుగా భాగ్యరాజ్ తెలుగు, తమిళంలో ఎంతటి పేరు సంపాదించాడో అందరికీ తెలుసు.



యూత్‌కు నచ్చేలా 'నీది నాది ఒకే కథ'

శ్రీ విష్ణు కథానాయకుడిగా వేణు ఉడుగుల దర్శకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రం 'నీది నాది ఒకే కథ'.నిన్న ఈ చిత్ర ట్రైలర్ విడుదల అయ్యింది. 2 నిమిషాల 20 సెకన్లు ఉన్న ట్రైలర్ ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా చదువు అంటే ఇష్టం లేని అబ్బాయి, అలాంటి అబ్బాయి తండ్రి ఒక అధ్యాపకుడు అయితే ఎలా ఉంటుందో ఈ సినిమా ట్రైలర్ చూస్తుంటే తెలుస్తోంది. తండ్రి, కొడుకు మధ్య సన్నివేశాలు దర్శకుడు బాగా చిత్రీకరించినట్లు తెలుస్తోంది. ట్రైలర్ యూత్ ఫుల్‌గా ఉంది. యువతకు బాగా కనెక్ట్ అయ్యే కాన్సెప్ట్‌ను తన మొదటి సినిమాకు కథ వస్తువుగా ఎంచుకోవడంలో సగం సక్సెస్ అయ్యాడు దర్శకుడు వేణు ఉడుగుల. సంగీతం బాగుంది. సురేష్ బొబ్బిలి మ్యూజిక్ ఈ సినిమాతో బాగా పాపులర్ అయ్యింది. ఎడిటర్ నాగేశ్వర్ రెడ్డి బొంతల కొత్త ఎడిటర్ అయినా అనుభవం గల ఎడిటర్‌గా ట్రైలర్‌ను ఆసక్తికరంగా కట్ చెయ్యడం జరిగింది.

అఖిల్ సినిమాకు ఈనెల 26న ముహూర్తం



అఖిల్ మూడో సినిమా డైరెక్టర్ వెంకి అట్లూరితో చెయ్యబోతున్నాడు. బివిఎస్ఎన్ ప్రసాద్ ఈ సినిమాకు నిర్మాత. స్క్రిప్ట్ వర్క్ జరుగుతున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలు ఈనెల 26న జరగబోతున్నాయి. వెంకి అట్లూరి చెప్పిన పాయింట్ నచ్చడంతో నాగార్జున ఈ స్క్రిప్ట్ ఓకే చేశారని తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబందించి పూర్తి వివరాలు ముహూర్తం రోజున తెలియనున్నాయి. ముందుగా అఖిల్ సినిమా కొరటాలతో ఉంటుందని వార్తలు వచ్చాయి. కానీ వెంకి అట్లూరి సినిమా మొదలు కాబోతుండడంతో ఆ వార్తల్లో నిజం లేదని తేలిపోయింది. మరి మొదటి సినిమా 'తొలిప్రేమ'తో మంచి విజయం సాధించిన వెంకి అట్లూరి అఖిల్‌ను ఎలా చూపిస్తాడో, అతనితో ఎలాంటి సినిమా చేస్తాడో చూడాలి.



వెంకయ్య, కాంగ్రెస్ సభ్యుల మధ్య వాగ్వాదం

న్యూఢిల్లీ : రాజ్యసభలో నేడు ఛైర్మన్ ఎం. వెంకయ్యనాయుడు, కాంగ్రెస్ సభ్యుల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. ఆ తరువాత కార్యకలాపాలకు అంతరాయం కలగడంతో సభను వాయిదావేశారు. ఎజెండాను సభ ముందు ఉంచిన తరువాత వెంకయ్యనాయుడు ఈ నెల 5వ తేదీన బడ్జెట్ రెండో విడత సమావేశాలు ప్రారంభమైన తరువాత కొనసాగకపోవడంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. బ్యాంకుల కుంభకోణం, కావేరి జల పంపిణీ, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్యాకేజి డిమాండు తదితర ముఖ్యమైన అంశాలు చర్చించాల్సి ఉన్నదని వెంకయ్యనాయుడు అన్నారు. ఈ అంశాలపై సభ్యులు నోటీసు ఇచ్చారు. వాటిపై చర్చ జరగాలని వారు అంగీకరించారు. అయితే, ఇంతవరకు సభ చర్చకు చేపట్టలేదు. సభ వచ్చే వారం నుంచి మామూలుగా జరుగు తుందని, నిర్మాణాత్మక చర్చ జరుగుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. "పార్లమెంట్ ఎగువ సభ గత రెండు వారాలుగా ఎటువంటి కార్య కలాపాలు నిర్వహించకపోవడం నన్ను తీవ్రంగా బాధిస్తోంది. నా సహనాన్ని పరీక్షించొద్దు.. మనం సమావేశం అవుదాం. శుభాకాంక్షలు తెలుపుకుందాం. గందరగోళం సృష్టించొద్దు. వాయిదాలొద్దు" అని వెంకయ్య అన్నారు. సభ్యులు వెల్‌లోకి దూసుకురావడం, నినాదాలు చేయడంతో సభ తరచూ వాయిదాపడడం, కొంతమంది ప్లకార్డులు ప్రదర్శించడం నేపథ్యంలో వెంకయ్య ఈ వ్యాఖ్యలు చేశారు. సమస్యలు భౌతికకంగా నిర్ణయం కావు, మనం ఏకీభావంతో లేదా సభ మెజారిటి నిర్ణయంతో మనం ముందుకు వెళ్లాలి" అని అన్నారు. ఈ సమయంలో కాంగ్రెస్ సభ్యుడు సత్యవ్రాత్ చతుర్వేది లేచి మాట్లాడుతూ, ఛైర్మన్‌తో తాను ఏకీభవిస్తున్నానని, అయితే, పార్లమెంట్‌లో ఈ విధమైన పరిస్థితిని ఆయన మొదటిసారిగా చూస్తున్నారా? అని ప్రశ్నించారు. గతంలో కొంత మంది తప్పు చేశారు, ఇప్పుడు దానినే కొనసాగిస్తామని మీరు అంటారా అని వెంకయ్య అన్నారు. "ఈ పరిస్థితి కొనసాగాలని మీరు కోరుకుంటున్నారా;..ఇదేనా మీ సూచన. ఇది మీ పార్టీ అభిప్రాయమా" అని అన్నారు. ఇందుకు కొంత మంది కాంగ్రెస్ సభ్యులు లేచి నిరసన తెలపడం ప్రారంభించారు. దానితో వెంకయ్యనాయుడు సభను వాయిదావేశారు.

కోర్టుల సమాంతర విచారణ తగదు

పీఎన్‌బీ కేసులో సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ : విచారణల్లో కోర్టులు 'సమాంతర పర్యవేక్షణ, ఒక 'సమాంతర విచారణ' చేయకూడదని సుప్రీంకోర్టుకు శుక్రవారం కేంద్ర ప్రభుత్వం తెలిపింది. రూ. 11 వేల కోట్ల పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం కేసులో దర్యాప్తు స్థితిని ఒక సీల్డు కవర్‌లో అందజేయాలని సీబీఐకి దేశ అత్యున్నత న్యాయస్థానం సూచించడాన్ని కేంద్రం వ్యతిరేకించింది. దర్యాప్తు సంస్థలు ఇటువంటి కుంభకో ణాలపై దర్యాప్తు ప్రారంభించానికి ముందు ప్రజలు ప్రజాప్రయోజనాలతో న్యాయస్థానాల వద్దకు వస్తారని అటార్నీ జనరల్ కె.కె.వేణు గోపాల్‌కు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. 'ఒక ప్రజాప్రయోజన(పిల్) ద్వారా కోర్టుకు ఎవరైనా రావడం సమర్ధనీ యమే. దర్యాప్తు స్థితిపై కోర్టుకు సమా చారం ఇవ్వాలనటం, కోర్టుల సమాంతర పర్యవేక్షణ, సమాంతర విచారణ కూడదు' అని న్యాయమూర్తులు ఎ.ఎం.ఖన్‌విల్కర్, డి.వై. చంద్రచూడ్‌లతో కూడిన బెంచ్‌కు వేణుగోపాల్ తెలిపారు. 'సమాంతర విచారణ జరుగుతు న్నట్లయితే అటువంటి నివేదికలను కోరడం ఈ న్యాయ స్థానానికే కాదు, ఏ కోర్టుకైనా సమర్ధ నీయమా' అని అటార్నీ జనరల్ ప్రశ్నించారు. అటువంటి నివేదికలు కోరడం దర్యాప్తు సంస్థల ధైర్యాన్ని తగ్గించడమేనన్నారు. పీఎన్‌బీ కుంభ కోణం కేసులో ఒక స్వతంత్ర దర్యాప్తు కోరుతూ న్యాయవాది వినీత్ ధండా దాఖలు చేసిన పిటీషన్‌ను ఏజీ వ్యతిరేకించారు.

ప్రయోగశాలల నుంచి భూమికి పరిశోధనలు

శాస్త్రవేత్తలకు ప్రధాని మోడీ పిలుపు

ఇంఫాల్ : ప్రజలకు మరిన్ని ప్రయోజనాలు అందించేందుకు శాస్త్రవేత్తలు తమ పరిశోధనలను ప్రయోగ శాలల నుంచి భూమికి విస్తరింపచేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం పిలుపునిచ్చారు. దేశాభివృద్ధికి 'ఆర్ అండ్ డి' పరిశోధనను పునర్ నిర్వచించటానికి సమయం ఆసన్నమైందన్నారు. ఇక్కడ 105వ భారత సైన్స్ కాంగ్రెస్ ప్రారంభ సమావేశాలను ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు. విజ్ఞానశాస్త్రం, సాంకేతిక పరిజ్ఞాన వినియోగంలో ఆ రెండింటి ఆవిష్కరణలకు సంబంధించి భారతదేశానికి సుదీర్ఘ చరిత్ర, ఒక గొప్ప సంప్రదాయం ఉందని తెలిపారు. 'ఈ రంగంలో ముందున్న దేశాలతోపాటు మనం సరైన స్థానాన్ని తిరిగి చేజిక్కించుకోవాల్సిన సమయం ఇది' అని ప్రధాని పేర్కొన్నారు. శాస్త్రీయ సమాజం తమ పరిశోధనలను 'ల్యాబ్‌ల నుంచి భూమి'కి విస్తరింపచేయాలని పిలుపునిచ్చారు. దేశ సంపన్నత, వృద్ధికి కీలక సాంకేతికతల అమలు కోసం దేశం భవిష్యత్‌లో సిద్ధంగా ఉండాలన్నారు. 'మన పౌరులకు బ్యాంకింగ్, ఆరోగ్య రక్షణ, విద్య వంటి సేవల విస్తృత వ్యాప్తికి సాంకేతిక అనుమతిస్తుంది' అని తెలిపారు. సామాన్య ప్రజల సామాజిక-ఆర్ధిక సమస్యల



పరిష్కారానికి శాస్త్రీయ విజ్ఞానం ఎంతో దోహదపడుతుందన్నారు. మన శాస్త్రీయ విజ్ఞానాలను సమాజానికి అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇది యువతలో శాస్త్రీయ స్వభావాన్ని ప్రోత్సహిస్తుందని ప్రధాన మంత్రి చెప్పారు. 'మన పిల్లలకు ప్రయోగశాలలు, మన సంస్థలు తెరిచి ఉంచాలి. పాఠశాల విద్యార్థులతో పరస్పరం కలిసేందుకు శాస్త్రవేత్తలు ఒక యంత్రాగాన్ని అభివృద్ధి చేయాలి' అని పేర్కొన్నారు. విజ్ఞాన శాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానం గురించి చర్చించేందుకు 9 నుంచి 12వ తరగతులకు చెందిన 100 మంది విద్యార్థులతో ఏడాదికి 100 గంటలపాటు శాస్త్రవేత్తలు సమయం వెచ్చించాలన్నది తన 'వ్యక్తిగత అభ్యర్ధన' అని ప్రధాని అన్నారు. యువతలో శాస్త్రీయ స్వభావాన్ని పెంచడానికి ఇది దోహదపడుతుం దన్నారు. 2022 నాటికి 100 జీడబ్ల్యు(గిగా వాట్ల) సౌర విద్యుత్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఈ సందర్భంగా మోడీ తెలిపారు. 'మార్కెట్‌లో ప్రస్తుతం సౌర గుణకాల సమర్ధత 17-18 శాతం. అదే ధరకు భారత్‌లో ఉత్పత్తి చేసేలా సౌర గుణకాల సమర్ధతను మరింత పెంచడాన్ని శాస్త్రవేత్తలు సవాల్‌గా తీసుకోవాలి' అని కోరారు. 2030 నాటికి సుమారు 40 శాతానికి పైగా విద్యుత్ మిక్స్‌లో శిలజ రహిత ఇంధన ఆధారిత సామర్థ్యం వాటా పెంపునకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మిషన్ ఇన్నోవేషన్‌లో, బహుళ దేశ సౌర కూటమిలో భారతదేశం ఒక లీడర్ అని అన్నారు. ఈ గ్రూప్‌లు శుద్ధ శక్తి కోసం ఆర్ అండ్ డికి ప్రేరేపణగా ఉన్నాయని ప్రధాన మంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రఖ్యాత శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ మరణాన్ని ప్రస్తావిస్తూ, బ్లాక్ హోల్స్‌పై మాత్రమే ఆయన పని చేశాడని సామాన్య ప్రజలకు తెలుసని, కానీ హాకింగ్ ఒక గొప్ప ప్రోత్సాహకుడని ప్రధాని అన్నారు. దేశ పురోగతి గురించి చర్చిస్తూ, 2025 నాటికి దేశంలో క్షయ వ్యాధిని నిర్మూలించనున్నట్లు తెలిపారు.

పౌర సంక్షేమానికి నిబద్ధత

- విద్యా, ఆరోగ్య సదుపాయాలకు పెద్దపీట
- ప్రజల ముంగిటకే ప్రాథమిక ఆరోగ్యం
- ఢిల్లీ అసెంబ్లీలో లెఫ్టినెంట్ గవర్నర్ ప్రసంగం

న్యూఢిల్లీ : 'పౌరుల సంక్షేమానికి' ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్-జీ) అనిల్ బైజాల్ అన్నారు. విద్యా, ఆరోగ్య రంగాలతో సహా ఢిల్లీ ప్రభుత్వం సాధించిన విజయాలను ఆయన వివరించారు. ఢిల్లీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అసెంబ్లీ నుద్దేశించి బైజాల్ నూతనంగా ఆమోదం పొందిన ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు గురించి మాట్లాడారు. ప్రస్తుత ధరల ప్రకారం ఢిల్లీలో తలసరి ఆదాయం 2017-18 సంవత్సరంలో రూ. 3,29,093కి పెరిగిందని, 2016-17 సంవత్సరంలో ఇది రూ. 3,00,793గా ఉందని 25 నిముషాల తన ప్రసంగంలో గవర్నర్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న పాఠశాలల్లో 6,400 అదనపు తరగతి గదులను నిర్మించడం ద్వారా విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలను పటిష్టపరిచినట్టు తెలిపారు. "అత్యధిక పాఠశాలల్లో సీసీటీవీ కెమేరాలను అమర్చాం. తరగతి గదులతో సహా అన్ని పాఠశాలల్లో సీసీటీవీల ఏర్పాటు వ్యవస్థను పటిష్టపరచాలని ప్రతిపాదించాం" అని చెప్పారు. ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలలో ఒకటి ఢిల్లీ నగర ప్రజలకు ఉత్తమమైన ఆరోగ్య సంరక్షణ అందజేయడమని బైజాల్ తెలిపారు. "రోగుల కేంద్రంగా అనేక చర్యలను ప్రభుత్వం తీసుకున్నది. ప్రజారోగ్య సదుపాయాలను ఢిల్లీ ప్రభుత్వం కల్పించింది. ఆరోగ్య కేంద్రాలలో రోగులకు ఉచితంగా మందులను సరఫరా చేస్తోంది" అని చెప్పారు. ఆమ్ ఆద్మీ మొహల్లా క్లినిక్‌ల ద్వారా ప్రజల ముంగిటకు ప్రాథమిక ఆరోగ్య సదుపాయాలను తీసుకువెళ్లే ఆలోచనలో ప్రభుత్వం ఉందని తెలిపారు. అనేక సంక్షేమ పథకాల గురించి లెఫ్టినెంట్ గవర్నర్ మాట్లాడుతూ, " మా ప్రభుత్వం సమ్మిళిత అభివృద్ధిని నమ్ముతోంది. సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజలకు మద్దతును అందిస్తుంది" అని చెప్పారు. "కార్మికుల సంక్షేమానికి మా ప్రభుత్వం కట్టుబడివుంది. ఢిల్లీ ప్రభుత్వం కనీస వేతనాలను 37 శాతం పెంచింది" అని బైజాల్ తెలిపారు.

బీజేపీ పతనం ప్రారంభం



- 2019లో 110 మించి సీట్లురావు
- మోడీ అధికారం చేపట్టాక తగ్గిన బీజేపీ బలం
- అసత్యాలతో మిత్రులను దూరం చేసుకుంటోంది

శివసేన విమర్శ

ముంబై : మిత్రపక్షం బీజేపీపై శివసేన విమర్శల పరంపర కొనసాగిస్తోంది. కేంద్రంలో బీజేపీ ప్రభతగ్గుతోందని పేర్కొంది. ఉత్తరప్రదేశ్ లోని గోరఖ్‌పూర్ లోక్‌సభా నియోజకవర్గ ఉప ఎన్నికలో బీజేపీ ఓటమి "అహం, అహంకారానికి ఓటమి"గా పేర్కొంది. 2019 ఎన్నికలలో లోక్ సభలో బీజేపీ బలం 110 సీట్లకు పడిపోతుందని తెలిపింది. "అసత్యాలను వల్లిస్తూ" తన మిత్రులను వదులుకుంటోందని బీజేపీపై శివసేన తీవ్ర స్థాయిలో దాడిచేసింది. "చిన్న రాష్ట్రమైన త్రిపురలో బీజేపీ విజయం సాధించింది. ఆ పార్టీ విజయోత్సవం జరుపుకోవాల్సి ఉంది. ఉత్తరప్రదేశ్‌లో లోక్‌సభకు రెండు నియోజకవర్గాలలో జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు ఆ విజ యోత్సవాన్ని ఆవిరి చేసేసింది. ఈ ఫలితాలు బీజేపీ శిబిరంలో భయోత్పాతాన్ని సృష్టిస్తున్నాయి. పార్టీకి బలమైన రెండు లోక్‌సభా నియోజకవర్గాలు గోరఖ్‌పూర్, ఫుల్‌పూర్ ఎస్‌పీ గెలుచుకున్నది" అని అధికార పత్రిక సామ్నా సంపాదకీయంలో శివసేన పేర్కొన్నది.

కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 10లోక్‌సభా నియోజకవర్గాలలో ఉప ఎన్నికలు జరగగా, తొమ్మిది నియోజకవర్గాలలో బీజేపీ ఓడిపోయిందని తెలిపింది. "మొదట్లో లోక్‌సభలో బీజేపీకి 282 మంది ఎంపీలు ఉన్నారు. ఇప్పుడు ఆ సంఖ్య 272కి పడిపోయింది. మోడీ, అమిత్ షా నాయకత్వంలో బీజేపీ ప్రతి ఉప ఎన్నిక లోనూ ఓడిపోతూనే ఉన్నది" అని శివసేన పేర్కొన్నది. ఉత్తరప్రదేశ్‌లో గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ ఘనవిజయం సాధించినప్పటికీ, ఈ నెలలో జరిగిన రెండు లోక్‌సభ నియోజకవర్గాల ఉప ఎన్నికలో ఓటమి చవిచూసిందని సంపాదకీయం పేర్కొన్నది. "గత ఏడాది 325 అసెంబ్లీ నియోజకవర్గాలలో గెలుపొంది బీజేపీ రికార్డుస్థాయి విజయం సాధించింది. యోగి ఆదిత్య ముఖ్యమంత్రి అయ్యారు. కేశవ్ మౌర్య ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. గోరఖ్‌పూర్ నియోజక వర్గంలో 1991 నుంచి ఆదిత్యనాథ్ ఎన్నడూ ఓటమి చెందలేదు. కానీ, ఇప్పుడు ఆదిత్యనాథ్ సీఎం అయినా పార్టీ ఆ సీటును కోల్పోయింది. త్రిపురలో వామపక్ష ప్రభుత్వాన్ని కూలగొట్టగలిగిన బీజేపీ గోరఖ్‌పూర్‌లో ఎందుకు గెలవలేకపో యింది? అని శివసేన ప్రశ్నించింది. బీహార్‌లోని ఆరారియా లోక్‌సభా నియోజకవర్గం, జెహనాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాలను ఆర్జేడి గెలుచుకున్నది. "ఇవన్నీ కూడా బీజేపీ ఓటమికి ఘంటికలు" అని సంపాదకీయం తెలిపింది. ఇదంతా చూస్తుంటే ఇప్పుడు ఒకటి స్పష్టమౌతోంది. 2019సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ 280 సీట్లను పొందలేదు. ఆ సంఖ్య 100-110కి తగ్గిపోతుంది. అందువల్ల బీజేపీ పట్టును నిలుపుకోవాల్సిన అవసరం ఉన్నది. అసత్యాలను వల్లిస్తూ బీజేపీ తన మిత్రులను వదులుకుంటోంది. పతనం ప్రారంభమైన తరువాత ఏ చాణుక్య కూడా ఆపలేదు" అని శివసేన హెచ్చరించింది.

"బీజేపీ ఓటమికి ఇది ఆరంభం అని (టీఎంసీ చీఫ్) మమతా బెనర్జీ అన్నారు. ఇది నిజమా, కాదా అన్నది మాకు తెలియదు. కానీ, 2014 ఎన్నికలలో బీజేపీకి మద్దతు పలికిన కొన్ని వర్గాల ప్రజలు నేడు ఆ పార్టీకి దూరమయ్యారన్నది వాస్తవం" అని పేర్కొంది.

రాజస్థాన్‌లో ఉప ఎన్నికల తరువాత మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ఇప్పుడు ఉప ఎన్నికలలో కాంగ్రెస్ మాత్రమే పోటి చేయగలదు అని చెప్పటాన్ని సంపాదకీయం ప్రస్తావించింది. "గోరఖ్‌పూర్ లోక్‌సభా నియోజకవర్గంలో బీజేపీ ఓటమి అహం, అహంకారానికి ఓటమి"గా శివసేన పేర్కొన్నది.

లైంగిక వేధింపులు కేసులో జేఎన్‌యూ ప్రొఫెసర్

న్యూఢిల్లీ : జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రొఫెసర్ లైంగికంగా వేధించారని జీవశాస్త్ర మహిళ విద్యార్థుల బృందం శుక్రవారం ఫిర్యాదు చేసిందని పోలీసులు తెలిపారు. వసాంట్ కుంజ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని వారు తెలిపారు. గురువారం జేఎన్‌యూ క్యాంపస్‌లో నిర్వహించిన మిడియా సమావేశంలో మహిళ విద్యార్థులు వారి సమస్యను తెలియజేశారు. ప్రొఫెసర్ తరచూ లైంగికంగా వేధిస్తున్నారని, ప్రతి అమ్మాయి ఇటువంటి సమస్యను ఎదుర్కొంటున్నదని, వాస్తవంగా అమ్మాయలా పగ పట్టినట్టు వ్యవహరిస్తున్నారని మహిళ బృందం పేర్కొన్నది. అడ్మినిస్ట్రేషన్ విభాగానికి ప్రొఫెసర్ కొన్ని ఆర్ధిక లావాదేవిలున్నాయని వారు ఆరోపించారు. కోట్ల రూపాయలు ఖర్చు అవుతున్నాయోగానీ ఎటువంటి పరికరాలు కొనుగోలు చేయలేదని అగ్రహం వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 27న హాజరు పట్టికలో సరైన శాతం లేని వారు నాపై ఇలా కావాలని నిందలు వేస్తున్నారన్నారు.

టీడీపీ నిర్ణయాన్ని స్వాగతించిన మమతాబెనర్జీ



కోల్‌కతా : ఎన్డీయే నుంచి వైదొలగాలని టీడీపీ తీసుకున్న నిర్ణయాన్ని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వాగతించారు. దురాగతాలు, ఆర్ధిక సంక్షోభాలు, రాజకీయ అస్థిరత్వంకు వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలన్నీ కల్సి పోరాడేందుకు ఏకతాటి పైకి రావాలని ఆమె పిలుపునిచ్చారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చేందుకు తిరస్కరించడంతో ఎన్‌డీఏ నుంచి వైదొలుగుతున్నట్టు టీడీపీ శుక్రవారం ఉదయం అధికారిక నిర్ణయాన్ని తీసుకొన్న అనంతరం మమతా ట్విట్టర్‌లో ఈ విధంగా స్పందించారు.

ప్రాంతీయపార్టీల దూకుడు

- కాంగ్రెస్‌కు సంకటం
- బీజేపీని ఢీకొట్టిన ఎస్పీ, బీఎస్పీ, ఆర్జేడీ
- యూపీలో కాంగ్రెస్ పునర్నిర్మాణం : రాహుల్



న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్, బీహార్ ఉపఎన్నికల్లో ప్రాంతీయపార్టీల విజయం వృద్ధకాంగ్రెస్‌కు సంకట పరిస్థితులు కల్పిస్తున్నాయి. దీంతో 2019లో జరిగే ఎన్నికల్లో ఏ ప్రాంతీయపార్టీ కాంగ్రెస్ శరణుచొచ్చే పరిస్థితి కనబడటంలేదు. ఈ ఏడాది చివరిలో జరగనున్న ఎన్నికల్లో బీజేపీ నుంచి కొన్ని రాష్ట్రాలనైనా గెలుచుకోకుంటే కాంగ్రెస్ పరిస్థితి విషమించేలా కనిపిస్తోంది. మరీముఖ్యంగా కర్ణాటక అసెంబ్లీని మళ్లీ చేజిక్కించు కోవడం ప్రతిష్టాత్మకంగా మారింది. యూపీలో స్థానిక పార్టీలైన బహుజన సమాజ్‌వాదీపార్టీ (బీఎస్పీ), సమాజ్‌వాదీపార్టీ (ఎస్పీ)లు కలసి రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని కంగుతినిపించగా, కాంగ్రెస్ ఏకాకిగా మిగిలిపోయంది. గోరఖ్‌పూర్ నియోజకవర్గం సాక్షాత్తూ ఆరాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కాగ, ఫుల్‌పూర్ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య నియోజకవర్గం. ఈ రెండింటిని తమ ఆధీనంలోకి తెచ్చుకోవడానికి ఎస్పీ, బీఎస్పీ చేతులు కలపడం జాతీయ పార్టీలకు షాక్ ఇచ్చింది. రానున్న ఎన్నికల్లో బీజేపీని నిలువరించేందుకు బీజేపీయేతర పార్టీలతో యునైటెడ్ ఫ్రంట్ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రయత్నాలను బెడిసికొట్టినట్లయింది. ప్రాంతీయపార్టీలతో జట్టుకట్టేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరెడ్డి చొరవతీసుకోవడం, దానికి తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతాబెనర్జీ ఆయనతో మాట్లాడటం జరిగిపోయింది. విపక్షాలన్నింటిని ఏకం చేసేందుకు సోనియాగాంధీ విందు ఏర్పాటు చేయగా కాంగ్రెస్‌తో సహా 20 పార్టీలు హాజరయ్యాయి. సీనియర్ కాంగ్రెస్ నేత, పౌరసమాచార శాఖ ఇన్‌చార్జి రణదీప్ సుర్జేవాలా మాట్లాడుతూ దేశంలోని ప్రజలకు బీజేపీపై భ్రమలు తొలిగిపోయాని ఎన్నికల ఫలితాలు తెలియచేశాయన్నారు. మోడీ బ్రాండ్ రాజకీయాలు మాటలకే పరిమితమయ్యాయని, దేశపౌరుల ఆకాంక్షలను పరిరక్షించడంలో ఘోరంగా విఫలమయ్యాయన్నారు. మాటలకు చేతలకు మధ్య చాలా అంతరం ఉందన్న విషయాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారని ఆయన వివరించారు. ఈ నేపథ్యంలోనే వారు ప్రత్యామ్నాయం కోసం ఎదురు చేస్తున్నారని, స్వాభావిక విలువల కోసం విపక్షాలన్నీ తమ రాజకీయ వైరుధ్యాలను పక్కనబెట్టి, ఒక్కటిగా పయనించాలని కోరుకుంటున్నాయన్నారు. కాంగ్రెస్ అభివృద్ధి పూర్వక రాజకీయాలకు మార్గదర్శకత్వం వహిస్తుందన్నారు. యూపీలో కాంగ్రెస్ రెండు స్థానాల్లో డిపాజిట్ కోల్పోవడం పై బాధ వ్యక్తం చేయకుండా ఈ పరిస్థితులపై విశ్లేషణ జరుపుతామన్నారు. బీజేపీయేతర పార్టీలన్నీ ఒకే గొడుగుకిందికి చేరి కలసి నడవాలని సుర్జేవాలా ఆకాంక్షించారు. మరో కాంగ్రెస్‌నేత జైపాల్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ చెబుతున్న థర్డ్ ఫ్రంట్ ప్రజలను మోసపుచ్చే స్టంట్ అన్నారు. యూపీ ఉప ఎన్నికల ఫలితాలు బీజేపీపై ప్రజలకున్న ఆగ్రహాన్ని తెలుపుతున్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వెల్లడించారు. ఆరాష్ట్రంలో కాంగ్రెస్‌ను పునరుద్ధరించాలని, అయితే రాత్రికి రాత్రే ఆ ప్రక్రియ జరిగిపోదని గురువారం ఆయన ట్వీట్‌లో వెల్లడించారు. ఎస్పీ, బీఎస్పీలు కాంగ్రెస్‌తో పనిలేదని భావించి ఉంటాయని ఆరాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ మంత్రి ఒకరు తెలుపుతూ కాంగ్రెస్‌కు ఇది పెద్ద దెబ్బన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ భవితవ్యం ఎస్పీ, బీఎస్పీ రెండు పార్టీలపైనే ఆధారపడి ఉందన్నారు. 403 అసెంబ్లీ స్థానాలున్న యూపీలో గతేడాది కాంగ్రెస్ 103 స్థానాల్లో పోటీచేయగా, ఎస్పీ 298 స్థానాల్లో పోటీ చేసిందన్నారు. కర్ణాటక, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌ల్లో కూడా ఇదే పరిస్థితి తలెత్తింది. ప్రాంతీయ పార్టీలే బలంగా దూసుకుపోతున్నాయి. కర్ణాటకాలో బీఎస్పీ ప్రాంతీయపార్టీ జేడీఎస్‌లు ఇప్పటికే కూటమిగా రూపొందాయి. అలాగే మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్‌లో ఎన్‌సీపీ, టీఎంసీ మిత్రకూటమిగా ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. కర్ణాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్‌లో బీజేపీలో ముఖాముఖి ఢీకొని కాంగ్రెస్ విజయం సాధిస్తేనే ఆ పార్టీకి భవితవ్యం ఉంటుందని ఎన్నికల విశ్లేషకులు వివరిస్తున్నారు.

ఆప్‌కు భగవంత్ మాన్ రాజీనామా

చండీఘర్ : ఆప్ పంజాబ్ యూనిట్ చీఫ్ సంగూర్ ఎంపీ భగవంత్ మాన్ శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. పరువు నష్టం కేసు వేసిన ఎస్ఏడీ నాయకుడికి తన పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ క్షమాపణ చెప్పడంపై భగవంత్ అసంతృప్తి వ్యక్తంచేశారు. డ్రగ్స్ వ్యాపారంతో సంబంధాలున్నట్టు ఎస్ఏడీ నాయకుడిని గతంలో నిందించిన కేజ్రీవాల్ తిరిగి క్షమాపణలు చెప్పిన నేపథ్యంలో భగవంత్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆప్ పంజాబ్ యూనిట్ ప్రెసిడెంట్ పదవికి తాను రాజీనామా చేస్తున్నట్టు భగవంత్ ట్విట్టర్ ద్వారా భగవంత్ తెలిపారు.

అవిశ్వాసంపై అధిష్టానానిదే నిర్ణయం : అన్నాడీఎంకే

చెన్నై : ఎన్డీయే నుంచి వైదొలిగిన టీడీపీ పార్టీ నరేంద్ర మోడీ ప్రభుత్వంపై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానంపై తమ పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని అన్నాడీఎంకే శుక్రవారం తెలిపింది. పార్టీ కో- ఆర్డినేటర్ ఓ పన్నీర్‌సెల్వం, కో-ఆర్డినేటర్ కే.పళనిస్వామి ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటారని అన్నాడీఎంకే సీనియర్ నేత డీ. జయకుమార్ తెలిపినట్టు ఆ పార్టీ అధికార ప్రతినిధి చెప్పారు.

కార్తీ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

న్యూఢిల్లీ : ఐఎన్ఎక్స్ మీడియా కేసులో నిందితుడైన కార్తీ చిదంబరానికి బెయిల్ పిటిషన్‌పై తన ఆదేశాలను ఢిల్లీ హైకోర్టు శుక్రవారం రిజర్వ్‌లో ఉంచింది. కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం కుమారుడు కార్తీ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐఎన్ఎక్స్ మీడియా అవినీతి కేసును సీబీఐ దర్యాప్తు జరుపుతోంది. నిందితుడికి బెయిల్ ఇస్తే కేసులో సాక్షులను మభ్యపెట్టడం, సాక్ష్యాన్ని తారుమారుచేసే అవకాశాలున్నట్టు న్యాయమూర్తి ఎస్‌పీ గార్గ్‌కు సీబీఐ తెలిపింది. అనంతరం న్యాయమూర్తి కార్తీ బెయిల్ పిటిషన్‌పై తన ఆదేశాలను రిజర్వ్‌లో ఉంచింది.

కేజ్రీవాల్ పంజాబ్‌లో పార్టీని చంపేశారు : సిద్దు

చండీఘర్ : ఎస్ఏడీ నాయకుడు విక్రం సింగ్ మజితియాకు క్షమాపణలు చెప్పడం ద్వారా రాష్ట్రంలో ఆప్ పార్టీని ఆ పార్టీ కన్వీనర్ కేజ్రీవాల్ చంపేశారని పంజాబ్ కాంగ్రెస్ నాయకుడు నవజోత్ సింగ్ సిద్దు శుక్రవారం పేర్కొన్నారు. పరువు నష్టం కేసు వేసిన ఎస్ఏడీ నాయకుడికి ఆప్ పార్టీ కన్వీనర్ కేజ్రీవాల్ శుక్రవారం క్షమాపణ చెప్పిన నేపథ్యంలో సిద్దు విలేకరులతో ఈ విధంగా మాట్లాడారు. 'ఈ రోజు రాష్ట్రంలో పార్టీని చంపేశారు' అని చెప్పారు.

వర్ణశోభితంగా లోక్‌సభ

న్యూఢిల్లీ : లోక్‌సభలో శుక్రవారం సభ్యులు రంగు రంగుల దుస్తుల్లో కన్పించడంతో సభ అంతా వర్ణశోభితంగా మారింది. సమాజ్‌వాదీపార్టీ సభ్యులు సంప్రదాయ ఎరుపు టోపీల్లో దర్శనమివ్వగా, టీఆర్ఎస్ సభ్యులు గులాబీ రంగు దుస్తుల్లో , టీడీపీ సభ్యులు పసుపు రంగు దుస్తుల్లో మెరిసిపోయారు. సభలో కావేరీ నదీ జలాల అంశాన్ని డిమాండు చేసిన అన్నాడీఎంకే సభ్యులు నలుపు, తెలుపు, ఎరుపు చారాలు ఉన్న దుస్తుల్లో కన్పించారు.

బీహార్‌లో ఎస్ఐ ఆత్మహత్య...!

పాట్నా: బీహార్ ఓ సబ్‌ఇన్‌స్పెక్టర్ ఆత్మహత్య చేసుకున్నాడు. గయ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న గౌరీశంకర్ తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకున్నాడు. తీవ్ర రక్తస్రావంతో ఉన్న అతన్ని వెంటనే ఆస్పత్రికి తరలించినప్పటికీ అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఉన్నతాధికారులు తన సెలవు అభ్యర్థనను తిరస్కరించడంతో మనస్తాపానికి గురైన ఎస్ఐ గౌరీశంకర్ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో నలుగురి మృతి

బికనీర్ : రాజస్థాన్ బికనీర్ జిల్లా బికనీర్-సూరత్‌గ్రాఫ్ హైవేపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారని పోలీసులు తెలిపారు. మహాజన్(ఎస్‌హెచ్‌ఓ) ప్రకారం వీరేంద్ర కుమార్, మిగలిన బాధితులు రెండు ట్రక్కుల మంటల్లో సజీవదహనమయ్యారు. చనిపోయిన వారిలో ఇద్దరిని ఇందరాజ్, ప్రగత్ సింగ్‌లుగా గుర్తించారని పోలీసులు వివరించారు. మిగిలిన ఇద్దరిని గుర్తించలేకపోయామన్నారు. కుమార్ మాట్లాడుతూ రెండు వాహనాలను హైవేపై నుండి ట్రాఫిక్ అంతరాయం కల్గించకుండా చూశామన్నారు.

ముగ్గురు ఎంపీల ప్రమాణస్వీకారం

న్యూఢిల్లీ : లోక్‌సభకు నూతనంగా ఎన్నికైన ముగ్గురు ఎంపీలు శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. గత వారం ఎన్నికల్లో ఆర్‌జేడీ నుంచి ఒకరు, సమాజ్‌వాదీపార్టీ నుంచి ఇద్దరు బీజేపీ అభ్యర్థులను ఓడించారు. ఎన్నికల్లో విజయం సాధించిన బీహార్‌లో అరారియా అభ్యర్థి సర్‌జేడీ సరఫరాజ్ అలం, ఉత్తరప్రదేశ్‌లో ఫుల్పూర్ నుంచి పోటీ చేసిన ఎస్పీకి చెందిన నగేంద్ర పటేల్, గోరఖ్‌పూర్ అభ్యర్థి ప్రవీణ్ కుమార్‌లు హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు.

లోయా కేసులో సుప్రీం తీర్పు రిజర్వ్

న్యూఢిల్లీ : న్యాయమూర్తి లోయా మృతిపై దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటషన్‌పై తీర్పును సుప్రీంకోర్టు శుక్రవారం రిజర్వ్‌లో ఉంచింది. మిస్టరీగా మారిన సీబీఐ జడ్జి బి.హెచ్ లోయా మృతి కేసు దర్యాప్తు కోరుతూ పిటిషన్ దాఖలైంది. షోహ్రాబుద్దీన్ బూటకపు ఎన్‌కౌంటర్ కేసులో విచారణ జరుపుతున్న జడ్జి లోయా 2014 డిసెంబరు 1న నాగపూర్‌లో గుండెపోటుతో మృతిచెందినట్టు వార్తలు వచ్చాయి.

దలేర్ మెహందీకి రెండేళ్లు జైలు

పాటియాలా : ఇమ్మిగ్రేషన్ కుంభకోణం కేసులో పంజాబీ గాయకుడు దలేర్ మెహందీకి పంజాబ్ కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. అలాగే రూ. 1,000 జరిమానా విధించింది. జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ జడ్జి నిధిసైనీ వివిధ సెక్షన్‌ల కింద కేసు నమోదైన దలేర్‌పై ఈ తీర్పు వెలువరించినట్టు న్యాయవాది గురుప్రీత్ సింగ్ భసిన్ తెలిపారు. దలేర్ మెహందీతోపాటు షంషేర్ మెహందీపై బక్షిష్ సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు. ఈ ఇద్దరి సోదరులపై 35కు పైగా ఫిర్యాదులు నమోదయ్యాయని తెలిపారు.

యూపీలో ఇద్దరు బాలికలపై అత్యాచారం

బల్లియా / షాజహాన్‌పూర్ : ఉత్తరప్రదేశ్‌లోని బల్లియా, షాజహాన్‌పూర్ జిల్లాల్లో ఇద్దరు బాలికలపై అత్యాచారం జరిగినట్టు పోలీసులు శుక్రవారం తెలిపారు. బల్లియాలో రియాటీలోని తన నివాసంలో 15 ఏళ్ల బాలిక ఒంటరిగా ఉన్న సమయంలో మంతు యాదవ్ అనే వ్యక్తి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడని, ఆయన్ని అరెస్టు చేశామని చెప్పారు. షాజహాన్‌పూర్‌లో రోజాలోని గ్రామంలో గురువారం 16 ఏళ్ల బాలికపై ఆటో డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడని చెప్పారు. నిందితుడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, ఆయన్ని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు.

ఉత్తరప్రదేశ్‌లో రైతు ఆత్మహత్య

ముజఫర్‌నగర్ : ఉత్తరప్రదేశ్‌లో ముజఫర్‌నగర్ జిల్లాలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన ఇంటికి నిప్పు అంటించుకుని ఆత్మహత్యచేసుకున్నాడని పోలీసులు శుక్రవారం తెలిపారు. అయితే రైతు ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియలేదని చెప్పారు. ఆయన తన భార్య, ఇద్దరు పిల్లలను వేరొక గదిలో ఉంచి తాళం వేసి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని చెప్పారు. వారు క్షేమంగా ఉన్నారని,మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించామని, దర్యాప్తు సాగుతోందని చెప్పారు.

ప్రణబ్‌ముఖర్జీ ఫౌండేషన్ ప్రారంభం

న్యూఢిల్లీ : ప్రజలకు మెరుగైన జీవితం అందించడానికి తోడ్పడాలన్న లక్ష్యంతో మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ పేరుతో కార్యక్రమం ప్రారంభమైంది. గురువారం ప్రణబ్‌ముఖర్జీ అధికార నివాసంలో ఆయనతోపాటు టాటా గ్రూప్ అధినేత రతన్‌టాటా సంయుక్తంగా 'ప్రణబ్ ముఖర్జీ ఫౌండేషన్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫౌండేషన్ డైరక్టర్ ఒమిత పౌల్ మాట్లాడుతూ, గ్రామీణ, సెమీ అర్బన్, అర్బన్ ప్రాంతాల్లో ప్రజల జీవితాలు మెరుగుపడేందుకు, వారికి దోహదపడేలా ప్రాజెక్టులు ప్రారంభిస్తున్నట్టు తెలిపారు.



జూనియర్ డాక్టర్ల వినూత్న నిరసన

విశాఖ కేజీహెచ్ వద్ద తొమ్మిది రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న జూనియర్ డాక్టర్లు శుక్రవారం హోమం చేస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. చెవిలో పువ్వులు పెట్టుకొని, కళ్లు చెవులు మూసుకొని మా గోడు వినండంటూ ప్రభుత్వానికి మొరపెట్టుకున్నారు.

విశాలాంధ్ర - విశాఖపట్నం బ్యూరో

రైల్వే రిక్రూట్‌మెంట్‌కు 'శాప్' ఉచిత కోచింగ్

విశాలాంధ్ర - విజయవాడ స్పోర్ట్స్ : భారత రైల్వే రిక్రూట్‌మెంట్‌లో ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న క్రీడాకారులకు కోచింగ్ సెంటర్ల ద్వారా ఇంటెన్సివ్ కోచింగ్ ఇప్పించనున్నట్లు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బంగార్రాజు తెలిపారు. విజయవాడలోని శాప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూతన క్రీడా విధానం ద్వారా జీవో నంబరు 8 ప్రకారం క్రీడాకారులకు సహాయం అందించేందుకు ఈ శిక్షణ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ నెల 3వ తేదీన రైల్వేశాఖ ప్రకటించిన లక్ష ఉద్యోగాలకు సంబంధించి పరీక్షకు హాజరయ్యే క్రీడాకారులకు విజయవాడ, హైదరాబాద్, విశాఖపట్నంలో అత్యున్నత శిక్షణా కేంద్రాలలో శిక్షణ ఉంటుందన్నారు. అవసరం అనుకుంటే క్రీడాకారుల అర్హతను బట్టి ఢిల్లీలోనూ శిక్షణ ఇప్పించేం దుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఒక్కో బ్యాచ్‌కు 30 మంది చొప్పున అయిదు బ్యాచ్‌లను పంపించనున్నట్లు చెప్పారు. ఈ శిక్షణ పూర్తి ఖర్చును శాప్ భరిస్తుందన్నారు. రాష్ట్రంలో సీనియర్ నేషనల్స్‌లో పతకాలు సాధించిన, పాల్గొన్న క్రీడాకారులు అర్హులన్నారు. ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ (మెకానికల్, ఎలక్ట్రికల్) కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన క్రీడాకారులు తమ బయోడేటాను శాప్ (sportsinap@gmail.com) ఈ మెయిల్‌కు 15 రోజుల్లోపు అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు శనివారం నుంచి శాప్ వెబ్‌సైట్‌లో చూడవచ్చన్నారు. భవిష్యత్తులో జాతీయ స్థాయి రిక్రూట్‌మెంట్లకు శిక్షణ ఇప్పించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో శాప్ ఓఎస్డీ ప్రత్తిపాటి రామకృష్ణ పాల్గొన్నారు.



హస్తకళలకు ప్రభుత్వ ప్రోత్సాహం

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్ / క్రైం : హస్తకళల అభివృద్ధికి ప్రభుత్వమే ప్రోత్సాహం అందిస్తుందని ఆంధ్రప్రదేశ్ హాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పాలి ప్రసాద్ పేర్కొన్నారు. శ్రీకాకుళంలోని వైఎస్ఆర్ కళ్యాణ మండపంలో శుక్రవారం లేపాక్షి హస్తకళలు, చేనేత వస్త్రాల ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ హస్తకళాభివృద్ధి సంస్థ ద్వారా రాష్ట్రంలోని హస్తకళా వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి కళాకారుల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తామన్నారు. కొండపల్లి, ఏటికొప్పాక, తిరుపతి వంటి ప్రదేశాలలో చేతి వృత్తుల కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ కలిస్తున్నామన్నారు. ఇటువంటి ఎగ్జిబిషన్లలో స్టాల్స్ ఏర్పాటు చేసుకునే చేతి వృత్తి కళాకారులకు టీఏ, డీఏ అందిస్తామన్నారు. స్టాల్స్ ఏర్పాటుకు ఉచితంగా స్థలం సమకూర్చుతామన్నారు. చేతి పనివారల అభివృద్ధి కోసం ప్రభుత్వం అమరావతిలో 5 ఎకరాల స్థలం కేటాయించినట్లు తెలిపారు. కొత్త కళాకారులకు 3 నెలలపాటు ప్రతి నెలా స్టైఫండ్ అందిస్తూ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. హస్తకళల డైరెక్టర్ ఇప్పిలి తిరుమలరావు మాట్లాడుతూ హస్త కళాకారుల నైపుణ్యాన్ని ప్రజలకు చేరవేసేందుకు ఎగ్జిబిషన్‌లు ఎంతో దోహదపడతాయన్నారు. ఏపీహెచ్‌డీసీ చైర్మన్ సతీమణి, ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నిర్మలకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ స్థలం ఆక్రమిస్తే ఖబడ్దార్

విశాలాంధ్ర - విజయపురిసౌత్ : నాగార్జునసాగర్‌లోని ఏఐటీయూసీ స్థలాన్ని ఆక్రమిస్తే ఎటువంటి వారినైనా ఉపేక్షించబోమని సీపీఐ మాచర్ల ఏరియా కార్యదర్శి బాలస్వామిరెడ్డి హెచ్చరించారు. గుంటూరు జిల్లాలోని నాగార్జునసాగర్ విజయపురిసౌత్‌లో ఏఐటీయూసీ స్థలాన్ని కొందరు ఆక్రమించి కొట్లు, షాపు నిర్మాణాలు చేపట్టారు. వీటిని తొలగించాలంటూ తొలుత స్థానిక పాత బస్టాండ్ నుంచి అంబేద్కర్ సెంటర్ మీదుగా ఆక్రమణ స్థలం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆక్రమణదారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఏఐటీయూసీ స్థలంలోని కొట్లు, నిర్మాణాలను తొలగించారు. నాగార్జున సాగర్ డ్యాం నిర్మాణానికి ముందు నుంచి ఏఐటీయూసీ కార్మికుల కోసం పనిచేస్తున్నది. అప్పట్లోనే ఈ స్థలంలో సమావేశాలు ఏర్పాటు చేసుకున్నారు. ప్రతి సంవత్సరం పార్టీ జెండాను ఆవిష్కరించుకుంటున్న ఈ స్థలాన్ని ఆక్రమించడమే గాక బోర్డులు తొలగించటంపై కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదుచేసినా ఫలితం లేకపోవడంతో ఇక్కడకు రావాల్సి వచ్చిందన్నారు. కార్మిక సంఘం స్థలాలను కబ్జా చేసిన కుట్రదారులారా జాగ్రత్త అని, ఈ స్థలం జోలికొస్తే మోటారు పరంధామయ్య జోలికి వచ్చినట్లు భావిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో



ఏఐటీయూసీ నియోజక వర్గ అధ్యక్షులు బత్తిన వెంకటేశ్వర్లు, కార్యదర్శి రామకృష్ణ, నాగార్జున సాగర్ సీపీఐ ఇన్‌చార్జి పొదిల శ్రీనివాస్, మాచర్ల టౌన్ సెక్రటరీ బాబురావు, జాయింట్ సెక్రటరీ జాని, రెంటచింతల, కారంపూడి కార్యదర్శులు రంగనాయకులు, సైదా తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు మొండిచేయి!

- వేట నిషేధ కాల పరిహారంలో అన్యాయం
- రెండేళ్లు కావస్తున్నా వందలాది మందికి అందని వైనం
- నిర్లక్ష్యం వీడని మత్స్యశాఖ



విశాలాంధ్ర - సోంపేట : సముద్రంపై రేయింబవళ్లు ప్రాణాలకు తెగించి వేట సాగించే మత్స్యకారులకు ప్రభుత్వ నిర్లక్ష్యం శాపంగా మారింది. ప్రతిఏటా వేట నిషేధ కాలంలో ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకం గడచిన రెండేళ్లుగా వందలాదిమందికి అందక లబోదిబోమంటు న్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఇటువంటి అభాగ్యులను పట్టించుకునే నాథుడు లేకపోవడంతో వారి వేదన అంతా ఇంతా కాదు. రిజిష్టర్డ్ బోట్లలో వేట సాగించే ఒక్కో మత్స్యకారునికి ప్రతిఏటా ఇచ్చే రూ.4 వేల చొప్పున పరిహారం గడచిన రెండేళ్లుగా వందలాది మందికి అందక పోవడం అనేక విమర్శలకు తావిస్తోంది. మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన నేతలు సైతం కనీస చొరవ చూపకపోవడం పట్ల బాధితులు కన్నెర్ర జేస్తున్నారు.

2016-17, 2017-18 సంవత్సరాలకు నంబంధించి శ్రీకాకుళం జిల్లాలో సముద్రపు వేట సాగిస్తున్న మత్స్యకారులలో 6442 మందిని మత్స్యశాఖ లబ్ధిదారులుగా గుర్తించింది. ప్రతి ఏటా ఏప్రిల్ 15 నుంచి 45 రోజుల పాటు ప్రభుత్వం సముద్రపు వేటను నిషేధిస్తున్న విషయం తెలిసిందే. ఆ కాలంలో సముద్రపు చేపలు గుడ్లను పెట్టి పొదుగుతాయన్న ఉద్దేశ్యంతో నిషేధం విధించడం ఆనవాయితీ. ఈ 45 రోజులపాటు మత్స్యకారులకు ప్రత్యామ్నాయ ఉపాధి మరొకటి ఉండదు. చేతికి ఆదాయం లభించే పరిస్థితులు ఉండకపోవడంతో ఆ సమయంలో మత్స్యకారులను ఆదుకోవాలన్న లక్ష్యంతో మొక్కుబడిగా ఒక్కో లబ్ధిదారునికి రూ.4వేల చొప్పున అందించేందుకు ప్రభుత్వ పథకం అమలవుతుంది. 2015 నుంచి రూ.4వేలు మాత్రమే చెల్లించి చేతులు దులుపుకునేవారు. రూ.4వేలకు పెంచడం కొంత మంచిదే అయినప్పటికీ గుర్తించిన లబ్ధిదారుల అందరి ఖాతాల్లో ప్రోత్సాహక నిధులు వేయకపోవడమే అసలు సమస్యగా మారింది. 2017-18 సంవత్సరానికి 6442 మంది లబ్ధిదారులకు రూ. 2,57,68,000 మంజూరు కాగా వీరిలో అధికారుల లెక్కల ప్రకారం 326 మందికి జిల్లాలో ప్రోత్సాహక నిధులు చేరలేదని తెలుస్తోంది. వీరిలో అత్యధికంగా అన్యాయానికి గురైనవారు ఇచ్ఛాపురం నియోజకవర్గంలోనే ఉన్నారని మత్స్యకార ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఈ నియోజకవర్గంలో డొంకూరు, కపాసుకుద్ది, కొత్తపాలెం, చిన్నకర్రివానిపాలెం, పెద్దకర్రివానిపాలెం, ఇద్దివానిపాలెం, ఒంటూరు, ఇసకలపాలెం, రామయ్యపట్నం, బారువ కొత్తూరు, బట్టిగళ్లూరు, ఉప్పలాం, ఎర్రముక్కాం తదితర గ్రామాల్లో ఇలా అన్యాయానికి గురైన మత్స్యకారులు వందల సంఖ్యలో ఉన్నారు. 2016-17 సంవత్సరానికి సైతం ఖాతాల్లో జమకానివారు అనేకమంది ఉన్నారు. దీనంతటికీ మత్స్యశాఖ అధికారుల నిర్లక్ష్యమే ముఖ్య కారణమని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. లబ్ధిదారుల ఆధార్ కార్డుల నెంబర్లు, బ్యాంకు ఖాతా నెంబర్లు, రేషన్‌కార్డులపై వారి పేర్ల విషయంలో ఉద్యోగులు చేసిన పొరపాట్ల మూలంగా సరిపోలకపోవడంతో నిధులు ఖాతాల్లోకి చేరకుండా సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలుస్తోంది. అధికారులు చేసిన తప్పులకు మత్స్యకారులు అన్యాయమై పోవల్సి వస్తున్నదని పలువురు ఆవేదన చెందుతున్నారు. జిల్లాస్థాయిలో ఇటువంటి తప్పులు సరిచేసేందుకు సాఫ్ట్‌వేర్ సహకరించడం లేదంటూ అధికారులు చల్లని కబుర్లు చెబుతూ కాలయాపన చేయడం పట్ల మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి సమస్యను అమరావతిలోని కమిషనరేట్ స్థాయిలో పరిష్కరించాల్సి ఉండగా, అక్కడ వరకు ఇక్కడ సమస్య తీవ్రత వెళ్లడం లేదని తెలుస్తోంది.

ముఖం చాటేస్తున్న మత్స్యకార ప్రతినిధులు

మత్స్యకారులకు ఎల్లవేళలా అండగా ఉంటామంటూ హామీలు గుప్పించి ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన ఆ సామాజికవర్గ నేతలు ఇటువంటి సమస్యలపై ముఖం చాటేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. దీనిపై కనీస స్థాయిలో ప్రయత్నాలు చేయడం లేదని, అందువలనే లబ్ధిదారులు అన్యాయానికి గురి కావల్సి వస్తున్నదని ఆరోపిస్తున్నారు.

రెండేళ్లు పైసా రాలేదు...



గడచిన రెండేళ్లు పైసా పరిహారం కూడా అందలేదు. ప్రజా ప్రతినిధులు, అధికారుల చుట్టూ ఎన్నోమార్లు తిరిగాను, ఎవరూ పట్టించుకోవడం లేదు.

- బట్టి సుందరరావు, మత్స్యకారుడు, రామయ్యపట్నం

సవతితల్లి ప్రేమ...



మత్స్యకారుల పట్ల ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపిస్తోంది. అధికారపార్టీ నేతలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే పథకాలకు దూరం చేస్తున్నారు. ఈ అన్యాయం పట్ల అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. రెండేళ్లుగా వందలాది మంది మత్స్యకారులకు పరిహారం ఇవ్వకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం.

- మద్దు రాజారావు, వైసీపీ నేత

సాంకేతిక కారణాలతోనే జాప్యం



కొంతమంది మత్స్యకారులకు గత ఏడాది మాత్రమే పరిహారం అందలేదు. సాంకేతిక లోపాల వలన ఇలా జరిగింది. వాటి పరిష్కారానికి కృషి జరుగుతుంది. వీలైనంత త్వరగా ఇప్పించేందుకు ప్రయత్నిస్తున్నాం.

- బి.సురేష్, ఎఫ్‌డీఓ



ప్రకాశం జిల్లాలో ధాన్యంపై పరదాలు కప్పుకున్న రైతులు



నెల్లూరు జిల్లాలో రైతుల పరుగులు

అకాల వర్షంతో రైతన్న పరుగులు

విశాలాంధ్ర - ముండ్లమూరు : ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతో అన్నదాతలు తల్లడిల్లిపోయారు. కల్లాల్లో ఎండబెట్టిన మిర్చిమిరపకాయలను పోగేసుకు నేందుకు నానాపాట్లు పడ్డారు. ఆరబెట్టిన పొగాకును కాపాడుకునేందుకు అష్టకష్టాలు ఎదుర్కొన్నారు మండలంలోని ఉమామహేశ్వరపురం, పూరిమిట్ల, తమ్మలూరు, మారెళ్ల, పసుపుగల్లు తదితర గ్రామాల్లో మిరప, బర్లి పొగాకు ఎక్కువ సాగు చేశారు. మిరపకాయలు కోసి కల్లాల్లో ఆరబెట్టిన సమయంలో వర్షం పడటంతో పంటను కాపాడుకునే ప్రయత్నంలో అందు బాటులోని పట్టాలను కప్పుకున్నారు. బర్లిపొగాకును తాళ్లతో కట్టి బయట ఎండబెట్టారు. వర్షానికి పట్టాలు కప్పినప్పటికీ కొంత తడిసిపోయిందని రైతులు వాపోతున్నారు. పొగాకు తడిస్తే బూజుపట్టి నాణ్యత కోల్పోతే వ్యాపారులు కొనుగోలు చేయరని ఆందోళన చెందుతున్నారు. కంది రైతులు కంగుతిన్నారు. మండల పరిధిలో సాగర్ ఆయకట్టు పరిధిలో రైతులకు నీరు రాకపోవడంతో వరినాట్లు మానేసి కంది సాగు చేశారు. కందుల విక్రయం కోసం రైతులు మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చారు. ముండ్లమూరు, మారెళ్ల, ఈదర, ఉల్లగల్లు గ్రామాల్లో మార్క్‌ఫెడ్ ద్వారా కందులను విక్రయించేందుకు కేంద్రాల వద్ద బారులు తీరారు. ఉన్నట్టుండి వర్షం రావడంతో కందులు తడిసిపోయా యని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు.

ధాన్యం కాపాడుకునేందుకు పాట్లు

విశాలాంధ్ర-సంగం/ ఎఎస్‌పేట/ వెంకటగిరి టౌన్: నెల్లూరు జిల్లాలో శుక్రవారం సాయంత్రం సంగం, ఎఎస్‌పేట, వెంకటగిరి పట్టణాల్లో అకాల వర్షం కురిసింది. వరికోతలు కోసి కల్లాల్లోని ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడ్డారు. ఆకస్మికంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో కొండమీదకొండూరు, కుక్కురిపాడు, శ్రీకొలను, అనుమసముద్రం తదితర గ్రామాల్లో రైతులు ఆందోళన చెందారు.

మహారాష్ట్ర సీఎంను చూసి నేర్చుకోండి

చంద్రబాబుకు ముద్రగడ మరో లేఖాస్త్రం



విశాలాంధ్ర - కిర్లంపూడి : మహారాష్ట్రలో రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ ముట్టడికి మండుటెండలో 180 కిలోమీటర్ల పాదయాత్ర ద్వారా ముంబై చేరుకున్న తరుణంలో మంత్రులతో ఘన స్వాగతం పలికించిన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని చూసి చంద్రబాబు ప్రజలను గౌరవించడం నేర్చుకోవాలని కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం లేఖలో సూచించారు. మరోసారి శుక్రవారం ముద్రగడ ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖాస్త్రం పంపారు. మహారాష్ట్రలో రైతులను గౌరవించడం అహంభావం లేని పాలన అయితే, మన రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కితే మన బాబు గారు రాక్షస పాలన చూపించడం దురదృష్టకరమని లేఖలో పేర్కొన్నారు. కాపులను బీసీల్లో చేర్చమంటూ పాదయాత్ర చేపడితే కార్గిల్ యుద్ధం తలపించేలా ఇతర రాష్ట్రాల పోలీసు బలగాలను రప్పించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. మాటిమాటికి నలభై సంవత్సరాల రాజకీయ జీవితం, ఈ దేశంలోనే గొప్ప తెలివిగల నాయకుడినంటూ డబ్బాలు కొట్టుకుంటూ పత్రికల్లో రాయించుకోవడం ఇకనైనా మానాలి చంద్రబాబుకు సూచించారు. మీ గురించి మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ చేసిన కామెంట్లు చూసుకోండి. మరో విషయం.. అసెంబ్లీలో మాట్లాడుతూ బిందె నీళ్లు కార్చారు, ఇది నిజమే అయితే రాజధాని కోసం రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కోవడం ఎందుకని ప్రశ్నించారు. బంగారం లాంటి భూములు రైతుల నుంచి లాక్కున్నపుడు రైతుల కన్నీళ్లు కనిపించలేదా.. ఎన్నికలలో మీరు ఇచ్చిన హామీని అమలుచేయాలంటూ కాపులు రోడ్డెక్కితే, మా జాతిని ఈడ్చి ఈడ్చి కొట్టించారు, అప్పుడు మా కన్నీరు కనిపించలేదా.. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని లేఖలో పేర్కొన్నారు. ఎందుకు నటనలు, అబద్ధాలు ఇంకెన్నాళ్ళు చేస్తారు. ప్రజలు చూడలేకపోతున్నారు. ఆపండి బాబూ.. అంటూ ముద్రగడ లేఖలో హితవు పలికారు.

గుంటూరు నగరంలో

ఆరోగ్య అత్యవసర పరిస్థితి ప్రకటించండి

రాష్ట్ర మాజీ మంత్రి మాణిక్యాలరావు



విశాలాంధ్ర - గుంటూరు సిటీ : గుంటూరు నగరంలోని అతిసార ప్రభావిత ప్రాంతాల్లో ఆరోగ్య అత్యవసర పరిస్థితిని ప్రకటించాలని రాష్ట్ర మాజీ మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే మాణిక్యాలరావు డిమాండ్ చేశారు. డయేరియాతో జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను శుక్రవారం ఎమ్మెల్సీలు సోము వీర్రాజు, పీవీఎన్ మాధవ్, నగర అధ్యక్షుడు అమ్మిశెట్టి ఆంజనేయులుతో కలిసి ఆయన పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజునాయుడును కోరారు. ఆనందపేటలో డయేరియా మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా మాణిక్యాలరావు మీడియాతో మాట్లాడుతూ కలుషిత నీరు తాగి ఇంతమంది మరణించడం బాధాకరమన్నారు. కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ఆనంద ఆదివారాలు కాదని ఆనందపేట ప్రజల్లో ఆనందం నింపాలని కోరారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ పైప్‌లైన్ల పనులను త్వరితగతిన పూర్తి చేసి యుద్ధ ప్రాతిపదికన మంచినీరు సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ ఆర్ఎంఓ రమేష్, ఎమర్జెన్సీ డాక్టర్ రాధికారాణి, బీజేపీ నాయకులు పాలపాటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మృతదేహంతో ధర్నా

- అతిసారతో మృతిచెందారని ఆందోళన
- ఆ వ్యాధి కాదంటున్న వైద్యులు

విశాలాంధ్రబ్యూరో - గుంటూరు : గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ రత్తయ్య (30) శుక్రవారం మృతిచెందాడు. అయితే రత్తయ్య అతిసారతో మృతిచెందారని మృతుని బంధువులు, వైసీపీ నాయకులు గుంటూరు నగరపాలకసంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే ముస్తాఫా మాట్లాడుతూ కలుషిత నీరు తాగి ఇప్పటివరకు పదహారుమంది నగరవాసులు మృతిచెందారన్నారు. రత్తయ్య కూడా అతిసార వ్యాధి వలన మృతి చెందారన్నారు. బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై గుంటూరు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజునాయుడు మాట్లాడుతూ రత్తయ్య అతిసారవ్యాధి వలన మృతిచెందలేదన్నారు. రత్తయ్యకు ఆల్కహాల్ తీసుకునే అలవాటు ఉండటంతో ఇతర వ్యాధి వలన మృతిచెందారన్నారు. పోస్టుమార్టం నివేదికను పరిశీలిస్తే దేనివలన మృతిచెందారో తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు లేళ్ల అప్పిరెడ్డి, మేరుగ నాగార్జున, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఆశల పల్లకిలో ఏయూ ఉద్యోగులు

- రేషనలైజేషన్ కమిటీ నివేదికపై ఆసక్తి
- పాలకవర్గ సమావేశం కోసం ఎదురుచూపు

విశాలాంధ్ర - విశాఖసిటీ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వివిధ హోదాల్లో పని చేస్తున్న బోధనేతర సిబ్బంది వర్సిటీ పాలకమండలి సమావేశం కోసం ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. తమ ఉద్యోగ భద్రత అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో అన్న ఉత్కంఠ నెలకొంది. వర్సిటీలో ఏటా కొందరు ఉద్యోగులు పదవీ విరమణ చేయడం, ఆయా స్థానాల్లో అవసరం మేర తాత్కాలిక సిబ్బందిని నియమించుకోవడం కొంతకాలంగా కొనసాగుతోంది. ప్రభుత్వ ఉత్తర్వులతో చాలా కాలంగా వర్సిటీలో శాశ్వత నియామకాలు లేవు. దీంతో పర్మినెంట్, మినిమమ్ టైంస్కేల్, 28 రోజుల వేతన సిబ్బంది, కాంట్రాక్ట్, హాస్టల్ డైలీవేజ్, కన్సాలిడేటెడ్ పే తదితర విభాగాలుగా చాలా మంది బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారు. కాంట్రాక్ట్, కన్సాలిడేటెడ్ పే, హాస్టల్ డైలీవేజ్‌గా పనిచేస్తున్న సిబ్బంది తమకు 28 రోజుల వేతన సిబ్బందిగా అవకాశం కల్పించాలని కోరుతున్నారు. 28 రోజుల వేతన సిబ్బంది తమను మినిమమ్ టైంస్కేల్ ఉద్యోగులుగా మార్పు చేయాలని, మినిమమ్ టైంస్కేల్ ఉద్యోగులు పర్మినెంట్ చేయాలని కోరుతున్నారు. ఈ క్రమంలో ఉద్యోగులు వివిధ రూపాల్లో నిరసనలు, ఆందోళనలు చేసిన నేపథ్యంలో వర్సిటీ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి లేఖలు కూడా రాశారు. కానీ స్పందన కానరాలేదు. ఎట్టకేలకు వర్సిటీ స్థాయిలోనే ఒక రేషనలైజేషన్ కమిటీ నియమించారు. ఆ కమిటీ వర్సిటీలో ఎంతమంది బోధనేతర సిబ్బంది ఉండాలి, ఎంత మంది శాశ్వత పద్ధతిలో ఉన్నారు, ప్రస్తుత కాంట్రాక్ట్, కన్సాలిడేటెడ్ పే, హాస్టల్ డైలీవేజ్, 28 రోజుల వేతన సిబ్బంది, మినిమమ్ టైంస్కేల్ సిబ్బంది క్రమబద్ధీకరణ తదితర అంశాలపై అధ్యయనం చేసి నివేదిక తయారుచేయాలని ఆదేశించారు. దీంతో కమిటీ సభ్యులు అధ్యయనం తర్వాత అనేక సమావేశాల్లో చర్చించి నివేదికను వర్సిటీ ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ నివేదికపై ఈ నెలలో వర్సిటీ పాలకవర్గ సమావేశంలో చర్చించనున్నారు. తాత్కాలిక సిబ్బందిలో ఎంత మందిని క్రమబద్ధీకరించవచ్చు, 28 రోజుల పద్ధతి తీసివేయాలా, కొనసాగించాల అనేదానిపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. మినిమమ్ టైం స్కేల్ పద్ధతి, ఇతరత్రా సిబ్బందిని సీనియారిటీ ప్రకారం పర్మినెంట్ చేసే విషయంలోనూ నివేదికను ప్రభుత్వం ముందుంచి నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నెలలో జరగబోవు వర్సిటీ పాలకవర్గ సమావేశం కోసం వర్సిటీ ఉద్యోగులందరూ ఆత్రంగా ఎదురుచూస్తున్నారు.

ఎల్పీఎస్‌పై సీఆర్‌డీఏ సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాజధాని అమరావతిలో భూసమీకరణ పథకం (ఎల్పీఎస్) లేఅవుట్ల అభివృద్ధి పనులపై రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) కమిషనర్ చెరుకూరి శ్రీధర్ సమీక్షించారు. విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్ర మంలో పనుల ప్రగతి నివేదికలను పరిశీలించి కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులకు తగిన సూచనలు అందచేశారు. అవస రానికి తగిన విధంగా ఆయా సామగ్రి, యంత్రాలు, కూలీలను సమకూర్చుకొని పనుల్లో వేగం పెంచాలని ఆయన ఆదేశించారు. వర్షాకాలంలో పనులను కొనసాగించడా నికి వీలుగా సైట్‌లలో తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. డిజైన్లలో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత అధికా రులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సీఆర్‌డీఏ అద నపు కమిషనర్ సగిలి షణ్మోహన్ నేతృత్వంలో రాజధాని ప్రభుత్వ నగర హౌసింగ్ ప్రాజెక్టుల పనులపై సమీక్ష నిర్వ హించారు. ఈ సమావేశంలో అధికారులు టి ఆంజనే యులు, ఎం జక్రయ్య, జక్కా శ్రీనివాసులు, ఇంజనీర్లు ధనుంజయ, ఎం ప్రభాకరరావు, ప్రాజెక్టు మేనేజర్ సీహెచ్ దొరబాబుతోపాటు పలు కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐఏఎస్ అధికారులకు పోస్టింగ్స్

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : ఇటీవల ఐఏఎస్‌లుగా పదోన్నతి పొందిన నలుగురు అధికారులకు ప్రభుత్వం పోస్టింగ్స్ ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర సివిల్ సర్వీసెస్ అధికారులగా ఉన్న వీరికి ఇటీవల ప్రభుత్వం ఐఏఎస్‌లుగా పదోన్నతి కల్పించగా, గత నెలలో సాధారణ పరిపాలనశాఖకు రిపోర్టు చేశారు. ఐఏఎస్‌గా పదోన్నతి పొందిన ఎం వేణుగోపాల్‌రెడ్డిని ఇంధన, మౌలిక సౌకర్యాలు, పెట్టు బడులశాఖ డిప్యూటీ సెక్రటరీగా, కే వెంకట రమణారెడ్డిని సీసీఎల్ఏ అసిస్టెంట్ సెక్రటరీగా, ఎన్ ప్రభాకర్‌రెడ్డి ఒంగోలు ఆర్‌డీఓగా, ఎస్ దిల్లీరావును నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా) వైస్ ఛైర్మన్‌గానే పోస్టింగ్స్ ఇచ్చారు. మరో ఐఏఎస్ అధికారి రంజిత్ భాషాకు ప్రభుత్వం గతంలోనే పోస్టింగ్ ఇచ్చింది.

మెనూచార్జీలు పెంచక

విద్యార్థుల అవస్థ

- హాస్టళ్లలో మెనూ చార్జీలు చెల్లించండి
- కత్తి నరసింహారెడ్డి డిమాండు
- శాసనమండలిలో ప్రశ్నలు-సమాధానాలు



విశాలాంధ్ర-అమరావతి : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్లలో విద్యార్థులకు ఐదేళ్లుగా మెనూ ఛార్జీలు చెల్లించ టం లేదని, వాటిని వెంటనే చెల్లించాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం శాసన మండలిలో ఆయన మాట్లాడారు. మూడు నుంచి 7వ తరగతి వరకు రూ.750లు, 9,10 తరగతుల వారికి రూ.850, ఇంటర్ నుంచి రూ.1050లు చెల్లించాల్సి ఉందని, వీటిని చెల్లించకపోవటంతో విద్యార్థులు ఇబ్బం దులు పడుతున్నారన్నారు. హాస్టళ్లలో నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. రాష్ట్రంలో పొదుపు సంఘాల పాత్ర చాలా కీలకమైందని, వారికి తక్కువ వేతనం చెల్లిస్తు న్నారని, వారి వేతనాన్ని రూ.5వేలకు పెంచాలని యండ పల్లి శ్రీనివాసులురెడ్డి కోరారు. అరకు కాఫీ ఏపీ బ్రాండ్ ఇమేజ్‌గా ఉందని, పాడేరు, అరకు ఏజెన్సీ ఏరియాలో కాఫీ తోటలలో గిరిజన రైతులు అంతర పంటలు వేసుకొనేలా ప్రోత్సహించాలని ప్రశ్నోత్తరాల సమయంలో కత్తి నరసింహారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అరకు కాఫీ విదేశాలకు ఎగుమతి చేస్తున్నారని, దేశీయమార్కెట్‌లో అమ్మకాలు పెరిగేలా చూడాలని అరకు కాఫీపై జరిగిన చర్చలో పాల్గొంటూ ఆయన సూచించారు. కాఫీ తోటల రైతులకు మరింత అండగా ఉండాలని సభ్యుడు వీవీవీ చౌదరి పేర్కొన్నారు. ఎమ్మెల్సీ విరపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అరకు కాఫీ తమకు దొరకకుండా చేసి విదేశాలకు ఎగుమతులు చేయటం సరికాదని, రాష్ట్ర, దేశ మార్కెట్‌లో దాని అమ్మకాలు పెంచేలా కృషి చేయాలని కోరారు. ఈ అంశంపై సాంఘిక సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ వచ్చే పదేళ్లలో అరకులో కాఫీ తోటలను అదనంగా లక్ష ఎకరాల్లో సాగు చేయాలన్న ప్రణాళికలు రూపొందించామని, గతంలో 1.75 లక్షల ఎకరాల్లో ఈ పంట సాగు అవుతోందని, అరకు కాఫీ అమ్మకాలు ప్రస్తుతం జీసీసీ ద్వారా జరుగుతు న్నాయని, సభ్యులు సూచించిన విధంగా దేశీయ, రాష్ట్రీయ మార్కెట్‌లో అమ్మకాలు పెరిగేలా చూస్తామన్నారు. గిరిజన రైతులకు 70శాతం లాభాలు వచ్చేలా చూస్తామన్నారు. గ్రామ పంచాయతీలకు మిషన్ అంత్యోదయ పథకం క్రింద 33 ర్యాంకులు వచ్చాయని పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. దేశంలోని 50వేల పంచాయతీలలో ఏపీలోని పంచాయతీలు మెరుగ్గా ఉన్నాయని, ఈ పథకంలో సమాజ వికాసం, కుటుంబ వికాసం లక్ష్యంగా 48 అంశాలతో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి జరుగుతుందన్నారు. తమ ప్రభుత్వం పంచాయతీలకు టెన్‌స్టార్ రేటింగ్ పెట్టిందని, రాష్ట్రంలోని 12918 గ్రామాలు 2019 మార్చి నాటికి రేటింగ్‌లో ఉంటాయని సభ్యుడు చిక్కాల రామచంద్రరావు అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి వివరించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకంపై ఎమ్మెల్సీ పోతుల సుజాత అడిగిన ప్రశ్నకు ఇరిగేషన్ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సమాధానమిస్తూ ఈ పథకం వల్ల కృష్ణా, గోదావరి జిల్లాల్లో ఏడు లక్షల ఎకరాల మెట్టభూమి సస్యశ్యామలమవుతుందని చెప్పారు. దీనికి అవసరమైన అటవీ భూమిలో కేవలం 859 ఎకరాలు మాత్రమే కేంద్రం కేటాయించిందన్నారు. అలాగే గోదావరి జిల్లాల్లో భూములను కోత బారి నుంచి కాపాడాలని అంగూర్ లక్ష్మి కోరగా మంత్రి సమాధానమిస్తూ భూములను కోత నుంచి కాపాడేందుకు ప్రభుత్వం రూ.304 కోట్లు కేటాయించిందని, ఆ నిధులతో ప్లాట్‌ఫారాలు నిర్మిస్తున్నామన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టుకు కేటాయించిన నిధులు, ఖర్చు, ప్రాజెక్ట్ పూర్తికి తీసుకుంటున్న చర్యల గురించి జరిగిన చర్చలో కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ హంద్రీనీవాకు అధిక బడ్జెట్ కేటాయించి పనులు చేయటం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేస్తూ కర్నూలు జిల్లాలోని రాజోలిబండ, గుండ్లకమ్మ, రాళ్ల మడుగు ప్రాజెక్టులను త్వరగా పూర్తిచేసి సాగు, తాగునీటిని అందించాలని కోరారు. సభ్యుడు రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ రాయలసీమను రతనాల సీమగా మార్చేందుకు హంద్రీనీవా, గాలేరు నగరి ప్రాజెక్టులను తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిందని, జమ్మలమడుగు నియోజక వర్గంలోని మైలవరం వద్ద ఆరు టీఎంసీల నీరున్నా గాలేరు నగరి ప్రాజెక్టుకు సంబంధించిన కాల్వలు సరిగా లేకపోవటంతో రైతులు ఆ నీటిని వినియోగించుకోలేకపోతున్నారని, 90,91 ప్యాకేజీలను రద్దు చేసి టెండర్లను పిలిచి పనులు పూర్తి చేయాలని కోరారు. ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలోని 106 చెరువులకు నీరు నింపాలని కోరారు. శ్రీశైలంలో నీరు అడుగంటిందని, రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో భూగర్భ నీటిమట్టాలు పడిపోయాయని, ఈ పరిస్థితుల్లో గాలేరు నగరి ప్రాజెక్టుకు అదనపు నిధులు కేటాయించి వెంటనే పూర్తయ్యేలా చూడాలని యండపల్లి శ్రీనివాసులురెడ్డి కోరారు. దీనికి మంత్రి దేవినేని సమాధానమిస్తూ హంద్రీనీవా ప్రాజెక్టుకు 14 నుంచి 17 వరకు మొత్తం రూ.1100కోట్లు పై చిలుకు నిధులు కేటాయించినా దాదాపు రూ.3300 కోట్లు ఖర్చు చేశామని, త్వరలోనే ఈ ప్రాజెక్ట్ పనులు పూర్తి చేస్తామన్నారు. వారంలో రూ.200కోట్ల నిధులు విడుదల కానున్నాయని, వెంటనే కర్నూలు జిల్లాలో 106 చెరువులకు నీరు నింపటంతో పాటు ఇతర మరమ్మతు పనులు చేపడతామని చెప్పారు. రాయలసీమకు కృష్ణా జలాలు ఇస్తున్నాం. ఒక్క టీఎంసీ సరఫరాకు 12కోట్లు ఖర్చు చేస్తున్నామని, ఇప్పటికి 33 టీఎంసీలు అందించామని చెప్పారు. అన్ని బోర్లకు మరమ్మతులు చేశామన్నారు. రాయలసీమను హార్టీకల్చరల్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీల్లో కబేళాలు ఏర్పాటు చేయాలని సభ్యుడు రాము సూర్యారావు కోరగా ఎంఏ.షరీఫ్ మాట్లాడుతూ కబేళాలు లేకపోవటం వల్ల బహిరంగ ప్రదేశాల్లో జంతువులను కోసి మాంసాన్ని విక్రయిస్తున్నారని, అన్ని మున్సిపాలిటీల్లో కబేళాలు నిర్మించాలని సూచించారు. మున్సిపాలిటీల్లో హెల్త్ ఇన్‌స్పెక్టర్లను నియమించాలని, వారు లేకపోవటం వల్ల విచ్చలవిడిగా వీధుల్లో జంతువులను కోసి మాంసం అమ్ముతున్నారని, అలాగే నీటిలో క్లోరినేషన్, ఆలం కలపటంలో కూడా తేడా వస్తోందని, దీనివల్ల టైఫాయిడ్ జ్వరాలు వస్తున్నాయని చెప్పారు. ఈ అంశంపై పురపాలక శాఖ మంత్రి నారాయణ సమాధానమిస్తూ రాష్ట్రంలోని 50 మున్సిపాలిటీల్లో 61 కబేళాలు ఉన్నాయని, మరో 25 మున్సిపాలిటీల్లో కబేళాలు నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని, మిగిలిన మున్సిపాలిటీల్లో స్థలాలు కేటాయించాలంటూ రెవెన్యూశాఖను కోరినట్లు చెప్పారు.

అధికారం శాశ్వతం కాదు :కత్తి

అధికారం శాశ్వతం కాదని, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తేనే అది శాశ్వతంగా ఉంటుందని ఎమ్మెల్సీ నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండలిలో పునర్విభజన చట్టంపై కత్తి మాట్లాడుతూ హోదా భిక్ష కాదని, ఐదు కోట్ల ఆంధ్రుల హక్కు అని స్పష్టంచేశారు. రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతోపాటు తమిళనాడు తరహాలో సినీనటులు హోదా కోసం పోరాడాలని కోరారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు 2014లో ఆంధ్రప్రదేశ్‌ని స్వార్థ ప్రయోజనాల కోసం విడగొట్టాయన్నారు. ప్రత్యేక హోదాపై ప్రధాని మోడీ హామీఇచ్చారన్నారు. ఇప్పుడు అమలు చేయడం లేదని విమర్శించారు. 9,10 షెడ్యూలను అమలు చేయటం లేదన్నారు. రాష్ట్రాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకుంటే అభివృధి ఎలా సాధిస్తామని నరసింహారెడ్డి ప్రశ్నించారు.

రూ.3,648.90 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపు

ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో మంత్రి సోమిరెడ్డి



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలో 2014-15 సంవత్సరం నుంచి 2017-18 వరకూ 39.01 లక్షల హెక్టార్ల విస్తీర్ణం కోసం ప్రభావిత రైతులకు రూ. 3,648.90 కోట్లను ఇన్‌పుట్ సబ్సిడీగా చెల్లించినట్లు వ్యవసాయశాఖమంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి తెలిపారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా శుక్రవారం ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విడుదల చేసిన మొత్తం ఇన్‌పుట్ సబ్సిడీని రైతులకు చెల్లించినట్లు పేర్కొన్నారు. అలాగే ఈ సబ్సిడీని పెంచే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వం వద్ద లేదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయం, ఉద్యానవనం పరంగా మొత్తం 39,01,655 మంది రైతులకు ఈ సబ్సిడీలను అందచేసినట్లు చెప్పారు. వీరు మొత్తం 34.80 లక్షల హెక్టార్లలో వివిధ రకాల పంటలను సాగు చేసారని తెలిపారు.

మహిళా,శిశు సంక్షేమానికి రూ. 2,615 కోట్లు

మహిళా,శిశు సంక్షేమానికి 2017-18 సంవత్సరంలో రూ. 1,656.67 కోట్లను కేటాయించగా, రూ. 2,615.56 కోట్లను విడుదల చేసినట్లు మంత్రి పరిటాల సునీత తెలిపారు. పలువురు సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలపై ఆమె స్పందిస్తూ.. గత మూడేళ్ల కాలంలో కేటాయించిన నిధుల కంటే అధికమొత్తంలో విడుదల చేసినట్లు వివరించారు. ప్రభుత్వం 2014-15లో రూ. 1,049.47 కోట్లు కేటాయించి, రూ. 2,040.67 కోట్లను విడుదల చేసిందన్నారు. అలాగే 2015-16లో రూ. 1,079.74 కోట్లు కేటాయించి, రూ. 1,513.51 కోట్లు, 2016-17లో రూ. 1,228.66 కోట్లు కేటాయించి, రూ. 2,056.08 కోట్లను విడుదల చేసినట్లు తెలిపారు.

పశుపోషణపై 1782 మంది రైతులకు శిక్షణ

పాడిపరిశ్రమపై రైతుల్లో శాస్త్రీయ అవగాహన కల్పించేందుకు వివిధ అంశాలపై 1782 మందికి శిక్షణ అందించినట్లు మంత్రి పి ఆదినారాయణరెడ్డి తెలిపారు. పాడిపరిశ్రమ, పౌల్ట్రీ, గొర్రెల పెంపకం, పాడి పరిశ్రమలో ఆధునిక పద్ధతులు, పశుగణ నిర్వహణ పద్ధతులు, లేగదూడల పెంపకం, పాల ఉత్పత్తిధరలను తగ్గించడం.. వంటి అంశాలపై అనంతపురం, తూర్పుగోదావరి, గుంటూరు, కర్నూలు, విశాఖపట్నం, కృష్ణా, శ్రీకాకుళం జిల్లాలోని కేంద్రాల్లో శిక్షణను ఇచ్చినట్లు మంత్రి వివరించారు. అదేవిధంగా పశ్చిమగోదావరిజిల్లా నర్సాపురం మండలం బియ్యపుతిప్ప గ్రామం వద్ద ఫిష్‌ల్యాండింగ్ సెంటరును అభివృద్ధి చేసే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోందని మరొక ప్రశ్నకు సమాధానంగా మంత్రి చెప్పారు.

పోలీసుశాఖలో ఉగాది పురస్కారాలు

రేపు ప్రదానం చేయనున్న సీఎం

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్రంలోని పోలీసు, అగ్నిమాపక, స్పెషల్ పోలీసు, అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ), విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితర అను బంధ విభాగాల్లో ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందికి ప్రభుత్వం తెలుగు సంవత్సరం ఉగాది పురస్కారాలను ప్రకటించింది. ఈ అవార్డులను సీఎం చంద్రబాబు ఉగాది పర్వదినం రోజున ప్రదానం చేయను న్నారు. అయితే ముఖ్యమంత్రి శౌర్య పతకాన్ని ఎవరికి ప్రకటించలేదు. ఉగాది పురస్కారాల వివరాలను హోం శాఖ ముఖ్య కార్యదర్శి ఏఆర్ అనురాధ శుక్రవారం విడుదల చేసింది.

ముఖ్యమంత్రి శౌర్య పతకానికి ఎంపికైన వారికి రూ.10 వేలు నగదు బహుమతితోపాటు ప్రశంసా పత్రాన్ని అందజేస్తారు. అలాగే మహోన్నత సేవా పతకా నికి రూ.6 వేలు, ఉత్తమ సేవా పతకానికి రూ.5 వేలు, కఠిన సేవా, సేవా పతకాలకు ఎంపికైన వారికి రూ.4 వేలు నగదు పురస్కారాన్ని అందజేస్తారు. పోలీసుశాఖలో బీ శరత్‌బాబు (అదనపు ఎస్పీ, నెల్లూరు), ఏ శ్రీనివాసరెడ్డి (అదనపు ఎస్పీ కడప), టీ సుబ్రమణ్యం ఏపీఎస్పీ మూడో బెటాలియన్), కే దివాకర్ (ఇంటెలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్), వీ సీతారామ్ (గ్రేహౌండ్స్ అదనపు కమాండెంట్), వీ సోమశేఖర్‌రెడ్డి (సీఐడీ డైరెక్టర్) మహోన్నత సేవా పతకం లభించగా, 74 మందికి ఉత్తమ సేవా పతకాలు, 60 మందికి కఠిన సేవా పతకాలు, 323 మందికి పోలీసు సేవా పతకాలు లభించాయి. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ((ఎస్‌పీఎఫ్) విభాగంలో ఎస్ ఫక్రుద్దీన్ (ఏస్పై, యూసీఐఎల్, తుమ్మలపల్లి), ఏ శ్రీనివాసరావు (ఏఎస్పై తిరుమల), కేఎస్ఆర్ రాజు (ఏఎస్‌జీసీ, రాజమహేంద్రవరం)కు పోలీసు ఉత్తమ సేవా పతకాలు లభించగా, 23 మంది పోలీసు సేవా పతకాలను ప్రభుత్వం ప్రకటించింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్‌లో ఎన్ పాపిరెడ్డి (హెడ్ క్వార్టర్స్ హెడ్ కానిస్టేబుల్), ఎస్ లింగప్ప (సీఐ, కడప)కు ఉత్తమ సేవా పతకం లభించగా మరో 18 మందికి సేవా పతకాలు లభించాయి. అగ్నిమాపకశాఖలో డీ మాల్యాద్రి (జిల్లా ఫైర్ ఆఫీసర్), కే నాగమోహనరావు (లీడింగ్ ఫైర్‌మెన్), బీ శివ ప్రసాద్ (లీడింగ్ ఫైర్‌మెన్)కు ఉత్తమ సేవా పతకాలు లభించగా, 50 మందికి సేవా పతకాలను ప్రకటించారు. అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ)లో హెడ్ క్వార్టర్స్ డీఎస్పీ జీ మురళీకృష్ణకు మహోన్నత సేవా పతకం, సీ జయరామరాజు (కర్నూలు డీఎస్పీ), కే లక్ష్మీ నారాయణ (హెడ్ కానిస్టేబుల్), ఎం తిరుపతిరావు (కానిస్టేబుల్)కు ఉత్తమ సేవా పతకాలు, మరో 12 మందికి సేవా పతకాలు లభించాయి.

వైఫల్యాలు కప్పిపుచ్చేందుకే ఈ నిర్ణయం : మాధవ్

విశాలాంధ్ర-అమరావతి : తెలుగుదేశం పార్టీ తమ పార్టీతో సంబంధాలు తెంచుకోవటం చాలా సంతోషంగా ఉందని బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో శుక్రవారం మాధవ్ మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలు బయట పడకుండా టీడీపీ వ్యూహాత్మకంగా ఎన్‌డీఏ నుండి బయటకు వస్తుందని విమర్శించారు. గతంలో టీడీపీ గెలిచినప్పుడల్లా బీజేపీ మద్దతు ఉందన్నారు. 1984 సంక్షోభ సమయంలో బీజేపీ ఎన్‌టీఆర్‌కు మద్దతు ఇచ్చిందని గుర్తు చేశారు. 1989లో టీడీపీ ఓడిపోయి, వైఫల్యాలను బీజేపీపై నెట్టి వేసిందని మండిపడ్డారు. 1998లో వాజ్‌పేయి హయాంలో మాకు 19 శాతం ఓటు బ్యాంకు రావడంతో తిరిగి మళ్ళీ బీజేపీతో కలిసిందని చెప్పారు.

1994లో ముందస్తు ఎన్నికలలో బీజేపీతో కలసి ఓడిపోయిన తరువాత నింద మరోసారి బీజేపీపై తోసేశారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో అన్నిచోట్లా అవినీతి బాగా పెరిగిపోయిందని, వైసీపీతో టీడీపీ అక్రమ సంబంధం పెట్టుకుందని విమర్శించారు. సభలో అవిశ్వాసం పెడితే, కాంగ్రెస్ వారికి చర్చకు ఎక్కువ అవకాశం వస్తుందని, ఆ విధంగా కాంగ్రెస్‌కు జవసత్వాలు ఇవ్వనున్నారని వ్యాఖ్యానించారు. ఎన్నికలకు ఏడాది ముందే విడిపోయి మా నెత్తిన పాలుపోశారని హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే కేంద్ర నిధుల ద్వారా రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి పనుల వివరాలను ప్రజలకు తెలియజేశామన్నారు.

సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తున్న కేంద్రం

సెంట్రల్ స్కీంలు రాష్ట్రాలపై బలవంతంగా రుద్దుతున్నారు : అసెంబ్లీలో యనమల ధ్వజం



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా వుంటున్నాయని ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు విమర్శించారు. శుక్రవారం సచివాలయంలో బడ్జెట్ ఆమోదంపై చర్చ ముగింపు సందర్భంగా ఆయన కేంద్రంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్ర విధానాలు రాష్ట్రాలను బలోపేతం చేసేలా వుండాలి తప్ప బలహీనపర్చడం సరికాదన్నారు. ప్రపంచంలో ఏ దేశంలోనూ కేంద్ర పెత్తనం ఈ విధంగా లేదన్నారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల విషయంలో రాష్ట్రాల ఆమోదం లేకుండానే బలవంతంగా అమలు చేస్తున్నారని విమర్శించారు. దీనివల్ల ఆ పథకాల అమలుకు 40శాతం నిధులు చెల్లించాల్సి వస్తుందన్నారు. అలాగాకుండా సెంటర్ స్కీంలను రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వాలకే కేంద్రం ఖర్చు పెట్టే 60శాతం నిధులు చెల్లిస్తే స్థానిక ప్రజల అవసరాలకనుగుణమైన పథకాలను అమలు చేసుకునే వీలుంటుందన్నారు. ప్రతి రాష్ట్రంలో వారి ఎన్నికల మేనిఫెస్టోలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు అమలు చేయాల్సి వుంటుందని, వీటికోసమే రాష్ట్ర ప్రభుత్వాలు ఇబ్బందిపడుతుంటే కేంద్రం వారి పథకాలను బలవంతంగా రుద్దడం సబబు కాదన్నారు. దాదాపు 20 పథకాలు కేంద్రం బలవంతంగా రాష్ట్రాలపై రుద్దుతుందని ఆయన సభ్యులకు వివరించారు. అలాగే రాష్ట్రాలకు చట్టపరంగా రావాల్సిన డబ్బులు ఆపే అధికారం కేంద్రానికి లేదని స్పష్టం చేశారు. 14వ ఆర్థిక సంఘం ప్రత్యేక హోదా 2017 నుండి అన్ని రాష్ట్రాలకు నిలుపుదల చేస్తుందని చెప్పి, ఏపీకి ప్రత్యేక ప్యాకేజీ కింద సహాయం చేస్తామన్నారు. కాని దానివల్ల ఇచ్చింది 34కోట్లు మాత్రమేనని చెప్పారు. బీజేపీకి హృదయపూర్వక మద్దతు తెలిపి అండగా నిలబడితే మిత్రపక్షాన్ని ఇంత ద్రోహం చేస్తారా ? అని ఆయన మండిపడ్డారు. ఇప్పటివరకు ఏపీకి వచ్చిన పరిశ్రమలు, పెట్టుబడులు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషే తప్ప, కేంద్రం నుండి ఎటువంటి సహకారం లేదన్నారు. అదే ప్రత్యేక హోదా అమలు చేసి కేంద్రం సహకరించి వుంటే రాష్ట్రం మరింత అభివృద్ధి చెంది వుండేదన్నారు. ఈ రాష్ట్రానికి పరిశ్రమలు రాకున్నా, ఉపాధి అవకాశాలు తగ్గినా దానికి బీజేపీయే బాధ్యత వహించాలని హెచ్చరించారు. రాష్ట్ర బడ్జెట్ పేదల బడ్జెట్‌గా ప్రజామోదం పొందిందని, బడ్జెట్ చర్చలో మొత్తం 16 మంది సభ్యులు పాల్గొన్నారని యనమల తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అప్పు పెరగడానికి కూడా కేంద్ర సహకారలోపమే కారణంగా ఆయన పేర్కొన్నారు. బడ్జెట్‌లో అన్నివర్గాల సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చామని యనమల తెలిపారు.

సీడీఎంఎస్ సాఫ్ట్‌వేర్‌తో నకిలీ మందులకు చెక్

రాష్ట్రంలో సమగ్ర ఔషధ పర్యవేక్షణ వ్యవస్థ (సీడీఎంఎస్) సాఫ్ట్‌వేర్‌ను త్వరలోనే అందుబాటులోకి తెస్తామని, తద్వారా నకిలీ మందుల తయారీ, అమ్మకాలకు ఫుల్‌స్టాప్ పెడతామని వైద్యఆరోగ్యశాఖ ఇన్‌చార్జ్‌మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌తోపాటు పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. నకిలీ మందుల రవాణా సమాచారం అందడంతో అధికారులను అప్రమత్తం చేసి వివిధ ప్రాంతాల్లోని మెడికల్ ఏజెన్సీలు, దుకాణాలపై ఏకకాలంలో దాడులను నిర్వహించడం ద్వారా దాదాపు 60 లక్షల విలువైన నకిలీ మందులను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ మందులు వివిధ రాష్ట్రాల్లో తయారై మన రాష్ట్రానికి దిగుమతి అయినట్లు విచారణలో తేలిందన్నారు. ఈ సందర్భంగా మొత్తం 8 మందిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. నకిలీ మందుల విక్రయాలను నిషేధించే క్రమంలో కెమిస్టు, డ్రగ్గిస్టులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. స్పాట్‌కిట్లను సేకరిస్తున్నామని, తద్వారా క్షేత్ర స్థాయిలో అక్కడికక్కడే నమూనాలను పరీక్షించడానికి అవకాశం కలుగుతుందన్నారు. గతంలో పట్టుబడిన నిందితులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. సీడీఎంఎస్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఉత్పత్తిదారులు, హోల్‌సేల్ వ్యాపారులు, రిటైల్ వ్యాపారులు, వైద్యుల జాబితా, నిర్వహణ సరఫరా శ్రేణిని రూపొందించడానికి వీలు కలుగుతుందని యనమల సభకు వివరించారు.

ప్రణాళిక బద్ధంగా లంబసింగి అభివృద్ధి: అఖిలప్రియ

విశాఖపట్నంజిల్లా లంబసింగి వద్ద పర్యాటక సదుపాయాలను కల్పించేందుకు ప్రణాళికబద్దంగా ముందుకు వెళుతున్నట్లు మంత్రి భూమా అఖిలప్రియ తెలిపారు. ఆంధ్రా ఊటీగా పేరొందిన ఈ ప్రాంతంలో 5 నక్షత్రాల రిసార్టును నిర్మించేందుకు రూ. 5 కోట్లకు పరిపాలనా మోదం ఇప్పటికే తెలియచేసామన్నారు.



చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

జర్నలిస్టుల ఇళ్లకు రూ.100 కోట్లు

ఏప్రిల్ నుంచి ఇళ్ల నిర్మాణం : మంత్రి కాల్వ శ్రీనివాసులు

విశాలాంధ్ర-అమరావతి: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలంటూ ఏపీయూడబ్ల్యూజే చేసిన ఆందోళనకు ప్రభుత్వం స్పందించింది. జర్నలిస్టుల గృహ నిర్మాణానికి రూ.100 కోట్లు కేటాయించడంతో పాటుగా అక్రిడేషన్లు అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు మంత్రి కాల్వ శ్రీనివాసులు అసెంబ్లీ మీడియా పాయింటు దగ్గర శుక్రవారం తెలిపారు. జర్నలిస్టుల గృహనిర్మాణానికి పెద్దఎత్తున నిధులు మంజూరు చేయడం ద్వారా నంద్యాల ఉపఎన్నికల్లో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి నిలబెట్టుకున్నారని మంత్రి కొనియాడారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం తెలుగుదేశం ప్రభుత్వం ముందుంటుందని స్పష్టంచేశారు. గృహాల నిర్మాణం కోసం ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు శుక్రవారం అసెంబ్లీలో ఈ ప్రకటన చేశారని తెలిపారు. అవసరమైన పక్షంలో ఆ నిధులు మరింత పెంచుతామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చినట్టు వివరించారు. జర్నలిస్టుల గృహనిర్మాణంపై ఏర్పాటైన మంత్రుల సబ్ కమిటీ ఇప్పటికే పలుమార్లు చర్చించిందని, మార్చి నెలాఖరులోగా మళ్లీ భేటీ అయి ఇళ్ల మంజూరుకు విధివిధానాలు ఖరారు చేస్తుందని మంత్రి ప్రకటించారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలులో ఉన్న గృహనిర్మాణ పథకాల పరిధిలోనే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇళ్లను నిర్మిస్తారని, ఏప్రిల్ మాసంలోనే ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని అన్నారు. సాధారణ లబ్దిదారులకు ఇచ్చే సబ్సిడీకి అదనంగా జర్నలిస్టులకు ప్రత్యేకంగా సబ్సిడీలు మంజూరుచేసి వారిపై అధిక భారం పడకుండా ఇళ్లను నిర్మిస్తామన్నారు. దీనికోసమే రూ.100 కోట్లు ప్రభుత్వం మంజూరు చేస్తోందన్నారు. ఎన్నో ఏళ్ల క్రితమే గ్రామీణ జర్నలిస్టులకు సైతం అక్రిడేషన్లు, బస్‌పాస్‌లు ఇచ్చామన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ త్వరగా అక్రిడేషన్ల మంజూరుకు చర్యలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు.

19న అసెంబ్లీకి సెలవు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఉగాది పర్వదినం సందర్భంగా స్పీకర్ కోడెల శివప్రసాద్ ఆరోజున అసెంబ్లీకి సెలవును ప్రకటించారు. సభలో శుక్రవారం ఆయన ప్రకటన చేస్తూ సోమవారం జరగాల్సిన బడ్జెట్ సమావేశాన్ని ఈనెల 24వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. వాస్తవానికి ఉగాది ఆదివారం వచ్చింది. అయితే సోమవారం తమ ప్రాంతంలో తెలుగు నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తున్నందున ఆరోజు సెలవు ఇవ్వాలని మంత్రులు, ఎమ్మెల్యేలు చేసిన విజ్ఞప్తిని పురస్కరించుకుని ప్రభుత్వం ఈ విధంగా నిర్ణయం తీసుకుంది.

మా అవిశ్వాసానికి మద్దతివ్వండి : ఆళ్ల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పార్లమెంటులో తాము ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి టీడీపీ మద్దతివ్వాలని వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి డిమాండు చేశారు. విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఓటుకు నోటు నుంచి బయటపడేందుకుగాను ఆంధ్రప్రదేశ్ సంక్షేమాన్ని చంద్రబాబు విస్మరించారని చెప్పారు.

బీహార్‌లోనూ 'ప్రత్యేక' పల్లవి...!

పాట్నా: ప్రత్యేక హోదాకోసం ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర స్థాయి ఉద్యమం జరుగుతుండగా తాజాగా మరో బీహార్ అదే డిమాండ్‌తో ఉద్యమాన్ని తెరమీదకు తీసుకువచ్చింది. బీహార్‌లోని జేడీయూ కూడా తమ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలనే డిమాండ్‌తో కేంద్రంపై పోరాటానికి దిగనుంది. ఈ మేరకు జేడీయూ నేత కేసీ త్యాగి శుక్రవారం మీడియా ప్రతినిధులకు తెలిపారు. 'ఈ మధ్య కాలంలోనే మా ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కూడా కేంద్రాన్ని తమ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని అడిగారు. ఈ విషయంపై మేం పోరాటం కొనసాగిస్తాం' అని ఆయన అన్నారు. మహాగట్బంధన్ (జేడీయూ, ఆర్జేడీ, కాంగ్రెస్‌ల కూటమి)నుంచి తెగదెంపులు చేసుకొని బయటకు వచ్చిన జేడీయూ ఆ తర్వాత ఎన్డీయేతో పొత్తుపెట్టుకొని మరోసారి అధికారంలోకి వచ్చింది. పారిశ్రామిక పెట్టుబడులు ఆకర్షించేందుకు తమకు కూడా ప్రత్యేక హోదా ఇవ్వాలని గతంలో సీఎం నితీశ్ కుమార్ కోరారు. అయితే, ఆయన కేంద్రంలోని ఎన్డీయే మద్దతుతోనే మరోసారి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఆ విషయం ఇప్పటి వరకు పట్టించుకోలేదు. అయితే, తాజాగా జరుగుతున్న పరిణామాల దృష్ట్యా ఈ డిమాండ్ మరోసారి బలంగా కేంద్రం ముందుకు తీసుకెళ్లాలని జేడీయూ భావిస్తోంది. ఉత్తరప్రదేశ్ ఉప ఎన్నికల్లో బీజేపీ ఓడిపోవడం, ఎన్డీయేతో భాగస్వామ్యంగా ఉన్న పార్టీలు ఒక్కొక్కటిగా బయటకు వెళ్లిపోతుండటంవంటి కారణాల దృష్ట్యా నితీశ్ సర్కార్ మరోసారి ప్రత్యేక హోదా డిమాండ్‌తో పోరాటం మొదలుపెట్టనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే బిహార్ అసెంబ్లీ ప్రతిపక్ష నేత, ఆర్జేడీ నాయకుడు తేజస్వీయాదవ్ ముఖ్యమంత్రి నితీశ్‌పై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. బీజేపీతో పొత్తు పెట్టుకోగానే ఆయన ప్రత్యేక హోదాను మరిచిపోయారంటూ ప్రతి చోట విమర్శిస్తున్నారు.

కారులో సామూహిక లైంగిక దాడి

లక్నో: యూపీలో అత్యాచారాల పర్వం కొనసాగుతోంది. తాజాగా లక్నోలో మరో దారుణం వెలుగుచూసింది. రోడ్డు మీద నిలబడిన మహిళలకు లిఫ్ట్ ఇచ్చి ముగ్గురు సామూహిక అత్యాచరానికి పాల్పడ్డారు. ఫరూఖాబాద్ నుంచి కమల్‌గంజ్‌కు ముగ్గురు మహిళలు వెళ్తున్నారు. అదే సమయంలో ఓ కారు వచ్చింది. అందులో మహిళలకు తెలిసిన వ్యక్తి ఉన్నాడు. కారు ఎక్కించుకుని కొంత దూరం వెళ్లిన తరువాత మహిళలపై ముగ్గురూ అత్యాచారం చేశారు. ఆ తరువాత రోడ్డుపై వదిలి వెళ్లిపోయారు. దీంతో బాధితులు ఓ దాబాకు వచ్చి తలదాచుకున్నారని కన్నౌజ్ ఎస్పీ శేఖర్ చంద్ర గోస్వామి తెలిపారు. దాబా యజమాని మహిళలను స్టేషన్‌కు తీసుకువచ్చి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

ఏపీలో 'రాజకీయ సుడులు' (మొదటిపేజీ తరువాయి)

నడుస్తున్న సమయంలో ఒక్కసారిగా పవన్ తెలుగుదేశం పార్టీని టార్గెట్ చేయటం రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. పవన్ ఎదురు దాడి ప్రారంభించటంతో చంద్రబాబునాయుడు యు టర్న్ తీసుకున్నారు. వెంటనే కేంద్రంపై అవిశ్వాసం పెడితే సహకరిస్తానని ప్రకటించారు. అది ప్రకటించిన కొద్ది గంటల్లోనే శుక్రవారం పార్లమెంట్‌లో కేంద్రంపై తన పార్టీ ఎంపీలతో అవిశ్వాసం ప్రకటించారు. దానికన్నా గంట ముందు ఎన్‌డీఏ నుండి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కొండనైనా ఢీ కొంటానని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఇదంతా 24 గంటల్లోనే జరిగిపోయింది. టీడీపీ పరిస్థితి ఇలా ఉంటే బీజేపీ, వైసీపీ, టీడీపీలను విమర్శించి తనకు ఎవరితో సంబంధాలు లేవన్నట్లు పవన్ తేల్చి చెప్పారు. ఇప్పటివరకు పవన్ కల్యాణ్ రాబోయే ఎన్నికల్లో టీడీపీకి మిత్రపక్షంగా ఉంటారని, అన్ని రాజకీయ పార్టీల నేతలు, రాష్ట్ర ప్రజల్లో అభిప్రాయం ఉండేది. అలాంటిది ఒక్కసారిగా టీడీపీపై పవన్ విరుచుకు పడటంతో పాటు రాష్ట్రంలో తృతీయ శక్తి ఏర్పాటుకు ప్రయత్నాలు ప్రారంభించారు. తన రాజకీయ ప్రయాణాన్ని వామపక్షాలతో చేయాలన్న ధృడ సంకల్పంతో ఆ విధంగా చర్చలు ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీని పవన్ సేనలో కలుపుకుంటారా లేదా అనేది తేలాల్సి ఉంది. అయితే ఏపీలో విభజన హామీల అమలు, ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ జగన్, పవన్, చంద్రబాబులు ఎంత డిమాండు చేసినా కేంద్రంలోని బీజేపీ మాత్రం ఖాతరు చేయటం లేదు. రాష్ట్ర ప్రజలలో కేంద్రం రాష్ట్రానికి అన్యాయం చేసిందన్న అభిప్రాయం కలిగేలా ఏపీ రాజకీయాల ఎపిసోడ్ నడిచింది. అయితే రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాటమంటూనే చంద్రబాబు, జగన్, పవన్‌లు రాజకీయాలలో ఎత్తులకు పై ఎత్తులు వేసుకుంటూ అడుగులు వేస్తున్నారు. పార్లమెంట్‌లో టీడీపీ ఎంపీలు ప్రవేశపెట్టిన తీర్మానానికి తొమ్మిది పార్టీలు అండగా ఉంటాయని ఆ పార్టీ నేతలు చెప్పుకొచ్చారు. ఒక్కసారిగా రాష్ట్ర రాజకీయాలు సుడులు తిరుగుతూ కొత్తరూపు దాల్చాయి. ఇప్పటి వరకు రాష్ట్రం రెండు రాజకీయ శిబిరాలుగా విడిపోయి ఉంది. పవన్ రాకతో బలమైన మూడవ శిబిరం తయారవుతుందన్నది రాజకీయవర్గాలకు అర్థమవుతోంది. ఇక నుంచి బాబు, జగన్, పవన్‌ల రాజకీయాలు ఏ దిశగా నడుస్తాయోనని రాష్ట్ర రాజకీయవర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

లంకకు షాక్



- ఫైనల్‌కు చేరిన బంగ్లాదేశ్
- లంక కొంపముంచిన మిడిలార్డర్

కొలంబో: ముక్కోణపు సిరీస్‌లో భాగంగా శుక్రవారం శ్రీలంకతో ఉత్కంఠగా జరిగిన కీలక టీ20లో బంగ్లాదేశ్ 2 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. దీంతో ఆదివారం టీమిండియాతో జరగనున్న కీలక పోరుకు బంగ్లాదేశ్ బెర్త్ సంపాదించింది. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక నిర్ణీత 20ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. మరోవైపు ఎనిమిది ఓవర్లకే ఐదు కీలక వికెట్లు కోల్పోయిన లంకను వన్ డౌన్ బ్యాట్స్‌మెన్ కుశాల్ పెరీరా 61 (40బంతుల్లో, 7×4, 1×6), తిషార పెరీరా 58(37బంతుల్లో, 3×4, 3×6) పరుగులు చేసి ఆదుకున్నారు. వీరిద్దరూ మినహాయిస్తే.. మిగతా బ్యాట్స్‌మెన్లు తక్కువ పరుగులకే పెవిలియన్ బాట పట్టడంతో తన ప్రత్యర్థి జట్టుకు శ్రీలంక 160 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. బంగ్లాదేశ్ బౌలర్లలో ముస్తాఫిజర్ రహ్మాన్ రెండు వికెట్లు తీయగా, షకిబ్, రుబేల్, మెహిదీ హసన్, సౌమ్య సర్కార్ తలో వికెట్ తీసుకున్నారు. ఈ మ్యాచ్‌లో బంగ్లా బౌలర్లు తమ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో లంకను నిలువరించారు. 160 పరుగుల లక్ష్యంలో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్ 11 పరుగులు వద్ద తొలి దెబ్బ తగిలింది. ఓపెనర్ లింటన్‌దాస్ పరుగులేమీ చేయకుండా దనంజయ బౌలింగ్‌లో తిశారా పెరీరాకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. స్కోరు బోర్డు వేగం పెరిగిందనుకున్న తరుణంలో ఫస్ట్‌డౌన్‌లో దిగిన సాబిర్ రహ్మాన్ 13 (8 బంతులు, 3×4)ను మళ్లీ దనంజయ బోల్తా కొట్టించాడు. అంతకుముందు శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో ఒంటిచేత్తో విజయాన్ని అందించిన బంగ్లా కీపర్ ముష్ఫికర్ రహీం 28 (25 బంతులు, 2×4) అపాన్‌సో బౌలింగ్‌లో తిశారా పెరీరాకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అప్పటికి బంగ్లాదేశ్ స్కోరు 97. ఈ లోపు ఓపెనర్ తమీమ్ ఇక్బాల్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. తరువాత సౌమ్య సర్కార్ 10 (11 బంతులు)ను మెండీస్ పెవిలియన్ బాట పట్టించాడు. ఈ క్రమంలోనే తమీమ్ ఇక్బాల్ 50పరుగులు (42 బంతులు, 4×4. 2×6)ను గుణతిలక ఔట్ చేశాడు. దీంతో జట్టును విజయతీరాలకు చేర్చే బాధ్యత కెప్టెన్ షకీబుల్ హసన్, మాజీ కెప్టెన్ మహ్మదుల్లాలపై పడింది. మాజీ కెప్టెన్ మహ్మదుల్లా గ్రౌండ్‌కు నలువైపులా భారీ షాట్లు కొడుతూ బంగ్లాదేశ్‌ను విజయతీరాలకు చేర్చాడు. అయితే మ్యాచ్ జరుగుతున్న సమయంలో లంక ఫీల్డర్ల వైపునంచి అభ్యంతరకర వ్యాఖ్యలు రావడంతో కొంతసేపు ఆటకు అంతరాయం కలిగింది. లంక బౌలింగ్‌లో దనంజయకు 2 వికెట్లు దక్కగా, అపోన్‌సో, గుణతిలక, జీవన్ మెండీస్, ఉడనలకు తలో వికెట్ దక్కింది.

సెమీస్‌లో సింధు



బర్మింగ్‌హామ్: ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌లో తెలుగు తేజం పీవీ సింధు సత్తా చాటింది. తన ప్రత్యర్థి నొజోమి ఒకుహరాపై 20-22, 21-18, 21-18 తేడాతో గెలుపొంది సెమీస్‌కు చేరుకుంది. దీంతో ప్రస్తుతం ఇంగ్లండ్‌లో జరుగు తున్న ఈ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు మిగిలివున్న ఏకైక మహిళా షట్లర్ సింధునే. శుక్రవారం ఈ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. ఒకరిపై ఒకరు ఆధిపత్యం చలయిస్తూ ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేశారు. మొదటి సెట్‌లో గెలుస్తుందనుకున్న సింధును అనూహ్యరీతిలో మట్టి కరిపించి సెట్‌ను గెలుచుకుంది ఒకుహరా. ఇక అక్కడ నుంచి తేరుకున్న సింధు రెండో సెట్‌లో దాదాపు ఆధిపత్యం చలాయించినట్లు కనిపించినా ఒకుహరా ఎక్కడా అలాంటి అవకాశం ఇవ్వలేదు. పోటాపోటీగా ఆడింది. చివరకు రెండోసెట్‌ను సింధు చేజిక్కించుకుంది. దీంతో ఇద్దరూ చెరో సెట్‌ను గెలుచుకుని సమవుజ్జీలుగా ఉన్న తరుణంలో మూడోసెట్ కీలకంగా మారింది. మూడో సెట్‌లో ఒకుహరా దాదాపు ఆధిపత్యం చలాయించింది. ఇక ఈ సెట్‌కూడా సింధు కోల్పోతుందనుకున్న తరుణంలో అనూహ్యంగా పుంజుకుని సింధు లీడ్‌లోకి వచ్చింది. చివరకు సెట్‌ను గెలుచుకుంది.

సునీల్ నరైన్ డౌటే..?



న్యూఢిల్లీ: వెస్టిండీస్ స్పిన్నర్ సునీల్ నరైన్ ఐపీఎల్‌లో ఆడటంపై అనుమానాలు నెలకొన్నాయి. వేలంలో అతడిని కోల్‌కతా నైట్ రైడర్స్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం నరైన్ పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ ఎల్)లో ఆడుతున్నాడు. ఈ నేపథ్యంలో అతని బౌలింగ్ శైలిపై పలువురు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే అతడు ఐపీఎల్‌కు దూరం కావొచ్చన్న వాదనలు వినిపిస్తున్నాయి. పీఎస్‌ఎల్‌లో భాగంగా బుధవారం లాహోర్ క్వాలాండర్స్-క్వెట్టా గ్లాడియేటర్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో బౌలింగ్ శైలి అనుమానాస్పదంగా ఉందని అంపైర్లు ఫిర్యాదు చేశారు. దీంతో అతడిని వార్నింగ్ లిస్టులో చేర్చారు. దీనిపై మ్యాచ్ నిర్వాహకులు క్రికెట్ వెస్టిండీస్‌ను వివరణ కోరనున్నారు. ఇప్పుడు వెస్టిండీస్ బోర్డు చేపట్టే పరీక్షల్లో ఒకవేళ నరైన్ ఫెయిలైతే ఐపీఎల్‌కు కచ్చితంగా దూరమవుతాడు. నరైన్ బౌలింగ్ శైలిపై ఆరోపణలు రావడం ఇదే తొలిసారి కాదు. 2014లోను ఇలాగే ఆరోపణలు ఎదుర్కోవడంతో జట్టుకు దూరమైన అతడు ఆ తర్వాత తిరిగి 2015లో మైదానంలో అడుగుపెట్టాడు. మళ్లీ తిరిగి 2016లో మరోసారి ఇలాగే ఆరోపణలు ఎదుర్కొన్నాడు. ఈ ఏడాది ఏప్రిల్ 7 నుంచి ఐపీఎల్ మెగా టోర్నీ ప్రారంభంకానున్న సంగతి తెలిసిందే.

అప్పుడు మాత్రమే సలహా : బాలాజీ



చెన్నై: భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని బౌలర్లకి కావాల్సినంత స్వేచ్ఛ ఇస్తాడని చెన్నై సూపర్ కింగ్స్ బౌలింగ్ కోచ్ లక్ష్మీపతి బాలాజీ వెల్లడించాడు. ప్రస్తుతం జట్టుని సిద్ధం చేసే పనిలో ఉన్న బాలాజీ ఆంగ్ల దినపత్రిక టైమ్స్ ఆఫ్ ఇండియాతో మాట్లాడుతూ.. ధోనీ కెప్టెన్సీ గురించి తన అభిప్రాయాన్ని చెప్పాడు. 'సాధారణంగా మైదానంలో మహేంద్రసింగ్ ధోనీ బౌలర్ల సహజ శైలిని దెబ్బ తీసేలా ప్రవర్తించడు. వారికి కావాల్సినంత స్వేచ్ఛ ఇచ్చి బౌలింగ్ చేయమంటాడు. కానీ.. బౌలర్ లయ తప్పుతుంటే మాత్రం.. చిన్నపాటి సూచనలతో సరిపెడతాడు. అంతకుమించి బౌలర్ నుంచి సామర్థ్యానికి మించిన ప్రదర్శనని రాబట్టడం కోసం ఎక్కువగా ఆరాటపడడు. ధోనీ లాంటి గొప్ప కెప్టెన్ సారథ్యంలో బౌలర్లు చాలా విషయాలు నేర్చుకోవచ్చు. ధోని కెప్టెన్సీలో ఆడిన ఆటగాడిగా ఈ విషయం చెబుతున్నా' అని బాలాజీ వివరించాడు.

స్కోరుబోర్డు చెల్లాచెదురు



వడోదరా: మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా గురువారం ఆస్ట్రేలియా మహిళల జట్టుతో జరిగిన రెండో మ్యాచ్‌లో భారత్ 60 పరుగుల తేడాతో ఓటమి పాలై సిరీస్‌ను కోల్పోయిన సంగతి తెలిసిందే. కాగా, ఈ మ్యాచ్‌లో భారత క్రీడాకారిణి పూజా వస్త్రాకర్ కొట్టిన ఓ సిక్స్ స్కోరు బోర్డును చెల్లాచెదురు చేసింది. 40వ ఓవర్‌లో జోనాసెన్ వేసిన బంతిని ఎదుర్కొన్న పూజ.. దాన్ని సిక్స్ కొట్టింది. అది కాస్త బౌండరీ లైన్ ఆవల ఉన్న స్కోరు బోర్డుకు తాకింది. దీంతో స్కోరు బోర్డు చెల్లా చెదురైంది. దీనికి బౌలర్ జోనాసెన్ కూడా పూజాను అభినందించ లేకుండా ఉండలేకపోయింది. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అయ్యింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 287 పరుగులు చేసింది. 288 పరుగుల విజయ లక్ష్యంతో భారత్ బరిలోకి దిగి ఓటమి పాలైంది. దాంతో మరో మ్యాచ్ ఉండగానే భారత మహిళల జట్టు సిరీస్‌ను కోల్పోయింది.

బీసీసీఐకి షమి ఎఫ్ఐఆర్ కాపీ

కోల్‌కతా: టీమిండియా పేసర్ మహమ్మద్ షమిపై ఆయన భార్య హసీన్ జహాన్ గత వారం కోల్‌కతాలోని లాల్‌బజార్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీంతో పోలీసులు గృహహింస, హత్యాయత్నంతో పాటు మరికొన్ని సెక్షన్ల కింద షమితో పాటు మరో నలుగురిపై కేసులు నమోదు చేశారు. తాజాగా హసీన్ పోలీస్‌స్టేషన్లో షమిపై తాను చేసిన ఫిర్యాదుకు సంబంధించిన కాపీని బీసీసీఐకి పంపినట్లు ఆమె తరపు న్యాయవాది జకీర్ హుస్సేన్ తెలిపారు. 'గురువారం కోల్‌కతా పోలీస్ స్టేషన్లో షమిపై నమోదైన ఎఫ్ఐఆర్‌కు సంబంధించిన కాపీని సీఓఏ చైర్మన్ వినోద్ రాయ్‌కి పంపించాం' అని జకీర్ చెప్పారు. ఒక మ్యాచ్‌ను ఫిక్స్ చేసేందుకు పాకిస్థాన్ అమ్మాయి ద్వారా షమి డబ్బు తీసుకున్నట్లు షమి భార్య హసీన్ ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ ఆరోపణలపై దృష్టి సారించిన సీఓఏ దీనిపై విచారణ జరిపి వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం చైర్మన్ నీరజ్ కుమార్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే జకీర్ ఎఫ్ఐఆర్‌కు సంబంధించిన కాపీని పంపినట్లు తెలుస్తోంది. హసీన్ తనపై చేసిన మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలపై షమి స్పందించాడు. 'విచారణలో తాను ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు తేలితే ఉరి తీయండి' అని కన్నీటి పర్యంతమయ్యాడు. 'బీసీసీఐ తొందరపడి నా కాంట్రాక్టును రద్దు చేసింది. నేనెప్పుడూ నిజాయతీగానే ఆడాను' అని షమి ఆవేదన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

షమీ ఐపీఎల్ ఆడతాడా..?



ముంబై: టీమిండియా పేసర్ మహమ్మద్ షమిని ఐపీఎల్‌లో ఆడించాలా వద్దా అన్న దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని బీసీసీఐ తెలిపింది. తాజాగా బీసీసీఐ ప్రతినిధులు ఐపీఎల్‌లో అన్ని జట్ల ఫ్రాంచైజీ యాజమాన్యాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీసీసీఐ పాలకుల కమిటీ యాక్టింగ్ ప్రెసిడెంట్ సీకే ఖన్నా మాట్లాడారు. 'షమిపై అతని భార్య హసీన్ జహాన్ చేసిన ఆరోపణల నేపథ్యంలో దర్యాప్తు చేపట్టాల్సిందిగా బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం చీఫ్ నీరజ్ కుమార్‌ను ఆదేశించాం. వారం రోజుల్లోగా ఆయన నివేదిక అందిస్తారు. ఆ రిపోర్టును పరిగణనలోకి తీసుకుని తుది నిర్ణయం తీసుకుంటాం' అని సీకే ఖన్నా వివరించారు. ఒక మ్యాచ్‌ను ఫిక్స్ చేసేందుకు షమి పాకిస్థాన్‌కు చెందిన అమ్మాయి నుంచి నగదు తీసుకున్నాడని హసీన్ ఆరోపించిన సంగతి తెలిసిందే. దీనిపైనే బీసీసీఐ పాలకుల కమిటీ విచారణకు ఆదేశించింది. ఈ ఏడాది ఢిల్లీ డేర్‌డెవిల్స్ షమిని రూ.3కోట్లకు దక్కించుకున్న సంగతి తెలిసిందే. 'ఐపీఎల్ ప్రారంభ వేడుకల కోసం బీసీసీఐ ఫైనాన్స్ విభాగం రూ.18 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. రూ.50కోట్లతో అంగరంగ వైభవంగా ఐపీఎల్ వేడుకలను నిర్వహించాలనుకోగా బీసీసీఐ పాలకుల కమిటీ రూ.20కోట్లు కోత పెట్టి రూ.30కోట్లతో సరిపెట్టుకోమన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇందులో రూ.18కోట్లు మంజూరైనట్లు ఖన్నా తెలిపారు.

భారత్ రెండో ఇల్లు : ఫించ్



న్యూఢిల్లీ: ఐపీఎల్ వల్ల తనకు భారత్ రెండో ఇల్లు అయ్యిందని అంటున్నాడు ఆసీస్ ఆటగాడు ఆరోన్ ఫించ్. ఈ ఏడాది ఐపీఎల్ వేలంలో రూ. 6.2కోట్లు చెల్లించి కింగ్స్ ఎలెవన్ పంజాబ్ ఫించ్‌ను సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు ఐపీఎల్‌లో ఫించ్ ఆరు జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. తాజాగా ఫించ్ మాట్లాడుతూ బిగ్ బాష్ లీగ్(బీబీఎల్)-ఐపీఎల్‌కు మధ్య వ్యత్యాసం ఏమిటో తెలిపాడు. బీబీఎల్‌తో పోల్చుకుంటే ఐపీఎల్‌లో మ్యాచ్‌లు ఎక్కువ. అలాగే మ్యాచ్ జరిగే ప్రదేశాలు ఎక్కువే. అంతేకాదు వివిధ దేశాలకు చెందిన ఆటగాళ్లు ఐపీఎల్‌లో ఆడతారు. బీబీఎల్‌లో ఎక్కువ స్వదేశీ ఆటగాళ్లే ఉంటారు. అంతర్జాతీయ షెడ్యూల్స్ కారణంగా ఒక్కోసారి కీలక ఆటగాళు దూరమవుతారు. కానీ, ఐపీఎల్ అలా కాదు. ఈ లీగ్‌కి ఉన్న ఆదరణ, స్థాయి వేరు. టీ20 ఆటగాడు ఈ లీగ్ ద్వారా ఎంతో నేర్చుకోవచ్చు' అని ఫించ్ తెలిపాడు. అనంతరం 'భారత్ నాకు రెండో ఇల్లు లాంటిది. ఇక్కడికి చాలా సార్లు వచ్చాను. వివిధ ఫ్రాంచైజీలకు ఆడాను. చాలా పట్టణాలు తిరిగాను. ఈ దేశంలో నేను చాలా సౌకర్యవంతంగా ఫీలవుతాను. దేశవ్యాప్తంగా నాకు చాలా మంది స్నేహితులున్నారు' అని ఫించ్ చెప్పాడు. ఇప్పటికే ఫించ్ ఐపీఎల్‌లో గుజరాత్ లయన్స్, ఢిల్లీ డేర్‌డెవిల్స్, ముంబై ఇండియన్స్, పుణె వారియర్స్, రాజస్థాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడిన సంగతి తెలిసిందే.

శ్రీకాంత్ ఔట్..!



బర్మింగ్‌హామ్: ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ నుంచి భారత అగ్రశ్రేణి ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ ఇంటి ముఖం పట్టాడు. గతేడాది నాలుగు సూపర్ సిరీస్ టైటిళ్లు గెలిచి మంచి ఫామ్‌లో ఉన్న శ్రీకాంత్ ప్రిక్వార్టర్స్ నుంచే వెనుదిరుగుతాడని భారత అభిమానులు ఊహించలేదు. ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ కోసం రేసులో ఉన్న ఆటగాళ్లలో శ్రీకాంత్ ఒకడు. ప్రిక్వార్టర్స్‌లో భాగంగా చైనాకు చెందిన హుయాంగ్‌తో తలపడిన శ్రీకాంత్ తొలి గేమ్‌లో ప్రత్యర్థికి ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయాడు. దీంతో 11-21తో తొలి గేమ్‌ను కోల్పోయాడు. రెండో గేమ్‌లో పుంజుకున్న శ్రీకాంత్ 21-15తో గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. ఇద్దరూ చెరో గేమ్ గెలవడంతో మూడో గేమ్ హోరాహోరీగా సాగింది. నువ్వా నేనా అన్నట్లు సాగిన మూడో గేమ్‌లో పలుసార్లు ఇద్దరూ పాయింట్లు సమం చేసుకున్నారు. చివరికి 20-22తో శ్రీకాంత్ గేమ్‌ను ఓడిపోవడంతో పాటు మ్యాచ్‌ను కోల్పోయాడు. ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లాండ్ టోర్నీలో శుక్రవారానికి పోరులో నిలిచింది ఇద్దరు భారత క్రీడాకారులు మాత్రమే. అందులో ఒకరు పీవీ సింధు కాగా మరొకరు హెచ్ఎస్ ప్రణయ్. క్వార్టర్స్‌లో భాగంగా శుక్రవారం సింధు.. జపాన్ క్రీడాకారిణి ఒకుహారాతో తలపడనుంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో సింధు ప్రస్తుతం 3వ ర్యాంకులో ఉండగా ఒకుహారా ఆరులో కొనసాగుతుంది. ఈ రోజు వీరిద్దరి పోరు అభిమానులకు కనువిందే. మరో మ్యాచ్‌లో ప్రణయ్.. శ్రీకాంత్‌పై విజయం సాధించిన హుయాంగ్‌తో తలపడనున్నాడు.

అమ్మకానికి ఐపీఎల్ టికెట్లు



ముంబై: ఈ ఏడాది ఐపీఎల్ టికెట్ల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 7న ఐపీఎల్ 11వ సీజన్ ప్రారంభంకానుంది. అదే రోజు ముంబైలో ప్రారంభ వేడుకలు జరగనున్నాయి. అనంతరం వాంఖడే మైదానంలో డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్-చెన్నై సూపర్ కింగ్స్ మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ కోసం ముంబై ఇండియన్స్ టికెట్లు అమ్మకానికి పెట్టింది. ఆన్‌లైన్ ద్వారా ఈ టికెట్లను సొంతం చేసుకోవచ్చని ఈ సందర్భంగా ముంబై ఇండియన్స్ నిర్వాహకులు తెలిపారు. 'సొంతగడ్డపై ముంబై ఇండియన్స్ ఆడే ప్రతి మ్యాచ్ టికెట్లు అందుబాటులో ఉంచాం. కావల్సిన వారు www.mumbaiindians.com వెబ్‌సైట్‌ను ఆశ్రయించండి రూ.800 నుంచి రూ.8వేల మధ్య టికెట్ ధరలు ఉన్నాయి. ఏప్రిల్ 14న ఢిల్లీ డేర్‌డెవిల్స్‌తో జరిగే మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లను మాత్రం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచట్లేదు. ఎందుకంటే రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద చిన్నారులకు ఈ మ్యాచ్ చూసే అవకాశం కల్పించనున్నాం' అని వారు తెలిపారు.

మ్యాచ్‌ల వేదికలు మార్చండి

ముంబై: ఐపీఎల్‌లో భాగంగా మే 12, మే 14న కింగ్స్ ఎలెవన్ పంజాబ్ తన సొంతగడ్డపై ఆడే మ్యాచ్‌ల వేదికలు మార్చాల్సిందిగా పంజాబ్ క్రికెట్ అసోసియే షన్(పీసీఏ) బీసీసీఐకి లేఖ రాసింది. మే 12 నుంచి మే 31 వరకు మరమ్మతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో చండీగఢ్ విమానాశ్రయాన్ని మూసివేస్తున్నారు. ఈ నేపథ్యంలో మే 12న కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో, మే 14న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మొహాలీలో జరిగే మ్యాచ్‌లను లక్నోకు మార్చాల్సిందిగా పీసీఏ, ఐపీఎల్ నిర్వాహకులు.. బీసీసీఐకు లేఖ రాశారు. 'పీసీఏ, ఐపీఎల్ నిర్వాహకులు రాసిన లేఖ అందింది. త్వరలోనే దీనిపై నిర్ణయం వెల్లడిస్తాం' అని బీసీసీఐ ప్రతినిధులు తెలిపారు. రెండు రోజుల క్రితమే కింగ్స్ ఎలెవన్ పంజాబ్ ఈ ఏడాది ఐపీఎల్‌లో ధరించే జెర్సీని ఆవిష్కరించింది. ఎరుపు రంగులోని జెర్సీ అభిమానులకు తెగ నచ్చేసింది. టోర్నీలో భాగంగా పంజాబ్ తన తొలి మ్యాచ్‌ను ఏప్రిల్ 8న ఢిల్లీ డేర్‌డెవిల్స్‌తో ఫిరోజ్‌షా కోట్లా మైదానంలో ఆడనుంది. పంజాబ్ తన సొంతగడ్డపై ఆడే మ్యాచ్‌ల్లో మూడింటిని ఇండోర్‌లో ఆడనున్న సంగతి తెలిసిందే.



అధికారులదే నిర్లక్ష్యం

- అతిసార బాధితులకు పవన్ పరామర్శ
- తక్షణమే మెడికల్ ఎమర్జెన్సీ



విశాలాంధ్రబ్యూరో-గుంటూరు: అతిసార వ్యాధితో మృతిచెందినవారి కుటుంబాలను జనసేన అధినేత పవన్‌కల్యాణ్ శుక్రవారం పరామర్శించారు. విజయవాడ నుంచి బయలుదేరి తొలుత గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. అక్కడ అతిసార వ్యాధితో బాధపడుతున్న రోగులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం అతిసారవ్యాధి ప్రభావిత ప్రాంతమైన ఆనందపేట, సంగడిగుంటలను సందర్శించారు. మృతిచెందిన వారి కుటుంబసభ్యులను కలిశారు. అధికారుల నిర్లక్ష్యవైఖరి వల్లే 15మంది మృత్యువాతపడ్డారని ధ్వజమెత్తారు. కాలం చెల్లిన పైపులైన్లును అధికారులు ముందే మార్పిడి చేసి ఉంటే ఇంతమంది ప్రాణాలు పోయేవి కావన్నారు. దీనికి కారణమైన ప్రతిఒక్క అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. తక్షణమే ప్రభుత్వం మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించి వ్యాధిని పూర్తిగా నియంత్రణలోకి తీసుకురావాలన్నారు. గుంటూరులో విక్రయిస్తున్న నీటిలో కూడా నాణ్యతా ప్రమాణాలు లేవన్నారు. దీనివల్ల కూడా జనం వ్యాధులబారిన పడుతున్నార న్నారు. అతిసార నియంత్రణ కోసం సీనియర్ ఐఏఎస్ స్థాయి అధికారిని నియమించి వారి పర్యవేక్షణలో నియంత్రణ చర్యలు తీసుకోవాలన్నారు. మృతిచెందిన వారి కుటుంబాలు అందరికీ ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని డిమాండు చేశారు. ఎనిమిదేళ్లుగా గుంటూరు నగరపాలక సంస్థకు ఎన్నికలు జరగకపోవడం వల్ల అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నార న్నారు. పాలకమండలి ఉంటే అధికారుల తప్పులను ప్రశ్నించే అవకాశం ఉందన్నారు. అందుకే ఇలాంటి దుస్థితి దాపురించిందన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండు చేశారు. జనసేనపార్టీ జిల్లా నాయకులు, గుంటూరు నేతలు పాల్గొన్నారు.

పాక్ జలసంధిని ఈదనున్న చైతన్య

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: అంతర్జాతీయ స్విమ్మర్ తులసీ చైతన్య ఈనెల 25 పాక్ జలసంధని ఈదనున్నాడు. శ్రీలంకలోని తలైమన్నార్ నుంచి భారతదేశంలో ధనుష్‌కోటి వరకు 32 కిలోమీటర్ల దూరాన్ని (అరేబియా, హిందూ మహాసముద్రం, బంగాళాఖాతం, త్రివేణి సంగమాన్ని), 9 గంటలపాటు ఈది లక్ష్యాన్ని చేరుకోనున్నాడు. పోలీసుశాఖలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తులసీ చైతన్య ఇప్పటికే వరల్డ్ పోలీస్ గేమ్స్ స్విమ్మింగ్‌లో 4 స్వర్ణ పతకాలు, 10 రజత పతకాలను సాధించాడు. ఆల్‌ఇండియా పోలీస్‌గేమ్స్‌లో కూడా 25 స్వర్ణపతకాలు సాధించాడు. తన లక్ష్యాన్ని సాధించేందుకు ఈనెల 17న రామేశ్వరం పయనవుతున్న సందర్భంగా నగరంలోని సర్‌విజ్జి స్విమ్మింగ్‌పూల్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. తాను తొలిసారిగా పాక్‌జలసంధని ఈదడం చాలాసంతోషంగా ఉందన్నారు. పోలీసుశాఖతోపాటు, జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు. పాలజలసంధిలో జెల్లీ ఫిష్, షార్క్ చేపలు ఉంటాయని తెలిపారు. జెల్లీఫిష్ శరీరానికి అంటుంటే కాలుతుందని, ఎంతో జాగ్రత్తగా స్విమ్మింగ్ చేయల్సి ఉంటుందన్నారు. ఓ పైలెట్ బోటు తనను పర్యవేక్షిస్తుందని, తొమ్మిది గంటలపాటు ఈదాల్సి రావడంతో మధ్యమధ్యలో ద్రవాహారం తీసుకుంటామన్నారు. సాధారణంగా ఫ్రీస్టయిల్‌లో స్విమ్మింగ్ చేస్తామని, కొన్ని సందర్భాల్లో బ్రెస్ట్, బ్యాక్ స్ట్రోక్‌ల ద్వారా లక్ష్యాన్ని చేరుకోవాల్సి ఉంటుందన్నారు. కొన్ని రోజులుగా సర్‌విజ్జి స్విమ్మింగ్‌పూల్, కృష్ణానదిలో బి.గణేష్, పిడారు విశ్వనాధ్ సత్యనారాయణ, సీనియర్ ఐఎస్‌పీ రాఘవ సహకారంతో ప్రాక్టీస్ చేసినట్లు చెప్పారు. స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఐ.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.